ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు

మీ ఆర్థిక అవసరాల ఆశయసాధన
కపిల్ చిట్స్
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

2-12-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 301 పేజీలు: 12 వెల: 6.50



# తొలిరోజే రగడ..రగడ

### 'సర్'పై చర్చకు విపక్షాలు పట్టు, ఉభయ సభలు పలుమార్లు వాయిదా

### గందరగోళం మధ్యే బిల్లులు ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి

### మణిపూర్ జిఎస్‌టి బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు తొలిరోజే ఉభయ సభల్లో రభస చోటు చేసుకుంది. ఎస్ఐఆర్‌పై చర్చ చేపట్టాలని విపక్షాలు పట్టుబట్టాయి. లఘు చర్చకు అవకాశమిస్తామని ప్రభుత్వం హామీఇచ్చినా ప్రతిపక్ష సభ్యులు ఆందోళన చేపట్టారు. దీంతో ఉభయ సభలు పలుమార్లు వాయిదా పడ్డాయి.లోక్‌సభ ప్రారంభమైన వెంటనే ప్రతిపక్ష కాంగ్రెస్ నేతృత్వంలో >>2

# సిఎం చంద్రబాబుపై కేసు క్లోజ్

**విజయవాడ,డిసెంబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్ జగన్ హయాంలో చంద్రబాబుపై పెట్టిన లిక్కర్ పాలసీ అక్రమాల కేసులో దర్యాప్తు పూర్తయినట్లుగా సీఐడీ కోర్టుకు తెలిపింది. అక్రమాలు జరిగినట్లుగా ఆధారాలేమీ లేకపోవడంతో కేసును క్లోజ్ చేస్తూ కోర్టు నిర్ణయం తీసుకుంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో 2023 అక్టోబర్ 30న ఎక్సైజ్ పాలసీలో అక్రమాలు జరిగాయని సీఐడీ కేసు నమోదు చేసింది. 2014-19 మధ్య ఎక్సైజ్ పాలసీలో అక్రమాలు, డిస్టిలరీలకు అర్హత లేకపోయినా లైసెన్సులు ఇవ్వడం, కొంతమంది సప్లయర్లకు ప్రయోజనాలు కల్పించారని కేసులు నమోదు చేశారు. సీఎంగా ఉన్న సమయంలో మద్యం తయారీ కంపెనీలకు అనుమతుల విషయంలో చంద్రబాబు అక్రమాలకు పాల్పడ్డారని సీఐడీ అభియోగాలు మోపింది. పీసీ యాక్ట్ తో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసింది. కొన్ని మద్యం తయారీ సంస్థలకు ప్రయోజనం చేకూరేలా చంద్రబాబు సర్కార్ వ్యవహరించిందని ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ మేరకు ఏపీ బేవరేజేస్ ఎండీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఏ1 గా సుధాకర్, ఏ2 కొల్లు రవీంద్, ఏ3 చంద్రబాబు పేర్లను ఏపీ సీఐడీ నమోదు చేసింది. గత ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చినప్పటికీ 2023లో రెండు బేవరేజీలు, మూడు డిస్టిలరీలకు >>2



సోమవారం దిత్వా ప్రభావంతో నెల్లూరులో నీట మునిగిన ఇళ్లు

# బలహీనపడిన 'దిత్వా'

## కోస్తా, రాయలసీమలో అక్కడక్కడ వర్షాలు

**విజయవాడ,డిసెంబరు 1,ప్రభాతవార్త ప్రతినిధి:** తమిళనాడు,పుదుచ్చేరి తీరం వెంట ఉత్తరం దిశగా కదులుగూ రెండు రోజులుగా తీరప్రాంత జిల్లాల ప్రజల్ని వణికిస్తున్న దిత్వా తుఫానున ఆదివారం సాయంత్రం తీవ్ర వాయుగుండంగా బలహీనపడింది. సోమవారం ఉదయానికి ఇది మరింత బలహీనపడి వాయుగుండంగా మారే అవకాశం ఉంది. ఫలితంగా రాష్ట్రంపై వర్షాల ప్రభావమూ తగ్గనుంది. తుఫాను ప్రభావంతో ఆదివారం ఉదయం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ముసురు వాతావరణం నెలకొంది. చిరుజల్లులు కురిశాయి. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, తిరుపతి జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసాయి.తీవ్ర వాయుగుండం ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమలో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. తీరం వెంట గంటకు 45 నుంచి 65 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని,సముద్రం అలజడిగా ఉంటుందని,విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.సోమవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు,తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా భారీ >>2

# విజన్‌తోనే అభివృద్ధి

### కోకాపేట భూముల ధరలే ఉదాహరణ

### పుష్కరాలకు ముందే 'పోలవరం' పూర్తి

### కూటమికి ప్రజాసంక్షేమమే పరమావధి

### పెన్షన్ల కోసం 18నెలల్లో రూ.50,763 కోట్లు ఖర్చుచేశాం

### తలపూడి లిఫ్ట్ పూర్తి చేసి రైతులకు అందిస్తాం

### ఉంగుటూరులో 'ఎన్టీఆర్ భరోసా' లో సిఎం చంద్రబాబు



సోమవారం ఉంగుటూరులో ప్రజావేదిక సభలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**ఏలూరు జిల్లా, డిసెంబరు 1 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 18 నెలల్లో పెన్షన్ల పంపిణీ కోసమే రూ. 50,763 కోట్లు ఖర్చు చేశామని, దేశంలో ఎక్కడా ఈ స్థాయిలో సంక్షేమం కోసం వ్యయం చేస్తున్న రాష్ట్రం మరొకటి లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించే అవకాశం ప్రజలు తమకు ఇచ్చారని ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టే సూపర్ సిక్స్ విజయవంతంగా అమలు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గం గోపీనాథపట్నంలో పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తురాలు నాగలక్ష్మి ఇంటికి వెళ్లి పింఛను అందజేశారు. ఆమె ఆరోగ్య పరిస్థితి వివరాలు అడిగి తెలుసుకుని మెరుగైన >>2

# వల్లభనేని అనుచరులు కోర్టులో లొంగుబాటు

**విజయవాడ, డిసెంబరు 1, ప్రభాతవార్తప్రతినిధి:** గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో మాజీ ఎంఎల్ఏ వంశీతో పాటు ఆయన అనుచరులు నిందితులుగా ఉన్నారు.వారంతా విజయవాడ కోర్టులో సోమవారం లొంగిపోయారు. వారంతా కొంత కాలం నుంచి అజ్ఞాతంలో ఉన్నారు. >>2

# జోగి బ్రదర్స్ నెల్లూరు తరలింపు

### ముగిసిన కస్టడీ

**విజయవాడ, డిసెంబరు1, ప్రభాత వార్తప్రతినిధి:** నకిలీ మద్యం కేసులో నిందితునిగా ఉన్న మాజీ మంత్రి జోగి రమేష్,అతని సోదరుడు రాము మరో పర్యాయం పోలీసు కస్టడీకి అడిగేందుకు ఎక్సైజ్ పోలీసులు కోర్టును ఆశ్రయించనున్నారు.ఇప్పటికే నాలుగురోజులు వారిని కస్టడీలోకి తీసుకుని ఎక్సైజ్ పోలీసులు విచారణ జరిపారు. నిన్నటితో ఈ విచారణ ముగిసింది.ఈ విచారణలో కీలక ఆధారాలను ముందుంచి ప్రశ్నించినా ఏమాత్రం నోరు విప్పలేదు. నోరు తెరిచినా 'మాకు తెలీదు. సంబంధం లేదు. గుర్తు లేదు'అని మొక్కుబడి సమాధానాలతోనే జోగి సోదరులు సరిపుచ్చారు. మాజీ మంత్రి జోగి రమేష్ (ఏ18),అతని సోదరుడు రాము(ఏ19) కస్టడీలో విచారణకు సహకరించలేదని తెలిసింది. నాలుగు రోజుల పాటు నకిలీ మద్యం కేసులో సిట్ అధికారులు వీరిని కస్టడీకి తీసుకున్నారు. ప్రశ్నించేందుకు మొదటి రోజు 30 నిముషాలే దొరికింది. ఇంకోరోజు కస్టడీ కావాలని కోర్టులో వేసిన పిటీషన్‌కు అనుమతి లభించడంతో ఆదివారం కూడా విచారించారు. ఐదు రోజుల విచారణ అనంతరం సాయంత్రం వైద్య పరీక్షలు చేయించి ఎక్సైజ్ కోర్టులో >>2

# అనిల్ చోక్రాకు 3 రోజుల కస్టడీ

### ఎపి లిక్కర్ స్కాం కేసు

**విజయవాడ, డిసెంబరు 1, ప్రభాతవార్తప్రతినిధి:**ఏపీ లిక్కర్ స్కాం కేసులో అనిల్ చోక్రాను 3 రోజుల కస్టడీకి ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. ఏ49 నిందితుడిగా ఉండి విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా అనిల్ చోక్రా ఉన్నాడు. అతడిని పోలీసులు గత నెలల్లో ముంబాయిలో అరెస్ట్ >>2

# కలవర పెడుతున్న కొత్త జ్వరాలు!

### రాష్ట్రంలో 1317 స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసులు

### కీటకం కుట్టడంతో అనారోగ్యానికి గురై విజయనగరం ప్రాంతం మహిళ మృతి

**విజయవాడ,డిసెంబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో వింత జ్వరం ప్రజలను వణికిస్తుంది.కొత్త మట్టిపురుగు స్క్రబ్ టైఫస్ ద్వారా వ్యాపిస్తున్న ఈ జ్వరంతో ప్రాణాంతక పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఏపీలో 1317 స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసులు. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం మిట్టపల్లి గ్రామంలో గత కొంతకాలంగా జ్వరంతో బాధపడుతున్న రాజేశ్వరి(36) అనే మహిళ, ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లగా, స్క్రబ్ టైఫస్ సోకిందని నిర్ధారించిన వైద్యులు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. ఈ స్క్రబ్ టైఫస్ వ్యాధి రాష్ట్రంలో అన్ని జిల్లాలో వ్యాపిస్తుండటంతో భయాందోళనకు గురవుతున్న ప్రజలు చిత్తూరులో 379, కాకినాడలో 141, విశాఖపట్నంలో 123, వైఎస్సార్ కడపలో 94, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరులో 86, అనంతపురంలో 68, తిరుపతిలో 64, విజయనగరంలో 59, కర్నూలులో 42, అనకాపల్లిలో 41, శ్రీకాకుళంలో 34, అన్నమయ్యలో 32, గుంటూరులో 31, నంద్యాలలో 30 కేసులు నమోదైనట్లు తెలిపిన వైద్య శాఖ వ్యాధి నిర్ధారణ జరిగితే సాధారణ యాంటిబయాటిక్స్ తో ఈ వ్యాధి నయం అవుతుందని, అస్వస్థతకు గురవ్వగానే నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

మూడేళ్ల క్రితం ఢిల్లీ, తమిళనాడులో కనిపించిన స్క్రబ్ టైఫస్ అనే జ్వరాలు ఇప్పుడు కృష్ణా జిల్లాలో ముఖ్యంగా మచిలీపట్నం నుంచి వచ్చే రోగుల్లో నమోదు అవుతున్నాయని అంటున్నారు కొందరు డాక్టర్లు. చాలా కాలం హై ఫివర్, ప్లేట్ లెట్స్ పడిపోవడం వంటివి దీని లక్షణాలుగా వారు చెబుతున్నారు. ఈ వ్యాధి వచ్చిన వాళ్ళు వెంటనే సరైన వైద్యం తీసుకోకుంటే కొన్నిసార్లు ప్రాణాంతకమయ్యే ప్రమాదం ఉందని కృష్ణా జిల్లా నుంచి వస్తున్న కేసుల్లో ఇలాంటి లక్షణాలు కనిపిస్తున్నాయని విజయవాడకు చెందిన ఊపిరి హాస్పిటల్స్‌లో ఎండీగా పని చేస్తున్న ద్వీ. రఘు రామ్ ఒక వీడియోలో తెలిపారు. అయితే విజయవాడ నుంచి జ్వరంతో వచ్చిన వాళ్లలో ఈ వ్యాధి ఇంత వరకూ కనిపించలేదని ఆయన అన్నారు .మట్టిలో ఉండే చిన్న నల్లిలాంటి క్రిమి కాటుతో ఈ వ్యాధి వస్తుంది. చాలా కాలం జ్వరం ఉండడం ప్లేట్లు లెట్స్ పడిపోవడంతో ఇది "డెంగీ " అని భ్రమ పడతారు. కానీ నిర్ణీత పరీక్షలతో ఈ వ్యాధిని నిర్ధారించవచ్చని డాక్టర్స్ చెబుతున్నారు. అందుకే సాధారణ జ్వరం అని ఆలస్యం చేయకుండా లక్షణాలు కనిపించగానే డాక్టర్ వద్దకు వెళ్లాల్సిందిగా వారు ప్రజలకు సూచిస్తున్నారు.

ఎక్కువ కాలం జ్వరం ఉండటం,విపరీతమైన ఒంటి నొప్పులు, తలనొప్పి, కొన్ని సార్లు తలనొప్పి,ప్లేట్ లెట్స్ పడిపోవడం, క్రియాటిన్ పెరగడం సాధారణంగా శీతాకాలంలో అక్కడక్కడా ఈ వ్యాధి కనిపిస్తుందని ఎక్కువగా కొండ ప్రాంతాల్లో కనిపించే ఈ పురుగు ఇప్పుడు సిటీల్లో సైతం కనిపించడం ఆందోళన కలిగిస్తుందని వైద్యులు అంటున్నారు. మట్టిలో కలిసిపోయే ఈ పురుగు కాటు వల్ల ప్లేట్ లెట్స్ పడిపోతాయని నిర్లక్ష్యం చేస్తే బాడీలో మల్టీపుల్ ఆర్గాన్స్ దెబ్బ తినే ప్రమాదం ఉందని డాక్టర్స్ అభిప్రాయ పడుతున్నారు. ముఖ్యంగా ఊపిరితిత్తులకు ఈ వ్యాధి సోకితే అలాంటివారు రికవర్ కావడం కాస్త కష్టం అని డాక్టర్ రఘురామ్ అభిప్రాయపడ్డారు. ఇది అంతా ప్రజల్లో అవగాహన పెంచడం కోసమేనని అయన అన్నారు.

# ఆ 5గురు ఎమ్మెల్సీలు విచారణకు హాజరు

### రాజీనామాలు ఆమోదించాలని కౌన్సిల్ చైర్మన్‌కు వినతి

**సచివాలయం,డిసెంబరు 1,ప్రభాతవార్త :** శాసన మండల సభ్యులుగా వైకాపాకు రాజీనామా చేసిన ఐదుగురు ఎమ్మెల్సీలు మా రాజీనామాలు ఆమోదించాల్సిందిగా శాసనమండలి చైర్మన్ మోషన్ రాజుకు తమ అభిప్రాయాన్ని తెలియజేశారు.గతంలోనే రాజీనామా చెసినప్పటికీ ఆమోదించకపోవడంతో ఎమ్మెల్సీ జయ మంగళం వెంకటరమణ కోర్టు ను ఆశ్రయించారు.ఈ విషయంపై న్యాయస్థానం ఎమ్మెల్సీల రాజీనామాలపై విచారణ చేయాల్సిందిగా న్యాయస్థానం ఉత్తరువుల్లో సూచించింది.ఈ కారణంగా కర్రి పద్మశ్రీ పోతుల సునీత,బల్లి కళ్యాణ్ చక్రవర్తి మర్రి రాజశేఖర్,జయ మంగళ వెంకటరమణ ఐదుగురు ఎమ్మెల్సీలను శాసనమండలి వద్ద రాజీనామాలు గల కారణాలను చైర్మన్ అడిగి తెలుసుకున్నారు.పార్టీలు మారినందున వైకాపా ఎమ్మెల్సీలుగా కొనసాగలేమని చైర్మన్‌కు వివరించారు.సభ్యుల నుంచి కారణాలు తెలుసుకోకుండా రాజీనామాలు ఆమోదించక పోవడం జరిగిందని తెలిపారు.అందువలన వారి వ్యక్తిగత అభిప్రాయాలను తెలుసుకునేందుకు పిలిపించి విచారించామని దీనిపై పరిశీలించి త్వరలో రాజీనామా విషయాలపై స్పందిస్తానని మండల చైర్మన్ వివరించారు.పోతుల సునీత విచారణకు హాజరు కాలేదు. శాసనమండలిలో వైకాపా ఎమ్మెల్సీగా కొనసాగలేమని రాజీనామాలు దయతో ఆమోదించాలని మర్రి రాజశేఖర్ చైర్మన్ కోరినట్లు విలేకరులకు తెలిపారు.సోమవారం చైర్మన్ విచారణ అనంతరం శాసనమండలి బయట లేఖలతో మాట్లాడుతూ గతంలోనే టిడిపిలో చేరినందున ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు.వైకాపాలో గౌరవం లేనందునే అవమానాలు భరించలేక టిడిపిలో చేరినట్లు వివరించారు.ఆ పార్టీలో వ్యక్తిగతంగా ఒక కులాన్ని టార్గెట్‌గా చేసి అవమానిస్తున్నారని వివరించారు.పార్టీకి 10సంవత్సరాలు సేవ చేసినప్పటికీ మంత్రి పదవి ఇస్తామని చివరి సంవత్సరం ఎమ్మెల్సీగా ఇచ్చి అవమానించారని తెలిపారు. అందువలన గౌరవం లేని పార్టీలో ఇమడలేక టిడిపిలో గౌరవంతో కొనసాగాలని పార్టీ మారినట్లు అభిప్రాయాన్ని తెలిపారు. **అధికార పార్టీలో చేరి ప్రతిపక్ష ఎమ్మెల్సీగా కొనసాగనున్న ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ:** ఎన్నికల అనంతరం టిడిపికి ప్రజల పట్టకం కట్టడంతో ఎమ్మెల్సీగా ఉన్న నేను ప్రజాభిప్రాయాన్ని గౌరవిస్తూ అధికారపక్షంలో చేరినట్లు వైకాపా ఎమ్మెల్సీ తెలిపారు. >>2

# సిఐడి నివేదికే కీలకం



### 35మందికిపైగా విచారణ,150 పేజీలు పైగా సమాచారం సేకరణ

### పరకామణి చోరీ కేసులో హైకోర్టు తీర్పు కోసం నిరీక్షణ

### నిందితుడిని కాపాడిన సూత్రధారుల అరెస్ట్ తప్పదా!?

**తిరుమల,డిసెంబరు 1ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పరకామణిలో చోరీ కేసు విచారణ చేపట్టిన సిఐడి అధికారులు పూర్తినివేదికలను ఈరోజు (మంగళవారం) హైకోర్టుకు సమర్పించనున్నారు. ఈనేపథ్యంలో గతనెల 6వతేదీ నుండి డిసెంబర్ 1వరకుదాదాపు 26రోజులు వరుసగా సిఐడి డిజి రవిశంకర్ అయ్యన్నార్, ఆయన నేతృత్వంలోని అధికారుల బృందం హైకోర్టు ఆదేశాలతో సమగ్రంగా దర్యాప్తు చేసింది. 2023లో పరకామణిలో చోరీ జరిగిన ఘటనపై నమోదైన కేసుపై తిరుమల వన్‌టౌన్ పోలీసుస్టేషన్ నుండి సిడి రికార్డులు, ఎఫ్ఐఆర్‌ను, సిసిటివి ఫుటేజీలను కూడా స్వాధీనం చేసు కున్నారు. స్వయంగా సిఐడి డిజి పరకామణి భవనంలోకి చేరుకుని కానుకల లెక్కింపు,నోట్లు,నాణేలు వేరు చేయడం, లెక్కించడం, భద్రతాపరమైన అంశాలను స్వయంగా పరిశీలించారు .అక్కడ సిసికెమెరా ఆపరేటర్ చంద్రనుండి కూడా వివరాలు రాబట్టారు. కొన్ని సిసిపుటేజీలు >>2

# ప్రజల కంట్లో గుంటూరు 'కల్తీ' కారం



### మిరపకాయలు లేకుండానే కారం తయారు చేస్తున్న కేటుగాళ్లు?

### ప్రజల ఆరోగ్యంతో మిల్లర్ల యజమానులు, ఏజెంట్ల చెలగాటం

### రూ.కోట్లకు పడగలెత్తిన బడాబాబులు

### మొద్దు నిద్రలో అధికార యంత్రాంగం

**గుంటూరు మిర్చి యార్డు, డిసెంబరు 1, ప్రభాతవార్త :** గుంటూరు మిర్చి యార్డును అడ్డాగా చేసుకొని చుట్టుపక్కల కొంతమంది మిల్లుల యజమానులు, ఏజెంట్లు కేంద్రాలను ఏర్పాటు చేసి కల్తీ కారంను అడ్డగోలుగా సరఫరా చేస్తున్నారు... గుంటూరు మిర్చి మార్కెట్ ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్‌గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఇంత పెద్దస్థాయిలో గుర్తింపు పొందిన గుంటూరు మార్కెట్ యార్డు చుట్టు పక్కల కొన్ని మిల్లులను ఏర్పాటు చేసి నాణ్యమైన కారం అంటూ ప్రజలు గుర్తించలేని విధంగా కొంతమంది కారం విక్రయ ఏజెంట్లు మిల్లుల యజమానులు కలిసి కల్తీ కారాన్ని తయారుచేసి వారి కళ్ళల్లో కొడుతున్నారు. వాస్తవానికి మంచి నాణ్యమైన మిరపకాయలను కొనుగోలు చేసి కారం తయారు చేసుకునేందుకు ప్రతి ఇంట్లో గృహిణిలు ఇష్టపడతారు. అయితే గుంటూరు కేంద్రంగా ఇక్కడ తయారుచేస్తున్న కల్తీ కారంలో అసలు మిరపకాయలే లేకుండా తయారు చేస్తున్నారంటే ప్రతి ఒక్కరూ ఆశ్చర్యానికి గురికాక తప్పని పరిస్థితి దాపురించింది. మిరపకాయల నుంచి తీసి పడేసిన కేవలం తొడిమెలతో కారం తయారు చేయడం ఒక పద్ధతైతే, గర్భాలు పోయిన కాయలను, ఫంగస్ వచ్చి చెడిపోయిన కాయలతో పూర్తిగా పాడైపోయిన తాలుకాయలు సేకరించి కల్తీ కారం తయారు చేసి మార్కెటింగ్ చేయటంలో సిద్ధహస్తులుగా మారారు. ఇలా తయారుచేసిన పొడిలో పామాయిల్‌ని మిక్స్ చేసి, రంగులు కలిపి నాణ్యమైన కారంగా తక్కువ ధరకే అమ్ముతున్నాం అంటూ మార్కెటింగ్ వ్యాపారం చేసే కల్తీ కేటుగాళ్లు కోట్ల సంపాదనకు పడగలెత్తారు. ఇటువంటి కారాన్ని ఏపీలోని అన్ని జిల్లాలతో పాటు ఇతరరాష్ట్రాలకు కూడా ఎగుమతి చేస్తున్నారంటే ఈ కల్తీకారం వ్యాపారం ఎంత పెద్ద స్థాయిలో జరుగుతుందో ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవచ్చు. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇది కల్తీ కారం అని తెలియక తినటం వల్ల అనేకమంది పెద్దల నుంచి చిన్నపిల్లల వరకు అనారోగ్యాలకు గురవుతున్నారు. దీనివల్ల అనారోగ్యాలకు గురై ఆసుపత్రిచుట్టూ తిరుగుతూ >>2

# విజన్‌తోనే అభివృద్ధి

>> వైద్యం అందించాలని ఆదేశించారు. అనంతరం ప్రజా వేదిక సభకు హాజరై ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఏటా రూ.32,143 కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.1 లక్షా 65 వేల కోట్లు పింఛన్ల కోసమే ఖర్చు చేస్తున్నాం. పొరుగు రాష్ట్రాలు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, అతిపెద్ద రాష్ట్రం యూపీలోనూ ఈ స్థాయిలో అక్కడి ప్రభుత్వాలు వ్యయం చేయటం లేదు. 63 లక్షల పైచిలుకు మందికి రూ.2,739 కోట్లు పెన్షన్ల రూపంలో అందిస్తున్నాం. రాష్ట్రంలోని ప్రతీ వంద మందిలో 13మందికి పెన్షన్లు అందిస్తున్నాం. ప్రతినెలా పింఛన్లు అందు కుంటున్న వారిలో 59 శాతంమంది మహిళలే. అంటే ఇప్పటి వరకు ఇచ్చిన రూ.50వేల కోట్లలో రూ.30 వేల కోట్లు ఒక్క మహిళలకే ఇచ్చాం. గత ప్రభుత్వంలో భర్త చనిపోతే భార్యకు పింఛన్ అందలేదు. కూటమి ప్రభుత్వంలో ఆ ఇబ్బందుల లేవు. ఈ నెలలో కొత్తగా 7,533మందికి రూ.3కోట్లతో వితంతు పింఛన్లు ఇస్తున్నాం. గడిచిన ఐదేళ్లలో ఒక్క నెల పింఛను తీసుకోకపోయినా ఎగ్గొట్టేవారు. ప్రభుత్వంలో 2నెలలుగా పెన్షన్ తీసుకోని 1,39,677 మందికి రూ.114 కోట్లు, 3 నెలలుగా పెన్షన్ తీసుకోని 13,325 మందికి రూ.16 కోట్లు విడుదల చేశాం. 1984లో ఎన్టీఆర్ పింఛన్లకు శ్రీకారం చుట్టారు. దాన్ని క్రమంగా పెంచుతూ ప్రస్తుతం రూ.4000 ఇస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులున్నా బాధ్యతగా ప్రతి నెలా ఒకటో తేదీన ఠంచనుగా పింఛను అందిస్తుంటే...గత ప్రభుత్వంలో ఐదేళ్లు ముక్కుతూ,మూలుగుతూ రూ.250 మాత్రమే పెంచారు. అని సీఎం చంద్రబాబు అన్నారు. ఓ వైపు సంక్షేమం అమలు చేస్తూనే మరో వైపు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నాం. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే వారందరికీ తల్లికి వందనం కింద రూ.15వేలు ఆర్థిక సాయం అందిస్తున్నాం. జనాభా సమతౌల్యం కోసం ఆలోచన చేయాలి. అప్పుడే దేశం, రాష్ట్రం అగ్రస్థానంలో నిలుస్తాయి. కానీ కాలక్రమంలో జనాభా తగ్గుదల ఆందోళన కలిగి స్తోంది. దీపం2 కింద ఏటా 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఇప్పటి వరకు 2.85 కోట్ల సిలిండర్లు ఉచితంగా అందించాం. ఇందుకోసం రూ. 2,104 కోట్లు ఖర్చు చేశాం. స్త్రీ శక్తి పథకం కింద ఉచిత బస్సులో నేటి వరకు మహిళలు 25 కోట్ల ప్రయాణాలు చేశారు. గత ఐదేళ్లలో స్కూళ్లలో కనీసం సరిపడా టీచర్లు కూడా లేరు. కూటమి ప్రభుత్వం వచ్చాక మెగా డీఎస్సీతో 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. వ్యవసాయం చేసే రైతు నష్టపోకుండా ఉండేందుకు పంచ సూత్రాలు అమలు చేస్తున్నాం. డిసెంబర్ 3వ తేదీన రైతన్నా మీకోసం పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. సమాజంలో ఆహారపు అలవాట్లు మారుతున్నాయి. వాటికి తగ్గనట్లు మనం కూడా సాగు విధానం మార్చుకోవాలి. రైతులు డిమాండ్ ఆధారిత పంటలను సాగు చేయాలి. ఆరోగ్య సమస్యల భయంతో ప్రపంచవ్యాప్తంగా అన్నం తినే వారి సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నాం. ఆక్వా కల్చర్ అభివృద్ధి చెందేందుకు రూ.850 కోట్ల వ్యయాన్ని ప్రభుత్వం భరిస్తుంది. ధాన్యం కొనుగోలు చేసిన 24 నుంచి 48 గంటల్లోనే డబ్బులు రైతుల అకౌంట్లలో వేస్తున్నాం. జిల్లాలో వ్యవసాయరంగానికి ప్రాధాన్యత ఇస్తూనే పరిశ్రమలు తీసుకొస్తున్నాం. కొబ్బరి, కోకో, కాఫీ లాంటి పంటలకు ఈ ప్రాంతం అనువైనది. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు కూడా రావాలి. దశాబ్దాలుగా నెలకొన్న కొల్లేరు సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేస్తాం. చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేస్తాం. అన్ని చెరువులకు నీరందిస్తాం అని సీఎం చంద్రబాబు అన్నారు. మరో 15 ఏళ్ల కూటమి అధికారంలో ఉండాలని మిత్రులు పవన్ కల్యాణ్ ఎప్పుడూ అంటుంటారు. ఇటీవల విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సులో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇప్పటికే రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. 2027 నాటికి గోదావరి పుష్కరాలకంటే ముందే పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం.

పోలవరం పూర్తయితే నీటి ఎద్దడి ఉండదు. పొలాలకు రేట్లు పెరుగుతాయి. హైదరాబాద్‌లో చేసిన అభివృద్ధి ఫలాలు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు కోకాపేటలో ఎకరా రూ.10 వేలు ఉంటే నేడు రూ.160 కోట్ల వరకూ వెళ్లింది. అభివృద్ధి జరిగితే భూముల ధరలు పెరుగుతాయి. కియా కార్ల పరిశ్రమ రాకతో అనంతపురం పెనుగొండ ప్రాంతంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అక్కడ ఎకరం రూ.10 లక్షలు ఉండే భూమి ఇప్పుడు కోట్లలో పలుకుతోంది. ఏపీ అభివృద్ధి లక్ష్యంగా మూడు ప్రాంతీయ జోన్లు ఏర్పాటు చేస్తున్నాం. అమరావతి పనులు వేగంగా జరుగుతున్నాయి. 2028 నాటికి అమరావతి ఫేజ్ 1 పనులు పూర్తవుతాయి. ప్రపంచంలోనే సుందర నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతాం. తిరుపతిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారథి ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.


సోమవారం గోపీనాథపట్నంలో కిడ్నీ వ్యాధిగ్రస్తురాలు నాగలక్ష్మి కుటుంబంతో సిఎం చంద్రబాబు

# ప్రజల కంట్లో గుంటూరు 'కల్తీ' కారం

>> తమ జేబులకు చిల్లులు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. అసలు ఎందువల్ల ఇటువంటి కొత్త రోగాలు వస్తున్నాయి అని గుర్తించలేని స్థితిలో వైద్య అధికారులు అప్పటికప్పుడు వాళ్లకు తోచిన వైద్యం అందించటం జరుగుతుంది. ప్రజలు ప్రాణభయంతో వైద్యులు అడిగినంత కట్టాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. చివరకు ఇటువంటి కల్తీల వల్ల అనారోగ్యాలకుగురవుతున్నామని అనేకమంది గుర్తించలేకపోవడం హాస్యాస్పదం. ఈ కల్తీ కారం గుట్టు గమనించి అనేకమంది నివ్వెర పోవాల్సిన పరిస్థితి ఎదురైందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గుంటూరు కేంద్రంగా జరుగుతున్న ఈ కల్తీ కారం దందా, యదేచ్ఛగా జరుగుతున్నా ప్రభుత్వ అధికార యంత్రాంగం మొ ద్దు నిద్ర వీడటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భారీ స్థాయిలో రంగులు కలిపిన కల్తీ కారం వ్యాపారం జరుగుతున్న ఎటువంటి దాడులు జరగకపోవడమే ఇందుకు నిదర్శనం అనే అనుమానాలు స్పష్టం చేస్తున్నాయి. రాజకీయ నాయకుల పలుకుబడి కలిగిన వ్యక్తులు కావడం వల్లే అధికారులకు తెలిసి కూడా ఇదంతా జరుగుతుందా అని కూడా అనేకమంది అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల జేబులు నింపటం వల్లే రంగు కలిపిన కల్తీ కారం తయారుచేసే ఏజెంట్లు, మిల్లుల యజమానుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుందని స్థానికంగా గుంటూరు మిర్చి యార్డులో, ఆ చుట్టు పరిసర ప్రాంతాలకు చెందిన అనేకమంది వ్యాపారులు ప్రజల మధ్య చర్చనీయాంశమైంది. ఇక్కడ ఇంత ఘోరం జరుగుతున్నా ఫుడ్ సేఫ్టీ కంట్రోల్ ఆఫీసర్లు, విజిలెన్స్ విభాగం అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి ఇటువంటి అక్రమాలకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# సిఎం చంద్రబాబుపై కేసు క్లోజ్

>> లబ్ది చేకూర్చేందుకు మద్యం పాలసీని మార్చారని అప్పటి ఏబీ బేవరేజెస్ ఎండీ ఫిర్యాదు చేశారు. కొన్ని మద్యం తయారీ సంస్థలకు ప్రయోజనం కలిగేలా 2012 ఎక్సైజ్ పాలసీని మార్చారని .. 2015లో కొత్త ఎక్సైజ్ పాలసీ తీసుకు వచ్చిన ప్రభుత్వానికి పన్నులు రాకుండా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సంస్థ ఫిర్యాదు మేరకు ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది. అయితే అప్పటి , ఇప్పటికి బేవరేజెస్ ఎండీలు ఎలాంటి అవకతవకలు జరగలేదని ఆధారాల్లేవని చెప్పినట్లుగా తెలుస్తోంది. ఆధారాలు లేని విషయాన్ని సీఐడీ కోర్టుకు తెలిపింది. దాంతో కోర్టు మూసివేసింది. ఇటీవలే చంద్రబాబుపై గత ప్రభుత్వం పెట్టిన ఫైబర్‌నెట్ కేసును కూడా కోర్టు మూసివేసింది. ఈ కేసులో ఎలాంటి అక్రమాలు జరగలేదని, సంస్థకు ఎటువంటి ఆర్థిక నష్టం వాటిల్లలేదని సీఐడీ దర్యాప్తులో తేలింది. ఈ కేసుకు సంబంధించి ఫైబర్‌నెట్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. మధుసూదన రెడ్డి, ప్రస్తుత ఎండీ గీతాంజలి శర్మ ఏసీబీ కోర్టుకు హాజరయ్యి సీఐడీ సమర్పించిన తుది నివేదికతో తాము పూర్తిగా ఏకీభవిస్తున్నామని, కేసు మూసివేతకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని వారు లిఖితపూర్వకంగా, మౌఖికంగా కోర్టుకు తెలిపారు. దాంతో కేసును కోర్టు మూసివేసింది.

# బలహీనపడిన 'దిత్వా'

>> నుంచి అతి భారీ వర్షాలు అంబేద్కర్ కోనసీమ,పశ్చిమగోదావరి, కృష్ణా,గుంటూరు, బాపట్ల,పల్నాడు,ప్రకాశం,వైఎస్సార్ కడప,అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కాకినాడ,తూర్పుగోదావరి, ఏలూరు,ఎన్టీఆర్, కర్నూలు, నంద్యాల,అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురవచ్చని విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేసింది.దిత్వా తుఫాను దృష్ట్యా రైతులు ఆందోళన చెందుతున్నారు. మారిన వాతావరణ పరిస్థితుల్లో ఆరుగాలం శ్రమించి పండించిన పంట ఎక్కడ నేలపాలవుతుందనే భయం వారిని వెంటాడుతోంది. దాంతో వరి పంట పూర్తి స్థాయిలో కోతకు రాకపోయినా ముందస్తుగానే కోసేస్తున్నారు. ఒక్కసారిగా అన్నదాతలు పంట కోత పనులు చేపట్టడంతో కూలీలు, యంత్రాలకు డిమాండ్ ఏర్పడింది. గతంలో యంత్రంతో ఎకరా పంట కోయడానికి రూ.2500 ఉండగా, ప్రస్తుతం రూ.4 వేలకు పైనే తీసుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. యంత్రాలు,కూలీల కొరత ఉండడంతో కృష్ణాజిల్లా కంకిపాడు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన కౌలు రైతు కొలుగుమట్టి నాగేశ్వరరావు రాత్రివేళ హార్వెస్టర్‌తో పంటను కోయించారు. తుఫాను నేపథ్యంలో రాష్ట్రంలో పరిస్థితిని హోంమంత్రి అనిత ఆర్టీజీఎస్ కార్యాలయం నుంచి సమీక్షించారు. తదనుగుణంగా అధికారులకు ఆమె ఆదేశాలు జారీ చేసారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు,తిరుపతి,వైఎస్సార్ కడప, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ప్రజల్ని అప్రమత్తం చేయాలని,ప్రాణనష్టంలేకుండా చూడాలని చెప్పారు. దిత్వా తుఫాను దృష్ట్యా దక్షిణ కోస్తా,రాయలసీమ, జిల్లాల విద్యుత్‌శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. తుఫాను సన్నద్ధతపై టెలికాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో ఆయన సమీక్షించారు.

# దిత్వా ప్రభావంతో నీట మునిగిన ఇళ్లు

## భారీ వర్షాల సమయంలో వరద నీటిలోనే ఇరగాళమ్మ సంఘం

**నెల్లూరు అగ్రికల్చర్, డిసెంబరు 1, ప్రభాతవార్త :** ప్రభుత్వాలు ఎన్ని మారినా అభివృద్ధి పథకాలు పేదల దరి చేరకపోవడంతో వారి బ్రతుకుల్లో మార్పు రాని దయనీయ పరిస్థితులు నెలకొంటున్నాయి. నెల్లూరులోని ఇరుగాళమ్మ సంఘం ఇందుకు ఓ ఉదాహరణ. అక్కడ నివసించే వారంతా రెక్కాడితే గాని డొక్కాడని ప్రజానీకమే. తుఫాన్లు, భారీ వర్షాలు, వరదలు సంభవించిన సమయాల్లో వీరి ఇళ్లు నీట మునిగి, వీరంతా దయనీయ పరిస్థితుల్లో బతుకుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా వీరి ధరిచేరేది ఏ కొన్ని మాత్రమే. భారీ వర్షాల సమయాల్లో ఇరుగాలమ్మ సంఘం ఒడ్డు మార్జిన్ పక్కన నివాసం ఉంటున్న పేదల ఇళ్లన్నీ వరద నీటిలోనే ఉంటున్నాయి. ఇది పాలకులకు తెలిసి గత కొన్నేళ్లుగా జరుగుతున్నదే. ఇటీవల ఈ ఇళ్లన్నీ వరద ముంపుకు గురికాగా ప్రభుత్వం ఆక్రమణలను తొలగించి యంత్రాల సాయంతో ఓ సైడ్ కాలువను తవ్వింది. తాత్కాలికంగా చేపట్టే ఇలాంటి పనుల వల్ల వరద నీరు ఏ మాత్రం తగ్గకపోగా మరో మారు వీరి ఇళ్లన్నీ వర్షపు నీటిలో చిక్కుకున్నాయి. దీంతో ఇక్కడ నివాసం ఉంటున్న ప్రజలు ఎటు వెళ్లలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. పాలకులు పునరాలోచించి ఈ ప్రాంతంలో ఇళ్లు వరద ముంపుకు గురికాకుండా శాశ్వత ప్రాతిపదికన సమస్యకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ప్రజలంతా కోరుతున్నారు.

# క్వాంటమ్ కంప్యూటింగ్ విధానం అమలుకు మార్గదర్శకాలు

**విజయవాడ,డిసెంబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీక్వాంటమ్ కంప్యూటింగ్ విధానం అమలుకు మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది.ఈ మేరకు సోమవారం అధికారికంగా సంబంధిత యంత్రాంగం ద్వారా ఒకఉత్తర్వును అందుబాటులోకి తీసుకుని వచ్చింది.ఈ పాలసీ 2025-30 మధ్య అయిదేళ్ళ పాటు అమలులో ఉంటుంది. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ఏర్పాటు చేసే సంస్థలకు మాత్రమే ఈ పాలసీ వర్తిస్తుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. సంస్థలకు చెల్లించే ప్రోత్సాహకాలు సంస్థను గుర్తించేందుకు అనుసరించే నిబంధనలను ప్రభుత్వం ఉత్తర్వుల్లో కీలకంగా ప్రస్తావించింది. అందుకు అనుగుణంగా టైలర్ మేడ్ విధానంలో ప్రోత్సాహకాలు చెల్లించేందుకు అనుమతించనుంది.

# ఢిల్లీ భూగర్భ జలాల్లో యురేనియం

**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** దేశ రాజధాని ఢిల్లీలో ప్రజల ఆరోగ్యానికి సంబంధించి తీవ్ర ఆందోళన కలిగించే విషయం వెలుగులోకి వచ్చింది. చాలా ఏళ్లుగా బోర్‌వెల్స్, ట్యూబ్‌వెల్స్ నీటిపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మందికి తాజా నివేదిక దిగ్భ్రాంతి కలిగిస్తోంది. కేంద్ర భూగర్భ జల మండలి 2025 తాజాగా విడుదల చేసిన సర్వే నివేదిక ప్రకారం, ఢిల్లీలోని భూగర్భ జలాల్లో ప్రమాదకర స్థాయిలో యురేనియం ఉన్నట్లు తేలింది. సేకరించిన నమూనాలలో దాదాపు 13 నుంచి 15 శాతం నీటిలో యురేనియం పరిమితికి మించి ఉందని నివేదిక స్పష్టం చేసింది.


సోమవారం ఢిల్లీ చేరుకున్న మంత్రులకు స్వాగతం పలికిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీలు

# ఢిల్లీలో మంత్రులు లోకేష్, అనిత

## కేంద్ర మంత్రులు అమిత్ షా, శివరాజ్ సింగ్‌తో నేడు భేటీ

**విజయవాడ, డిసెంబరు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత ఢిల్లీకి చేరుకున్నారు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రిగా నారా లోకేశ్, హోంమంత్రిగా వంగలపూడి అనిత సోమవారం హస్తినకు వెళ్లారు. ఢిల్లీ విమానాశ్రయంలో వారికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, పలువురు ఎంపీలు, టీడీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సానా సతీష్, కేశినేని శివనాథ్, లావు కృష్ణదేవరాయలు, దగ్గుమళ్ల ప్రసాద్ రావు, పార్థసారథి, అప్పలనాయుడు, బస్తిపాటి నాగరాజు, భరత్, అంబికా లక్ష్మీ ...మినారాయణ ఉన్నారు. వీరితో పాటు టీడీపీ సీనియర్ నేతలు కంభంపాటి రామ్మోహన్ రావు, కనకమేడల రవీంద్ర కుమార్ కూడా మంత్రులకు స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా మంత్రులు లోకేశ్, అనిత మంగళవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లతో వేర్వేరుగా భేటీ కానున్నారు. ఇటీవల రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన ఖిమొంథాఖీ తుఫాను వల్ల జరిగిన నష్టంపై రూపొందించిన సమగ్ర నివేదికను కేంద్ర మంత్రులకు అందించి, సహాయం కోరనున్నారు. తుపాను ప్రభావం, పంట నష్టం, పునరావాస చర్యలకు అవసరమైన నిధులపై వారు చర్చించనున్నారు.

# తొలిరోజే రగడ..రగడ

>> విపక్ష సభ్యులు ఓట్ చోర్, గడ్డి చోర్ అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు చేతబూని వెల్‌లోకి దూసుకెళ్లి సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. విపక్ష సభ్యుల ఆందోళనలపై స్పీకర్ ఓం బిర్లా అసహనం వ్యక్తం చేశారు. అన్ని అంశాలపై చర్చకు సిద్ధమేనని స్పష్టం చేశారు. "ప్రజలు మిమ్మల్ని పార్లమెంట్‌కు పంపింది.. నినాదాలు, ఆందోళనలు చేయడానికి కాదు. ప్రశ్నోత్తరాలకు విపక్షాలు సహకరించాలి" అని స్పీకర్ ఓం బిర్లా సూచించారు. ఈ మేరకు సభను 12 గంటలకు వాయిదా వేశారు. అనంతరం 12గంటలకు సభ ప్రారంభం కాగానే, విపక్ష సభ్యులు మళ్లీ ఆందోళనకు దిగారు. ఈ గందరగోళం మధ్యే కేంద్ర మంత్రులు గజేంద్రసింగ్ షెకావత్, అర్జున్ రామ్ మేఘ్వాల్, పంకజ్ చౌదరి, కీర్తివర్ధన్ సఇంగ్ తమతమ మంత్రిత్వ శాఖల తరఫున పత్రాలు సమర్పించారు. అలాగే, రసాయనాలు, ఎరువులపై స్టాండింగ్ కమిటీ రెండు నివేదికలను లోక్‌సభకు సమర్పించింది. కేంద్ర మానవవనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బెంగళూరు ఐఐఎస్‌సికు ఇద్దరు లోక్‌సభ సభ్యులను ఎన్నుకోవాలని కోరుతూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అలాగే, దివాలా మరియు దివాలా కోడ్ (సవరణ) బిల్లు, జాన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లును పరిశీలించే సెలెక్ట్ కమిటీలకు గడువు పొడిగించాలని మరో తీర్మానం ప్రవేశపెట్టగా, మూజువాణి ఓటుతో ఆమోదం పొందాయి. ఇదే సమయంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పలు బిల్లులను ప్రవేశపెట్టారు. 2025 సెంట్రల్ ఎక్సైజ్ సవరణ బిల్లు, మణిపూర్‌కు చెందిన జీఎస్టీ సవరణ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. హెల్త్ సెక్యూర్టీ, నేషనల్ సెక్యూర్టీ సెస్ బిల్లును కూడా మంత్రి ప్రవేశపెట్టారు. సభ్యుల గందరగోళం మధ్యే ఆయా బిల్లులు మూజువాణి ఓటుతో ఆమోదం పొందినట్లు స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లా ప్రకటించారు. మరో వైపు సిర్‌పై చర్చ చేపట్టాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. సభ జరుగుతున్న సమయంలో విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. విపక్ష సభ్యుల ఆందోళన నేపథ్యంలో లోక్‌సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. మళ్లీ సభ ప్రారంభమైనప్పటికి విపక్షాల ఆందోళనతో మంగళవారానికి ఉభయ సభలు వాయిదాపడ్డాయి. ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ రాజ్యసభ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి, సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి రాధాకృష్ణన్ రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే అభినందించారు. అదే సమయంలో మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామా తర్వాత ఆయనకు వీడ్కోలు పలకలేకపోవడం పట్ల ప్రతిపక్షాల నిరాశను వ్యక్తం చేశారు.

# ఆ 5గురు ఎమ్మెల్సీలు విచారణకు హాజరు

>>సోమవారం శాసనమండలి చైర్మన్ వద్ద విచారణకు హాజరైన అనంతరం బయట విలేకరులతో మాట్లాడారు.నా వ్యాపారాలు రాజకీయ భవిష్యత్తు స్థానిక ప్రజల ఇబ్బందులు అవసరాలను తీర్చేందుకే పార్టీ మారినట్లు తెలిపారు.అందువలన నా రాజీనామా ఆమోదించాల్సిందిగా చైర్మన్‌కు వివరించినట్లు తెలిపారు.ప్రజల్లో విశ్వాసంలేని పార్టీలో కొనసాగలేనందున వైకాపాకురాజీనామా చేసినట్లు వివరించారు.

# నిన్న సిఎం ఇంటికి డికే..

# నేడు డికే ఇంటికి సిఎం

**బెంగళూరు, డిసెంబరు 1:** కర్నాటకలో నాయకత్వ మార్పు ఊహాగానాలు కొనసాగుతూనే ఉన్నాయి. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ రెండు వర్గాలు విడిపోయారు. అయితే, నేతలను మళ్లీ ఒకేతాటిపైకి తీసుకవచ్చేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇటీవల డీకే శివకుమార్ సీఎం నివాసానికి అల్పాహారం కోసం వెళ్లి ఈ అంశంపై చర్చించారు. తాజాగా డీకే ఇంటికి సీఎం సిద్ధరామయ్య నివాసానికి వెళ్లబోతున్నారు. మంగళవారం శివకుమార్ ఇంటికి వెళ్లనున్నారు. అయితే, తనకు ఇంకా అధికారిక ఆహ్వానం అందలేదని సీఎం తెలిపారు. శనివారం అల్పాహారం సందర్భంగా సీఎం, డిప్యూటీ సీఎం ఇద్దరూ భేటీ అయ్యారు. అనంతరం ఇద్దరు నేతలు కలిసి పార్టీ శ్రేణులకు ఐక్యతా సందేశం ఇచ్చారు. పార్టీ హైకమాండ్ నిర్ణయమే శిరోధ్యామని స్పష్టం చేశారు. సమాచారం మేరకు పార్టీ హైకమాండ్ సిద్ధరామయ్యను ప్రస్తుతానికి రాబోయే అసెంబ్లీ సమావేశాల వరకు సీఎంగా కొనసాగాలని సూచించింది. ఈ క్రమంలో సిద్ధరామయ్య మాట్లాడుతూ డీకే శివకుమార్ తనను మంగళవారం అల్పాహారానికి తన ఇంటికి రావాలని కోరారని ఇంకా అధికారిక ఆహ్వానం అందలేదన్నారు. ఆహ్వానిస్తే తాను ఖచ్చితంగా వెళ్తానని ఆయన నుంచి ఆహ్వానం వస్తుందని అనుకుంటున్నానన్నారు. సీఎం వ్యాఖ్యలపై డీకే శివకుమార్ స్పందిస్తూ ఇది తనకు సీఎంకు మధ్య ఉన్న విషయమని తాము అన్నదమ్ముల్లా కలిసి పని చేస్తామన్నారు. ఈ సందర్భంగా సీఎంకు తన ఇంటికి అల్పాహారానికి ఆహ్వానించారు. వాస్తవానికి కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావొస్తుంది. ఇద్దరు నేతలు చెరో రెండున్నరేళ్లు సీఎంగా పని చేసేందుకు ఒప్పందం జరిగిందని ప్రచారం జరుగుతున్నది. ప్రస్తుతం సిద్ధరామయ్య ప్రభుత్వం ఏర్పాటై రెండున్నరేళ్లు అవుతున్న సందర్భంలో నాయకత్వ మార్పు తథ్యమని ప్రచారం జరుగుతున్నది. ఇద్దరు నేతల భేటీ మధ్య సయోధ్య కుదిరిందని వివాదానికి తెర పడినట్లేనని భావిస్తున్నారు.

# సిఐడి నివేదికే కీలకం

>> స్వాధీనం చేసుకున్నారు. 35మందివరకు సాక్షులను, నిందితుడ్ని, కీలక అధికారులను విచారణ చేసి 150పేజీలుపైగా సమాచారం సేకరించి రికార్డుచేశారు. నిందితుడు సివి రవికుమార్ ఆయన సతీమణి రమ్యను విచారణ చేసి పలు ఆధారాలు రాబట్టారు.ఇంకా ఈ కేసులో వైసిపి ప్రభుత్వ హయాంలోని టిటిడి బోర్డు మాజీ ఛైర్మన్లు వైవిసుబ్బారెడ్డిని, భూమన కరుణాకర్‌రెడ్డిని, మాజీ ఇఒ ఏవి ధర్మారెడ్డితోబాటు మాజీ సివిఎస్ఒ నరసింహకిశోర్, మాజీ విజిఒ గిరిధర్, ఏవిఎస్ఒ పద్మనాభంను, అప్పటి తిరుమల సిఐలు జగన్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్, ఎస్ఐ లక్ష్మీరెడ్డిలను అప్పటి పరకామణి విధుల్లో ఉన్న టిటిడి అధికారులను వరుసగా 35మందిని విచారణ చేశారు. నిందితుడు రవికుమార్ భక్తులు సమర్పించిన కానుకల్లో అమెరికన్‌డాలర్లు 920 డాలర్లు విలువైనవి చోరీ చేస్తూ 2023 ఏప్రిల్‌లో పట్టుబడిన విషయం విదితమే. తదుపరి అతనిపై పోలీసు కేసు నమోదు చేయడం, పోలీసులు చట్టప్రకారం వ్యవహరించకుండా లోక్‌అదాలత్‌లో మధ్యవర్తిత్వంతో రాజీకుదుర్చుకోవడం చేశారు.అదే సంవత్సరంమేనెల 20వతేదీ ఛార్జిషీట్ ఫైల్ చేశారు. అంతేగాక ఈ చోరీకేసులో నిందితుడు రవికుమార్ నుండి 2023 జూన్‌లోనే అప్పటి టిటిడి బోర్డు పెద్దలు 14.43కోట్ల రూపాయలు విలువైన ఆస్తులను 07 గిఫ్ట్‌డీడ్‌లుగా శ్రీవేంకటేశ్వరస్వామికి స్వీకరించడం జరిగింది. ఈ వ్యవహారంలో చోరీ సొత్తు విలువ లక్షల్లో ఉంటే శ్రీవారికి కానుకగా 14కోట్ల రూపాయలు ఆస్తులు ఎందుకు స్వీకరించారనేది సిఐడి రాబట్టిన కీలక సమాచారం. అయితే ఈ కేసును అప్పటి టిటిడి ధర్మకర్తలమండలి పెద్దలు, కొందరు పోలీస్ అధికారులు మధ్యవర్తిత్వం జరిపి అదే సంవత్సరం సెప్టెంబర్ 9వతేదీ లోక్‌అదాలత్‌లో 582 కేసుగా విచారణ సాగింది.దీనివెనుక ఎంత మొత్తంలో ఎవరెవరు లబ్ధిపొందారనేది ప్రధాన ఆరోపణలపై హైకోర్టు ఆదేశాలతో క్షేత్రస్థాయిలో దర్యాప్తు జరిగింది. నిందితుడుకు సంబంధించిన ఆస్తులు చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్, తిరుపతి,విశాఖల్లో ఉన్నట్లు డాక్యుమెంట్లను, వాటిల్లో కొన్ని విక్రయించినట్లు విక్రయ రికార్డులను సిఐడి సేకరించింది. మరో కీలకంగా తిరుపతిలో రెండో అదనపు న్యాయస్థానం సిబ్బందిని సిఐడి అధికారులు ప్రశ్నించి కొంత కీలక విషయాలను సేకరించారు. సమగ్ర సమాచారంతో పరకామణిలో చోరీ కేసుపై సిఐడి చీఫ్ రవిశంకర్‌అయ్యన్నార్ బృందం నేడు హైకోర్టు ధర్మాసనం ప్రధాన న్యాయమూర్తికి సమర్పించనున్నారు. తదనంతరం న్యాయస్థానం ఎలాంటితీర్పు వెలువడిస్తుందనేది మాత్రం రాజకీయ వర్గాల్లో, టిటిడి వర్గాల్లో ఎడతెగని ఉత్కంఠ కలిగిస్తోంది.

# జోనల్ వ్యవస్థ ఏర్పాటు, అధికారుల నియామకం

**విజయవాడ,డిసెంబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పరిపాలనను విశాఖ,అమరావతి,రాయలసీమ పేరిట మూడు జోన్‌లుగా విభజించాలని నిర్ణయించిన విశాఖ జోన్‌లో 9,అమరావతి జోన్‌లో 8,రాయలసీమ జోన్‌లో 9 జిల్లాలు ఉండగా, ఈ ప్రణాళికలను నీతి ఆయోగ్,సింగపూర్ సంస్థల సూచనల ఆధారంగా రూపొందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో స్టీరింగ్ కమిటీ వ్యవహారాలను పర్యవేక్షించనుంది. ప్రతి జోన్‌కు సీనియర్ ఐఎఎస్ అధికారిని సీఈవోగా నియమించగా,విశాఖ జోన్‌కు యువరాజ్,అమరావతి జోన్‌కు ముఖేష్ కుమార్ మీనా, రాయలసీమ జోన్‌కు కృష్ణబాబు నియమితులయ్యారు. ఈ నిర్ణయాలకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు ఒకటి రెండు రోజుల్లో వెలువడనున్నాయి.

# నెల్లూరు తరలింపు

>> న్యాయాధికారి ఎదుట హాజరుపర్చారు. కస్టడీలో అడిగిన ప్రశ్నలు,నిందితుల సమాధానాలను పోలీసులు కోర్టులో సమర్పించారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించాలని న్యాయాధికారి లెనిన్‌బాబు ఆదేశించారు. దీంతో వీరిని నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు. కస్టడీలో పోలీసులు జనార్ధనరావు, జగన్మోహనరావులతో ఆర్థిక,వ్యాపార,వ్యక్తిగత సంబంధాలపై ప్రశ్నలు అడిగారు. గతంలో వీరు కలిసున్న ఫోటోలను చూపించి వివరాలడిగినా జనార్ధన్‌రావు ఎవరో తెలియదని సమాధానమిచ్చారు. జోగి రాము,జనార్ధన్‌రావు మధ్య 18 కాల్స్ ఉన్నాయి. వీటి గురించి అడిగినా సరైన సమాధానం చెప్పలేదు. 2020లో జరిగిన యూపిఐ లావాదేవీలపై ప్రశ్నించినా తనకు గుర్తులేదని రాము జవాబిచ్చినట్లు సమాచారం. జోగి సోదరుల బ్యాంకు స్టేట్‌మెంట్లను వారి ముందు ఉంచి పెద్ద మొత్తంలో నగదు ఎవరు, ఎందుకు జమ చేశారని ప్రశ్నించినా తెలియదనే చెప్పారు. మీకు ఎందుకు ఇందత ఆదాయం వచ్చిందని అడిగినా సమాధానం లేదు.

**విజయవాడ జైలుకు మార్చండి: జోగి రమేష్ వినతి**

నెల్లూరునుంచి విజయవాడ జిల్లా జైలుకు మార్చాలని న్యాయాధికారిని జోగి రమేష్ కోరారు. స్టడీ అనంతరం న్యాయాధికారి ఎదుట హాజరుపర్చినప్పుడు జైలు మార్పు గురించి అడిగారు. దూరమైనందున బెజవాడకు మార్చాలని కోరారు. ఇక్కడ ఖాళీలు లేవని చెప్పి,నెల్లూరు కారాగారానికి తరలించాలని జడ్జి ఆదేశించారు.

# 3 రోజుల కస్టడీ

>> చేసి విజయవాడ తీసుకుని వచ్చారు. విజయవాడ కోర్టు అతని పక్షం రోజుల పాటు రిమాండ్‌కు ఆదేశించింది. ఈ కేసులో అతడిని పోలీసులు కస్టడీకి కోరారగా విజయవాడ కోర్టు అనుమతిని ఇచ్చింది.

# కోర్టులో లొంగుబాటు

>> న్యాయస్థానాల ద్వారా బెయిల్ ప్రయత్నించారు.ఆ దిశలో ఫలితం దక్కకపోవడంతో చివరకు కోర్టుకు లొంగిపోయారు.ఈ కేసులో కొంతకాలం వల్లభనేని వంశీ విజయవాడ జైలులో రిమాండ్ ఖైదీగాఉన్నారు.ఆయన అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చారు. ఈ క్రమంలో ఆయన అనుచరులు కోర్టులో లొంగిపోయారు.

## వారం - వర్జ్యం

02-12-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
ద్వాదశి మ.3.53
అశ్వని రా.8.47, అనూరాధ కార్తె
వర్జ్యం : తె.5.15-6.40
దు.ఉ.8.36-9.21,
2) రా.10.30-10.46
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** ముఖ్యమైన కార్యక్రమాలు నెమ్మదిగా పూర్తికాగలవు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

**వృషభం:** స్థిరాస్తి వివాదాలు, కోర్టుకేసులు పరిష్కార దశకు చేరుకుంటాయి. ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు.

**మిథునం:** ఓర్పు, నేర్పులతో ముఖ్య వ్యవహారాలు సానుకూల పరచుకునే యత్నాలు చేస్తారు. ఉద్యోగులకు బదిలీలు. బంధువుల కలయిక.

**కర్కాటకం :** వ్యాపారాలలో స్వల్ప మార్పులు ఉంటాయి. స్పెక్యులేషన్‌కు దూరంగా వుండండి. వాహన సౌఖ్యం.

**సింహం:** మీ మనస్సులోని మాటను ఇతరులకు తెలియనివ్వకుండా జాగ్రత్త పడతారు. నూతన పరిచయాలు కల్గుతాయి.

**కన్య :** ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. సన్నిహితులకు మీ వంతు సహాయాన్ని అందిస్తారు. అనుకున్న మొండి పనులలో చలనం ఏర్పడుతుంది.

**తుల:** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. సంబంధ బాంధవ్యాలు మెరుగు పడతాయి. విలువైన వస్తువులు కొనుగోలుచేస్తారు.

**వృశ్చికం:** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వివాహ యత్నాలు ముమ్మారం చేస్తారు.

**ధనుస్సు:** దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకుంటారు. స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు.కాంట్రాక్టులు దక్కించుకుంటారు.

**మకరం:** పలుకుబడి కలిగిన వ్యక్తులను కలుసుకుంటారు. షేర్లు, భూముల క్రయ విక్రయాలు ప్రోత్సాహకరంగా వుంటాయి.

**కుంభం:** ప్రజా సంబంధాలు అధికంగా కలిగినటువంటి వ్యాపారస్థులకు అనుకూలంగా వుంటుంది.ధనలాభం కల్గుతుంది.

**మీనం:** మీ ఆత్మగౌరవానికి మచ్చ తేవడానికి ప్రత్యర్థులు చేసే ప్రయత్నాలు ఫలించవు. దూర ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## విధుల్లోకి ఏఆర్ కానిస్టేబుల్ ప్రకాశం ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**విజయవాడ,నవంబరు 25,ప్రభాతవార్తప్రతి నిధి:** గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగం కోల్పోయిన ఏఆర్ కానిస్టేబుల్ ప్రకాశ్‌ను ప్రభుత్వం తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని ఆదేశించింది. ఈ మేరకు సోమవారం డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేసారు. గతంలో రాష్ట్ర పోలీసులకు రావాల్సిన బకాయిలపై ఏఆర్ కానిస్టేబుల్ ప్రకాశ్ ధర్నా చేసారు. దీంతో ఆయన క్రమశిఓణను ఉల్లంఘించారనే అభియోగంపై ప్రభుత్వం ఉద్యోగం నుంచి తొలిగించింది. ఆయన సంజాయిషీని సైతం అప్పటి ప్రభుత్వం స్పందించలేదనే అభియోగా లున్నాయి,. ఈ క్రమంలో తనకు తిరిగి విధుల్లో చేరేందుకు వీలు కల్పించాలని కూటమి ప్రభుత్వాన్ని అభ్యర్థిం చారు. దాంతో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు డీజీపీ విచారణ జరిపి, ఆయనకు ఉద్యోగ విధుల్లో చేరాలని ఆదేశించింది. తనకు తిరిగి విధుల్లో చేరేందుకు అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు, డీజీపీలకు ప్రకాశ్ ధన్యవాదాలు తెలిపారు.




## తిరుపతిలో హోటల్‌కు మళ్లీ బాంబు బెదరింపు

**తిరుపతి,డిసెంబర్ 1ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి కపిలతీర్థం కూడలికి సమీపంలోని ఓ హోటల్‌కు ఆర్‌డిఎక్స్‌తో పేల్చేస్తామంటూ బాంబుబెదిరింపు ఈ మెయిల్ రావడంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ మెయిల్‌ద్వారా గుర్తు తెలియని వ్యక్తులు హోటల్‌రాజ్‌పార్క్‌లో బాంబు పెట్టామనే బెదిరింపు రావడంతో సోమవారం ఉదయం తీవ్ర కలకలం సృష్టించింది. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, అదనపు ఎస్పీలు రవిమనోహరచారి ఆదేశాలతో సిఐ, ఎస్ఐలు, బాంబునిర్వీర్యం తనిఖీ సిబ్బంది వెంటనే రంగంలోకి దిగారు. ఆ హోటల్‌ను నిశితంగా తనిఖీ చేశారు. బాంబుస్క్వాడ్ బృం దాలతో విస్తృతంగా తనిఖీలు చేసి ఉత్తుత్తేగా తేల్చారు. తిరుపతిలో పోలీసులు అన్ని రకాల ముందు జాగ్రత్తచర్యలు తీసుకుంటున్నా ఈ బాంబు బెదిరింపులతో మరింతగా అప్రమత్త మయ్యారు.

## క్వాంటమ్ విప్లవంలో రాష్ట్రంలో 50 వేల మందికి అద్భుత అవకాశం!

**విజయవాడ,డిసెంబరు 1, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రాన్ని క్వాంటమ్ టాలెంట్ హబ్‌గా తీర్చి దిద్దాలనే బృహత్తర లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏకంగా 50వేల మందికి కంప్యూటింగ్ టెక్నాలజీపై శిక్షణ ఇవ్వడానికి సిద్ధమైంది. 'అమరావతి క్వాంటమ్ మిషన్‌లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమం డిసెంబరు 8న ప్రారంభం కానుంది. ఈ శిక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అమెరికాకు చెందిన వైజర్ మరియు హైదరాబాద్ లోని కూ య్బిటెక్ స్మార్ట్ సొల్యూషన్స్ వంటి అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కోర్సులు రాబోయే నాలుగేళ్ళపాటు కొనసాగుతాయి. ఈ కార్యక్రమం ముఖ్యంగా ఇంజనీరింగ్ విద్యార్థులు, డిగ్రీలో గణితం, భౌతికశాస్త్రం, కంప్యూటర్ సైన్స్ చదువుతున్నారు. అలాగే ఉద్యోగులు అథ్యాపకులను లక్ష్యంగా చేసుకుంది. కోర్సు పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా జరుగుతుంది. ఈ శిక్షణ కార్యక్రమం రెండు ప్రధాన దశల్లో (ఫేజ్-1, ఫేజ్-2) నిర్వహించబడు తుంది. 'ఫేజ్-1(ఫౌండేషన్ కోర్సు) ఇది నాలుగు వారాల ప్రాథమిక శిక్షణ,ఏపీ విద్యార్థులకు ఫీజు కేవలంరూ.500 మాత్రమే. ఇతర రాష్ట్రాల వారికి ఉద్యోగులకు వేర్వేరు ఫీజులు నిర్ణ యించారు. ఇందులో క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రాథమిక అంశాలు,వివిధ రంగాలలో దాని అను వర్తనాలపై అవగాహన కల్పిస్తారు. 'ఫేజ్-2(అడ్వాన్స్‌డ్ కోర్సు) ఫేజ్-1లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 3,000 మందికి ఈ ఆరు వారాల అడ్వాన్స్‌డ్ కోర్సులో పూర్తిగా ఉచితంగా శిక్షణ ఇస్తారు. ఈ దశలో అడ్వాన్స్‌డ్ అల్గారిథమ్స్ రూపొందిచడంపై దృష్టి సారిస్తారు.

# తాళ్ల వలసలో డయేరియా కేసుల నమోదుపై సిఎం చంద్రబాబు ఆరా



### వృద్ధుని మరణానికి కిడ్నీ సమస్యతో పాటు మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణమని తెలిపిన వైద్యారోగ్య శాఖ

**విజయవాడ, డిసెంబర్ 1, ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం తాళ్లవలస గ్రామంలో డయేరియా కేసులు నమోదు కావడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. ఈ మేరకు గ్రామంలోని పరిస్థితిని సీఎంకు వైద్యారోగ్య శాఖ అధికారులు వివరించారు. తాళ్లవలస గ్రామంలో శనివారం రాత్రి, ఆదివారం ఉదయం వరకు ఆరుగురు వ్యక్తులు అస్వస్థతకు గురవగా వారిని టెక్కలి ఆసుపత్రికి తరలించామని చెప్పారు. సోమవారం నాడు మరో ముగ్గురు ఆసుపత్రిలో చేరారని అధికారులు సీఎంకు వివరించారు. బాధితులంతా వేర్వేరు కుటుంబాలకు చెందినవారని, ప్రస్తుతం ఆసుపత్రిలో ఐదుగురు చికిత్స పొందుతూ కోలు కుంటున్నారని, ముగ్గురు డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. అయితే చిన్నారావు (70) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ ఆదివారం మరణించారని తెలిపారు. చిన్నారావు మృతికి డయేరియా కారణం కాదని వైద్యారోగ్య శాఖ అధికారులు చెప్పారు. చిన్నారావు మూత్రపిండాల వ్యాధితో బాధపడేవారని... మల్టీ ఆర్గాన్ డిస్ ఫంక్షన్ వల్ల గుండెపోటు వచ్చి మృతి చెందారని వైద్యులు నిర్ధారించినట్లు అధికారులు సీఎంకు తెలిపారు. గ్రామంలో ఉన్న ఒక బావి ద్వారా 5 పబ్లిక్ కుళాయిలకు నీటి సరఫరా అవుతోందని... అలాగే మరో 2 చేతి పంపుల నీరు సరఫరా అవుతోందని వివరించారు. ఈ నీటిని ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా పరీక్షించగా, ఎక్కడా కలుషితం లేదని, నీరు తాగడానికి సురక్షితమేనని తేలిందని అధికారులు చెప్పారు. అయినా ముందు జాగ్రత్త చర్యగా బావి నుంచి నీటి సరఫరాను నిలిపి వేశామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. జిల్లా పంచాయతీ ఆఫీసర్, ఆర్‌డబ్ల్యూఎస్ క్షేత్రస్థాయిలోనే ఉండి పారిశుధ్యం, నీటి సరఫరాను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. డయేరియా ప్రబలడానికి గల అసలు కారణాన్ని కనుగొనేందుకు డిప్యూటీ డీఎంహెచ్ఓ, ఎపిడెమియాలజిస్ట్ గ్రామంలోనే ఉండి పరిశీలిస్తున్నారని అధికారులు తెలిపారు. వైద్య బృందాలు ఇంటింటికీ వెళ్లి పరీక్షలు నిర్వహిస్తున్నాయని అధికారులు తమ నివేదికలో పేర్కొన్నారు. తాళ్లవలస గ్రామస్థులు ఎందుకు అనారోగ్యం పాలవుతున్నారో గుర్తించాలని సీఎం ఆదేశించారు. గ్రామస్థులకు సరఫరా అయ్యే నీటిలో ఎక్కడైనా మలినాలు కలుస్తున్నాయా...? లేక ఇతర కారణాలా? అనేది విశ్లేషించాలని సూచించారు. గ్రామస్థులందరికీ సురక్షితమైన మంచి నీరు అందించేలా చర్యలు తీసుకోవడంతో పాటు సమీప గ్రామాలపైనా దృష్టి సారించాలన్నారు.

# టిడిపి కేంద్ర కార్యాలయంలో మంత్రి లోకేష్ 76వ రోజు ప్రజాదర్బార్

### ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించిన మంత్రి, సమస్యలు పరిష్కరించి అండగా ఉంటామని భరోసా



**విజయవాడ, డిసెంబరు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 76వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. మంత్రి నారా లోకేష్‌ను స్వయంగా కలిసి సమస్యలు విన్నవించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, పార్టీ కార్యకర్తలు తరలివచ్చారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించిన మంత్రి లోకేష్.. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వినతులు స్వీకరించారు .వాయిద్య కళాకారుల పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టండిదేవాదాయ శాఖ కింద రాష్ట్రవ్యాప్తంగా వివిధ దేవాలయాల్లో ఖాళీగా ఉన్న నాదస్వరం, డోలు, శృతి, తాళం వాయిద్య కళాకారుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని అఖిల భారత నాయిబ్రాహ్మణ హక్కుల పరిరక్షణ సేవ, సంక్షేమ, జాతి ప్రక్షాళన సమితి ప్రతినిధులు మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. వివిధ దేవాలయాల్లో సంప్రదాయ నిత్య కైంకర్య సేవలు, పూజల కోసం.. నాదస్వరం, డోలు, శృతి, తాళం నేర్చుకుని, వివిధ కోర్సుల్లో ఉత్తీర్ణులై, డిప్లమో అర్హత కలిగిన పూర్వ విద్యార్థులకు ఆయా పోస్టుల్లో అవకాశం కల్పించడంతో పాటు వయస్సు సడలింపు ఇవ్వాలని కోరారు. గత 70 ఏళ్లుగా బంజరు భూముల్లో నివాసం ఉంటున్న తమకు ఇంటి పట్టాలు మంజూరు చేసి అండగా నిలవాలని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం విస్సన్నపేటకు చెందిన గ్రామస్థులు మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. అన్నమయ్య జిల్లా ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ముంపు గ్రామమైన కోటావూరులో 60 కుటుంబాలు భూములు, ఇళ్లు కోల్పో యాయని.. బాధితుల సమస్యలు పరిష్కరించ డంతో పాటు త్వరతగతిన నష్టపరిహార నిధులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని ముంపు గ్రామ రైతులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విన్నవించారు. గత టీడీపీ సానుభూతిపరుడిననే కక్షతో వైసీపీ పాలనలో తనపైన, తన కుటుంబంపైన 42 అక్రమ కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేశారని, విచారించి తగిన న్యాయం చేయాలని చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం గోవిందపల్లికి చెందిన మహాదేవి జయశంకర్ మంత్రి నారా లోకేష్‌ను కలిసి కోరారు. ఆయా విజ్ఞప్తులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ భరోసాఇచ్చారు.

## డిజిటల్ అరెస్ట్ పేరుతో 48 లక్షలు దోచుకున్న ముగ్గురు అరెస్ట్

### రూ. 39 లక్షలు, 25 ఎటిఎం కార్డులు స్వాధీనం

**మదనపల్లె క్రైమ్, డిసెంబర్ 1 ప్రభాతవార్త.** మదనపల్లి కేంద్రంగా "డిజిటల్ అరెస్ట్" పేరుతో మోసాలకు పాల్పడుతున్న అంతర్జాతీయ సైబర్ నేర ముఠాను మదనపల్లి 1టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితులైన పఠాన్ ఇంతియాజ్ ఖాన్, షేక్ అమీన్, షేక్ హర్షద్ లను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సోమవారం రాయచోటిలో మీడియాకు వెల్లడించారు. పి కథనం మేరకు వివరాలు ఎలా ఉన్నాయి. మదనపల్లెకు చెందిన 75 ఏళ్ల రిటైర్డ్ మేల్ నర్సు రేపురి బెంజిమెన్‌ను లక్ష్యంగా చేసుకున్న నిందితులు, సీబీఐ, ఈడీ అధికారుల మంటూ బెదిరించారు, మీ మీద కేసు ఉంది అంటూ బెంజిమెన్‌ను ఫోన్ ద్వారా భయపెట్టారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో వీడి యో కాల్‌లో ఉంచి మీ పాన్ కార్డు ద్వారా అకౌంట్ ఓపెన్ చేసిన ఓ ముఠా 48 లక్షల రూపాయలు మోసం చేశారని దీనికి మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందంటూ బెది రించారు. వెంటనే అమోంటు పంపకపోతే పక్కనే ఉన్న మా పోలీసులు నిన్ను అరెస్ట్ చేస్తారంటూ భయపెట్టి రూ.48 లక్షలు బదిలీ చేయించుకున్నారు. అనంతరం మోసపోయానని తెలుసుకున్న బెంజిమెన్ మదనపల్లె ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన వన్ టౌన్ పోలీసులు దర్యాప్తులో భాగంగా రాయచోటిలో జరిగిన ప్రత్యేక ఆపరేషన్‌లో నిందితులు పటాన్ ఇంథియాజ్ ఖాన్, షేక్ అమీన్, షేక్ అర్షాద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.32 లక్షల నగదు, 25 ఏటీఎం కార్డులు, మొబైళ్లు, సిమ్ కార్డులు స్వాధీనం చేసుకోగా, ఖాతాల్లో ఉన్న రూ.7.65 లక్షలను ఫ్రీజ్ చేశారు. ఈ ముఠా కాంబోడియా కువైట్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సాంకేతిక ఆధారాలతో ఈ ఆపరేషన్‌ను విజయవంతం చేసిన డీఎస్పీ మహేంద్ర, సీఐ మహమ్మద్ రఫీ, సైబర్ సెల్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.ప్రజలకు ఎస్పీ హెచ్చరిడిజిటల్ అరెస్ట్ అంటూ చట్టంలో ఇక్కడ లేదని జిల్లా ఎస్పీ సూచించారు. ఎవరూ వీడియో కాల్ ద్వారా అరెస్ట్ చేయటం, ఆన్‌లైన్‌లో డబ్బులు అడగటం ఉండదన్నారు. ముఖ్యంగా రిటైర్డ్ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానం వచ్చిన వెంటనే 1930 కు కాల్ చేయాలని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సూచించారు.



## కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జ్ ప్రారంభోత్సవం

### భారత్‌లో అతిపెద్ద క్యాంటీ లివర్ గ్లాస్ బ్రిడ్జి

**విశాఖపట్నం, డిసెంబర్ 1 ప్రభాతవా వార్త:** వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరానికి సందర్శకులు రాక మరింత పెరగడంతో సరికొత్త హంగులతో నగర స్వాగతం పలుకుతుంది. దీనిలో భాగంగా కైలాసగిరి కొండపై నూత నంగా ఏర్పాటు చేసిన 50 మీటర్ల పొడవు కలిగిన క్యాంటీ లివర్ గ్లాస్ బ్రిడ్జ్ ను వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ తో పాటు విశాఖ ఎంపీ శ్రీ భరత్, మేయర్ పీలా శ్రీనివాసరావు, స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు తదితరుల చేతుల మీదుగా సోమవారం ఉదయం ఘనంగా ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ విశాఖను పర్యాటక రాజధానిగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

## ఆంధ్రలో ప్రపంచంలోనే మెరుగైన పెన్షన్ పథకం

### - తిరుపతిలో పించన్‌ల పంపిణీలో మంత్రి అనగాని



**తిరుపతి,డిసెంబర్ 1ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పలురకాలుగా లబ్ధిదారులకు అమలుచేస్తున్న ఫెన్షన్ పథకం ప్రపంచంలోనే మెరుగైన సంక్షేమంగా రాష్ట్రరెవెన్యూ,రిజిస్ట్రేషన్ శాఖల,తిరుపతి జిల్లా ఇన్‌చార్జిమంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. ప్రతి పేదకుటుంబానికి నేరుగా వారి ఇంటికివెళ్ళి స్వయంగా ఫెన్షన్ అందిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌అని ,దేశంలోనే ఆదర్శప్రాయమైన పథకంగా కూటమిప్రభుత్వం నిలిచిందన్నారు. మొదటితేదీన సోమవారం తిరుపతిలో పలురకాల లబ్ధిదారులకు ఫెన్షన్‌లను అందించేందుకు తిరుపతికి వచ్చిన మంత్రి అనగాని సత్యప్రసాద్ రాష్ట్ర పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, ఎమ్మెల్యే శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్లు, నగరపాలక కమిషనర్ మౌర్య, ట్రైనీ కలెక్టర్ సందీప్‌రఘువాన్షీ, టిడిపి రాష్ట్రకార్యదర్శి వి.పుష్పావతియాదవ్, కూటమిపార్టీల నేతలతోకలసి కార్పొరేషన్ పరిధిలోని 48,49వార్డుల్లో ఎన్టీఆర్ భరోసా భద్రత పెన్షన్ల పంపిణీ చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు నిబద్దతతో ఫెన్షన్ అందించడం పనితీరుకు నిదర్శనమన్నారు. దివ్యాంగులకు ఆరువేలరూపాయలు, డలయాసిస్ రోగులకు 10వేల రూపాయలు , పూర్తిగా మంచానికి పరిమితమైనవారికి 15వేల రూపాయలు ఫెన్షన్ అందించడం ప్రభుత్వ చారిత్రాత్మక నిర్ణయమన్నారు. తిరుపతిజిల్లాలో ఒకనెలకు 2.62లక్షలమంది లబ్ధిదారులకు 113 కోట్ల రూపాయలు ఫెన్షన్ అందిస్తున్నామని తెలిపారు.

## టిటిడిలో సర్వర్లు డౌన్! పనిచేయని ఆన్‌లైన్ టిక్కెట్ల లావాదేవీల కౌంటర్లు

### - ఆఫ్‌లైన్‌లో టిక్కెట్లు జారీ

**తిరుమల, డిసెంబర్ 1ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడిలో ఒక్కసారిగా సర్వర్లు డౌన్ కావడంతో సేవాటిక్కెట్లు జారీ కౌంటర్ల వద్ద సేవలూ ఆగిపోయాయి. దీంతో తిరుమలలోనిఎంబిసి ప్రాంతంలోని కౌంటర్‌ల వద్ద భక్తులుబారులుతీరారు. సోమవారం సాయంత్రం నుండి ఈ సమస్య తలెత్తింది, సిఫార్సు లేఖలపై విఐపి బ్రేక్ దర్శనాలు,ఆర్జితసేవల టిక్కెట్లను ఎంబిసి ప్రాంతంలోని కౌంటర్ల వద్దనుండి భక్తులు పొందాల్సి ఉంటుంది. ఇక్కడ ఆన్‌లైన్‌లో లావాదేవీలు భక్తులు చేసి టిక్కెట్లు అందుకోవాలి.అయితే సోమవారం రాత్రి సర్వర్లు మొరాయించడంతో సేవాటిక్కెట్లకు లావాదేవీలు చేయడానికి ఆటంకం కలిగింది, రాత్రి 10గంటల వరకు సమస్య అలాగే ఎదురైంది. దీంతో పై అధికారుల ఆదేశాల మేరకు ఎంబిసి సిబ్బంది ఆఫ్‌లైన్‌లో టిక్కెట్లు జారీచేయాల్సి వచ్చింది. దీంతో కొంతసమయం భక్తులు అసహనానికి గురయ్యారు.

## టిటిడి పరిధిలోని ప్రతి ఆలయంపై ప్రామాణిక ఆపరేటింగ్ విధానం

**తిరుమల,డిసెంబర్ 1ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి పరిధిలో చేరిన ప్రతి ఆలయంపై ప్రామాణిక ఆపరేటింగ్ విధానాన్ని (ఎస్‌ఓపి)రూపొం దించాలని టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ సూచించారు. వచ్చే సమావేశానికి నివేదికలు సిద్ధం చేయలన్నారు.టిటిడిలోని పట్టణాభివృద్ధి విభాగాన్ని పటిష్టం చేసేందుకు వీలుగా తగినంతమంది సిబ్బందితో కార్యాచరణ సిద్ధంచేయాలని సిఇ సత్యనారాయణను ఆదేశించారు. అమరావతి వెంకటపాలెంలోని టిటిడి శ్రీవారి ఆలయ విస్తరణ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, 25 ఎకరాలలో ఇదివరకే ఉన్న ఆలయంతోబాటు ఇకపై నిర్మించనున్న కల్యాణకట్ట, అర్చకులు, సిబ్బంది నివాసగృహాలు,ప్రాకారం, గోపురాలు, పుష్కరిణి తదితర నిర్మాణాలపై కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సోమవారం టిటిడి పరిపాలన భవనంలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఎఫ్ఎసిఎఒ బాలాజీ, సిఇ సత్యనారాయణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి,డిఎఫ్ఒ ఫణికుమార్‌నాయుడుతో ఇఒ సింఘాల్ సమీక్షించారు.

# తిరుమల సమాచారం

## శ్రీరంగనాథస్వామికి టిటిడి పట్టువస్త్రాలు



**తిరుమల,డిసెంబర్ 1ప్రభాత వార్తప్రతినిధి:** తమిళనాడు లోని ప్రముఖ వైష్ణవక్షేత్రం శ్రీరంగం రంగనాథస్వామికి సోమవారం టిటిడి తరపున ఛైర్మన్ బిఆర్ నాయుడు దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉదయం ముందుకు ఆలయం వద్దకు చేరు కున్న ఛైర్మన్ నాయుడు దంపతు లకు శ్రీరంగం ఆలయ సంయుక్త కమిషనర్ పి.శివరామన్, ప్రధానార్చకుడు సుందరభట్టర్ సంప్రదాయంగా స్వాగతం పలికారు. స్వామివారి పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా వెళ్ళి స్వామివారికి సమర్పించారు. దర్శనానంతరం ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. 2006వ సంవత్సరం నుండి శ్రీరంగం ఆలయానికి కైశిక ఏకాదశిని పురస్కరించుకుని టిటిడి పట్టువస్త్రాలు స మర్పిస్తోంది. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు నరేశ్‌కుమార్, తిరుమల ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## శ్రీవారి ఆశీస్సులతో తెలుగు ప్రజలు సంతోషంగా ఉండాలి



**తిరుమల,డిసెంబర్ 1ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో రెండు తెలుగురాష్ట్రాల ప్రజలు సంతోషంగా ఉండాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు. సోమవారం ఉదయం తెలంగాణ ఎంఎల్‌సి పి.మహేందర్‌రెడ్డి, సినీ హాస్యనటుడు గౌతంరాజు, సినీనటుడు కౌశల్‌మండా కుటుంబంతో కలసి ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. టిటిడి అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఎడతెరిపిలేని జడివాన..

**తిరుమల,డిసెంబర్ 1ప్రభాతవార్తప్రతినిధి:** దిత్వా తుఫాన్ ప్రభావంతో కలియుగ వైకుంఠం తిరుమలలో సోమవారం వేకువజామున నుండి జడివాన బలంగా కురుస్తోంది. వరుణదేవుడు తిరుమలపై కరుణిస్తున్నాడు. గత రెండురోజులుగా బలమైన తుంపరజల్లులతో పలకరిస్తు న్నాడు. ఉదయం కొంతసమయం జోరువానకురిసింది. మళ్ళీ ఎడతెరపి లేకుండా జడివాన కురుస్తోంది. జల్లుల జడివానతో తిరుమల ఆలయం ముందు, మాఢవీధులు వర్షపునీరు చేరింది.కురుస్తున్న వర్షాలతో తిరుమల పూర్తిగా వాతావరణం మారిపోయింది.

### నాదనీరాజనంపై 700శ్లోకాలు గీతా పారాయణం

**తిరుమల, :** గీతా జయంతిసందర్భంగా తిరు మల లోని శ్రీవారి ఆలయంం ఎదుంరుంగా సోమవారం గీతా పారాయణం చేశారు. వేదపండితులు 700శ్లోకాలను పారా యణం చేశారు.


**Andhra Pradesh Capital Region Development Authority (APCRDA)**
Rayapudi(V), Thullur (M), Amaravati - 522237, Andhra Pradesh

**E-Procurement Tender Notice**

APCRDA invites tenders for the following works.

| S.No. | NIT Number | Name of the Work |
|---|---|---|
| 1 | 40/MAU61-USI0HB (OTH)/341/2025-HB Dt:26.11.2025 | "Comprehensive Annual Maintenance Contract for DAIKIN VRV Air Conditioners installed in Buildings: 1, 3, 4 & 5 of AP Secretariat, IGC, Velagapudi"-Estimate Cost Rs.1,20,00,000/- |
| 2 | 41/MAU61-USI0HB (OTH)/341/2025-HB Dt:26.11.2025 | "Comprehensive Annual Maintenance Contract for the VOLTAS VRF Air Conditioners installed in Buildings: 2 & 6 of AP Secretariat, IGC, Velagapudi"-Estimate Cost Rs.50,00,000/- |

The bids can be downloaded on AP e-procurement portal from 03.12.2025 to 18.12.2025 up to 14.00 Hrs. Due date for submission of Bids 18.12.2025 up to 15.00 Hrs, Technical bid opening 18.12.2025 @16.00Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in

**E-Procurement Short Tender Notice**

| S.No. | NIT Number | Name of the Work |
|---|---|---|
| 3 | MAU61-USI0HB (OTH)/13/2025-HB Dt:01.12.2025. | "APCRDA-Replacement of the existing street light poles with decorative poles and smart LED luminaire with independent control system along Karakatta road from Kondaveeti vaagu to honble CM Residence and then along the road leading to Seed access road (E3 road). Providing new octagonal poles in the extent portion of seed access road and replacement of existing Luminaire with smart Luminaire upto E3-N9 junction"Estimate amount: Rs.5,32,00,000/- |

The bid can be downloaded on AP e-procurement portal from 02.12.2025 to 09.12.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid 09.12.2025 up to 15.00 Hrs, Technical bid opening 09.12.2025 @16.00Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in

Sd/- Commissioner, APCRDA

భారత ప్రభుత్వము, మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్
**డెట్స్ రికవరీ ట్రిబ్యునల్**
రికవరీ ఆఫీసర్-I వారి కార్యాలయం: 31-31-21, నారాయణ భవనం, సాయిబాబా వీధి, దాబాగార్డెన్స్, విశాఖపట్నం - 530020. ఇ-మెయిల్ ఐడి: ro1.drt_vskp@outlook.com. ఫోన్: 0891-2957044

**ప్రాక్లమేషన్ ఆఫ్ సేల్ - కమ్ - ఇ-వేలం అమ్మకపు నోటీసు**
(ఆదాయపన్ను చట్టం 1961 యొక్క రెండవ షెడ్యూలు రూల్ 52(2) చూడుము)
**R.P. No. 206 of 2020 in OA No. 610 of 2018**

(1) కెనరా బ్యాంక్, మెయిన్ బ్రాంచ్, హిందూ కాలేజ్ హైస్కూల్ క్యాంపస్, గుంటూరు (ఎఆర్ఎమ్‌బి విజయవాడ ద్వారా) వర్సెస్ M/s. లక్ష్మీ నారాయణి కాటన్ మిల్ మరియు ఇతరులు మధ్యనున్న ఒ.ఎ. నెం.610/2018నకు సంబంధించి బ్యాంకులు మరియు ఫైనాన్షియల్ సంస్థలు ఋణబకాయిల వసూలు చట్టం 1993 యొక్క సెక్షన్ 19, సబ్-సెక్షన్ (22) పరిధిలోని గౌరవనీయ ప్రిసైడింగ్ అధికారి, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం వారిచే రికవరీ సర్టిఫికెట్ 25.07.2022 తేదిన జారీచేయబడినది & దానిని అమలు పరచు నిమిత్తం క్రింద సంతకందారునికి పంపబడినది.

(2) రికవరీ సర్టిఫికెట్‌లో సూచించిన రూ.2,56,22,344.75/- (అక్షరాల రెండు కోట్ల యాభై ఆరు లక్షల ఇరవై రెండు వేల మూడు వందల నలభై నాలుగు రూపాయల డెబ్బై ఐదు పైసలు) తో వడ్డీ, ఖర్చులు వగైరా ఈ క్రింది సర్టిఫికెట్ డెటార్స్ నుండి వసూలు చేయుటకు ఆర్.పి.నెం.206/2020 నందలి తీర్మానములు అమలు పరచుటకు క్రింది సంతకందారు చర్యలు చేపట్టినారు.

(CD-1) M/s. లక్ష్మీ నారాయణి కాటన్ మిల్స్, ప్రొప్రయిటర్: శ్రీమతి గుండా సుధారాణి, డి.నెం. 4-5-19, 1వ అంతస్తు, 1/2, విద్యానగర్, గుంటూరు జిల్లా-522006.

(CD-2) శ్రీమతి గుండా సుధారాణి, భర్త: జి. పూర్ణచంద్రరావు, డి.నెం. 4-5-19, 1వ అంతస్తు, 1/2, విద్యానగర్, గుంటూరు జిల్లా-522006.

(CD-3) శ్రీ మండల పాముల రెడ్డి, తండ్రి: ఎమ్. వెంకట సుబ్బారెడ్డి, డి.నెం.25-10-78/8, 3వ లేన్, శ్రీనివాసరావుపేట, గుంటూరు జిల్లా.

(CD-4) శ్రీ గుండా పూర్ణ చంద్రరావు, తండ్రి: జి వి గాలేశ్వరరావు, డి.నెం. 4-5-19, 1వ అంతస్తు, 1/2, విద్యానగర్, గుంటూరు జిల్లా-522006.

(3) తేది 30.09.2025 నాటికి బకాయి రూ. 2,30,97,310.57/- (తేది 30.09.2025 వరకు వడ్డీ లెక్కించబడినది) + భవిష్య వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు వగైరాలు పొందుటకు రికవరీ ప్రొసీడింగ్స్ ప్రారంభించడమైనది.

(4) సర్టిఫికెట్ డెటార్స్‌కి చెందిన షెడ్యూలు ఆస్తులు, క్రింద తెలిపిన సర్వీస్ ప్రొవైడర్ ఏర్పరచిన వెబ్‌సైట్ https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకంచే రికవరీ సర్టిఫికెట్ సంతృప్తి మేరకు విక్రయించుటకు నిర్ణయించడమైనది. వేలం తేది, సమయం, బిడ్ ఫామ్ దాఖలు చేయు ఆఖరి తేది, రిజర్వు ధర, బయానా, బిడ్ పెంచు మొత్తం మొ॥నవి ప్రతి ఐటమ్ / షెడ్యూలు దిగువ సూచించడమైనది.

**బిడ్లు సమర్పించుటకు చివరి తేది: 05.01.2026, సా॥ 4 గం.ల వరకు — వేలం తేది: 07.01.2026**

| షెడ్యూలు | ఆస్తి విస్తీర్ణం | రిజర్వు ధర | ధరావత్తు సొమ్ము | బిడ్ పెంపుదల | వేలం సమయం* |
|---|---|---|---|---|---|
| షెడ్యూల్-బి లోని ఐటమ్ నెం. 1 | 320 చ॥గ॥ విస్తీర్ణంలోని ఖాళీ ప్లాట్ నెం.23 | రూ. 11,52,000/- | రూ. 1,15,200/- | రూ. 10,000/- | ఉ॥11.00 గం.ల నుండి మ॥ 12.00 గం.ల వరకు |
| షెడ్యూల్-బి లోని ఐటమ్ నెం. 2 | 220 చ॥గ॥ విస్తీర్ణంలోని ఖాళీ ప్లాట్ నెం.24 | రూ. 7,92,000/- | రూ. 79,200/- | రూ. 10,000/- | |

* ఇ-వేలం సమయం – ఆటో ఎక్స్‌టెన్షన్ పద్ధతిలో ప్రతి సారి 5 నిమిషములు పొడిగించబడుతుంది అనగా ఇ-వేలం సమయం ముగిసేముందు బిడ్ వేసినచో వేలం 5 నిమిషములు పొడిగించబడుతుంది.

(5) సర్వీస్ ప్రొవైడర్ వెబ్‌సైట్ https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్ ఇ-వేలం నందు పాల్గొనవలసిందిగా ప్రజలను ఆహ్వానించడమైనది. సర్వీస్ ప్రొవైడర్ వివరములు: మెస్సర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సంప్రదించవలసిన వ్యక్తి పేరు: శ్రీ ధరణి కృష్ణ, ఫోన్: 9948182222, ఇ-మెయిల్: andhra@c1india.com

(6) ఆసక్తి గల బిడ్డర్లు / పాల్గొన్నవారు ఇ-వేలం అమ్మకానికి సంబంధించిన నియమ నిబంధనలు, పూర్తి వివరాలు కొరకు వెబ్‌సైట్ https://www.bankeauctions.com ద్వారా పరిశీలించవలసినదిగాను మరియు బిడ్‌ఫారమ్‌లు దాఖలు చేయుటకు మరియు ఇ-వేలం నందు పాల్గొనుటకు అవసరమైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, యూజర్ ఐడి, పాస్‌వర్డ్ సహాయం, విధానం, ఆన్‌లైన్ శిక్షణ కొరకు సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించవలసినదిగా సలహా సూచించడమైనది.

(7) ఆసక్తి గల బిడ్డర్లు / పాల్గొనువారు ఇ.ఎమ్.డి. సొమ్ము ఆర్.టి.జి.ఎస్. / నెఫ్ట్ / ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా కెనరా బ్యాంక్, ఎఆర్ఎమ్ బ్రాంచ్, విజయవాడ వారి అకౌంట్ నెం. 209272434, IFSC Code:CNRB0006682 వారికి క్రెడిట్ చేయవలెను మరియు బిడ్ ఫారమ్‌లు పైన తెలిపిన టేబుల్ నందు గల ఆఖరితేదీలోగా సమర్పించవలెను మరియు పూర్తిచేసిన బిడ్ ఫారమ్స్‌ను, ఆధార్ కార్డు, పాన్‌కార్డు కాపీ, ఐడి ప్రూఫ్, ప్లాట్ నెంబరు, అడ్రస్ ప్రూఫ్ మరియు ఇఎమ్‌డి డిపాజిట్ ప్రూఫ్ మొదలగునవి దిగువ సంతకందారునికి రిజిష్టర్డు పోస్టు / స్పీడ్ పోస్టు / కొరియర్ ద్వారా 06.01.2026 సాయంత్రం 4 గంటల లోపు అందేటట్లు పంపవలెను, పోస్టల్ ఆలస్యమునకు బాధ్యత వహించబడదు.

(8) వేలంలో పాల్గొనుటకు ఆసక్తిగలవారు వేలం నియమ నిబంధనలు, విచారణలు, షెడ్యూలు ఆస్తి తనిఖీ, షెడ్యూలు ఆస్తి వివరాలు తెలుసుకొనుటకు శ్రీ ఎస్ సి మీష్, ఛీఫ్ మేనేజర్ (మొబైల్ నెం.8331011695), ఇ-మెయిల్ ఐడి:armvij@canarabank.com వారిని సంప్రదించవలసినదిగా కోరడమైనది. ఔత్సాహిక బిడ్డర్లు బిడ్ సమర్పించేముందు స్వయంగా ఆస్తి ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్‌లు మరియు ఆస్తి టైటిల్ గురించి పరీక్షించుకొని తృప్తి చెంది వేలంలో పాల్గొనవలెను. దిగువ సంతకందారు ధృవీకరించిన విజయవంతమైన బిడ్డర్‌కు ఆస్తి మరియు సంబంధిత టైటిల్ డీడ్ డాక్యుమెంట్లను బ్రాంచ్ హెడ్ గారు అందచేస్తారు.

**షెడ్యూలు ఆస్తి వివరములు**

షెడ్యూల్-బి: (సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 99/2014 తేది 08.01.2014 ప్రకారం 2వ ప్రతివాది అనగా శ్రీమతి గుండ సుధారాణికి చెందిన ఆస్తులు).

ఐటమ్ నెం.1: గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు ఎస్ఆర్‌ఒ, సబ్-జిల్లా, నడింపాలెం గ్రామపంచాయతీ & గ్రామం, సుప్రియ ఎన్‌క్లేవ్, ఫేజ్-II, డి.నెం.2/C1, 2/C2, 11/A2, 11/A3, 11/A4, 11/B3, 11/B4, మొత్తం 320 చ॥గ॥ రెసిడెన్షియల్ ఖాళీ స్థలంలోని ప్లాట్ నెం. 23. హద్దులు: తూర్పు : 33 అ॥ వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెం. 38, దక్షిణం: గుండా సుధారాణి ప్లాట్ నెం.24, ఉత్తరం: 33 అ॥ వెడల్పు రోడ్డు.

ఐటమ్ నెం.2: గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు సబ్-జిల్లా, నడింపాలెం గ్రామపంచాయతీ & గ్రామం, సుప్రియ ఎన్‌క్లేవ్, ఫేజ్-II, డి.నెం.2/C1, 2/C2, 11/A2, 11/A3, 11/A4, 11/B3, 11/B4, మొత్తం 220 చ॥గ॥ రెసిడెన్షియల్ ఖాళీ స్థలం గల ప్లాట్ నెం. 24. హద్దులు: తూర్పు: 33 అ॥ వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెం. 37, దక్షిణం: ప్లాట్ నెం.25, ఉత్తరం: గుండా సుధారాణి ప్లాట్ నెం.23.

(నేను స్వయంగా మరియు ఈ ట్రిబ్యునల్ ముద్రికతో విశాఖపట్నం వద్ద తేది.18.11.2025న జారీచేయడమైనది)

(అవసరాల అనీల్), రికవరీ ఆఫీసర్,
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం

మంచిగా ఉండాలనుకొని చెడును సమర్థించేకన్నా దాన్ని ఎదిరించి చెడ్డ కావడమే మేలు.

-టంగ్‌స్టన్

# ఊబకాయానికి ఉలుకెక్కువ!

దేశంలో ఊబకాయుల సంఖ్య ఆందోళనకరంగా పెరిగిపోతోంది. ఏదో కనపడిందల్లా ఆబగా తినడం వల్ల, ఆకలికి ఓర్చుకోలేకుండా పరిమిత భోజనానికి అలవాటుపడకపోవడమూ, వారి జీవన శైలి ఇందుకు కారణాలన్న విషయం తెలిసిందే. ఈమధ్యనే ప్రధాని నరేంద్ర మోదీ తన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఉబకాయంపై ప్రస్తావించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, 2022లో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 250 కోట్ల మంది అధిక బరువుతో బాధ పడుతున్నారు. భారతదేశంలో కూడా ఎనిమిది మందిలో ఒకరు అధిక బరువుతో బాధపడుతున్నారు. ఈ సమస్యను ఎదుర్కోవడానికి, 10 శాతం నూనె వాడకాన్ని తగ్గించాలని ప్రధాని సందేశం చర్చనీయాంశంగా మారింది. ఊబకాయ వ్యతిరేకోద్యమాన్ని ఆయనే సూచించారు. ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి, ప్రధాని మోదీ 10 మంది ప్రముఖులను నామినేట్ చేసి వారు మరో 10 మందిని సూచిస్తే మంచిదని సూచించారు. ఈవిధంగా ప్రతి పదిమంది మరో పది మందిని, అలానే వారు మరో పది మందిని, నామినేట్ చేస్తూ ఊబకాయం ఎంత అనర్థమో అవగాహన కల్పించే ఉద్యమ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినా ఒక్క అడుగు ముందుకు కదిలిన దాఖలాలు లేవు. అధిక క్యాలరీలతో కూడిన ప్రాసెస్ చేయబడిన ఆహారం, చాక్లెట్, ఫాస్ట్‌ఫుడ్ తదితరాలు ఊబకాయానికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. మానవ శరీరాన్ని సరైన పద్ధతిలో క్రియాశీలకంగా ఉంచుకోలేకపోవడమూ ఇందుకు కారణమే! బ్లూటూత్, ఇంటర్నెట్, కంప్యూటర్లు, టీవీలను తదేక దీక్షగా,క్షణం విరామం ఇవ్వకుండా నిరంతరం వినియోగిస్తుండడం వలన పరిస్థితి శారీరక శ్రమను తగ్గిస్తుంది.మూలకశక్తిని తక్కువగా శరీర బరువునుపెంచుతుంది. అలా వచ్చిన ఒళ్ళును తగ్గించుకోవాలన్నా కఠోర శ్రమ, పరిమిత ఆహారం, నియమానుసారం ఆహార స్వీకరణ చాలాముఖ్యం. కొంతమంది వ్యక్తులలో వంశపారంపర్యంగా లేదా హార్మోన్లలో మార్పులు, మానసిక ఒత్తిడి లేదా ఆందోళన అనేది ఎక్కువ ఆహారం తినడానికి కారణమవుతుంది. మధుమేహమేకాదు, గుండె జబ్బులు,క్యాన్సర్లతో పాటు ఊబకాయం కూడా భారతీయులకు పెనుముప్పుగా పరిణమిస్తోంది. స్థూలకాయులకు ముందుగా చర్చించుకున్న మూడు జబ్బులతో పాటు హృద్రోగంకూడా కలవరపెడుతోంది. ఒక్కొక్కప్పుడు వైద్యానికి కాలాతీతమై కాయం కడతేరుతుంది. భారతదేశంలోనూ స్థూలకాయుల సంఖ్య తక్కువేం కాదని ఎన్నో సర్వేలు చెప్పచూశాయి. దేశంలో ఊబకాయం వలన రోగాలబారిన పడుతున్న 54శాతం మందిలో ఆహారపుటలవాట్లే వాళ్ళను పొట్టన బెట్టుకున్నాయని వైద్యులు తేల్చిపారేశారు. అయినా ఆదిలో కొందరు భయపడకపోయినా ఇప్పుడెందరో లావు తగ్గించుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు.దేశంలో టైప్ 2మధుమేహం, గర్భాశయ,కాలేయ, వక్షోజ క్యాన్సర్లు, గుండెజబ్బుల పీడితులే అధికంగా ఉన్నారు. ప్రముఖ వైద్య విజ్ఞాన పత్రిక 'లాన్సెట్ గత ఏడాది ప్రచురించిన 2022 నాటి సర్వేవిశేషాలు పరిశీలిస్తే ఐదు నుంచి 19 ఏళ్లలోపువారు 12మిలియన్ల మంది ఊబకాయంతో బాధ పడుతున్నారని అంచనా వేసింది. స్థూలకాయానికి తారతమ్యాలు, వయోభేదం వంటి మొహమాటాలు ఏమీ ఉండవు. అన్ని వయసులవారినైనా ఇట్టే ఆకట్టుకుంటుంది. గంటల కొద్దీ కూర్చుని పనిచేసే ఉద్యోగులు ఊబకాయం బారిన పడతారని వింటున్నాం. వారి జీవనశైలి గురించి కూడా చెప్పుకుంటున్నాం. ఎక్కువగా ఐటి ఉద్యోగులు ఒబేసిటీకి లోనవుతున్నట్లు అర్థం చేసుకోవచ్చు. శరీరంలోకి చేరుతున్న క్యాలరీలకు, ఖర్చయ్యే క్యాలరీలకుమధ్య సమతుల్యత లేకపోవడం వల్లనే కొవ్వుశరీరంలో పేరుకుపోయి స్థూలకాయానికి దారితీస్తోందని శాస్త్రజ్ఞులు ఏనాడో చెప్పినా జనం పెడచెవిన పెట్టారు.ఇప్పుడు లబోదిబోమంటున్నారు. కేవలం ఆహారపుటలవాట్లే కాదు. ఒత్తిడి, నిద్రలేమి, ఆందోళన, హార్మోన్ల అసమతుల్యత కూడా స్థూలకాయానికి హేతువులే! ప్రత్యేక విషయమేమిటంటే ఊబకాయులు సాధారణంగా ఆత్మన్యూనతకు, కుంగుబాటుకూలోనై బాహ్య ప్రపంచంలోకి రావడానికి సిగ్గరులుగా మారుతుంటారు. కొంతమంది ఇంతకు ముందు ఉన్న ఆరోగ్య కరమైన జీవనశైలిని విస్మరించి పీకల మీదకు తెచ్చుకుంటున్నారు. శరీరంలో ఒకసారి పేరుకుపోయిన కొవ్వు కరగడమంటే మాటలు కాదు. వ్యాయామంపైదృష్టి పెట్టడం ద్వారా కొంత బరువును తగ్గించుకోవచ్చు. ఈ మధ్య కొంతమంది సెలబ్రిటీలు సన్నబడి ఊబకాయానికి సవాళ్లు విసిరారు. అదే మంచిదే. కానీ వారు అవలంబించిన వ్యాయామమేదో, వారు అంత సన్నగా ఎలా మారారో వారే స్వయంగా చెబితే వినాలని ఉంది.మనం అప్రయత్నంగా స్వీకరించే అధికక్యాలరీలతో కూడిన ఆహారం, ప్రాసెస్ చేయబడిన ఫుడ్,నూనె, చక్కెరలను ఆహార మెనూ నుండి దూరంపెట్టాలి. నూనెవాడకాన్ని తగ్గించేందుకు ప్రధాని మానవాళిని ప్రేరేపిస్తున్నారంటే దాని వల్ల ఉభయ తారకంగా ఉండే ప్రయోజనాలున్నాయి. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు, తక్కువ నూనె వాడేఆహారాలు తినడంవల్ల ఊబకాయాన్ని నివారించవచ్చని ఆయనసూచిస్తున్నారు.ప్రజారోగ్యం గురించి చర్చ లేవదీయడం ఆహ్వానించదగినదే. కొందరైనా అప్రమత్తమోతారు.లేకుంటేఏవో ఖరీదైన మందులకు భ్రమపడి ఏనుగులా ఉన్నవాడు,పీనుగులా తయారౌతాదండి కొన్నిఅనుభవాలుచెబుతున్నాయి. బేరియాట్రిక్ సర్జరీల సంగతి తెలిసిందే. ఈ రీత్యాఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్సహించడంద్వారా ఊబకాయాన్ని నియంత్రించడం సాధ్యమేనన్న ఉద్దేశ్యం హ్వానించదగినదే!

చెడును విస్మరించి మంచిని సంస్కరించి సంరక్షించుకోవడం యోగ్యత లక్షణం.



స్వామి వివేకానంద

సమస్య చిన్నదైనా, పెద్దదైనా సకాలంలో చర్య తీసుకుంటే ఎందులోనూ అపజయం అనేది ఉండదు.



సిసి కాల్టన్

## ప్రజావాక్కు



### మూఢ నమ్మకాలు నశించాలి

ఈమధ్య ఒగృహానికి శంకుస్థాపనకువిచ్చేసిన ఓ సామాన్య గృహస్తుడు తన తల్లితోరాగా దానిని తనసమక్షంలో నిర్వహించడానికి తెలంగాణా రాష్ట్రమంత్రి జూపల్లి కృష్ణారావు గారు విచ్చేసారు. ప్రారంభోత్సవానికి కొబ్బరికాయ కొట్టడానికి ఆ సామాన్యుని భార్యను ఆదేశించగా ఆమె నిండు గర్భవతి కావడంవలన రాలేకపోయిందని చెప్పగా అక్కడే ఉన్నఅతని తల్లిని ఆపూజా కార్యక్రమానికి పిలువగా ఆమె తాను వితంతువని నిరాకరించింది. అప్పుడు మంత్రి వరేర్యులుకల్పించుకుని ఆమె చేతే కార్యక్రమం నిర్వహింపజేసారు.వితంతువులను అపశకునంగా ఏ సందర్భంలోనూ చూడకూడదని వారిని అందరిలాగే గౌరవంగా చూడాలని మూఢ విశ్వాసాలకు దూరంగా ఉండాలని మంత్రి గారు తెలియజేసారు. మూఢ నమ్మకాలు నశించాలి.

- డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### వణికిస్తున్న టీబీ

ప్రపంచాన్ని ఇప్పటికీ వణికిస్తున్న ప్రాణాంతక అంటువ్యాధుల్లో క్షయ(టీబీ) ఒకటి. ప్రపంచ ఆరోగ్యసంస్థ తాజాగా విడుదల చేసినగ్లోబల్ ట్యూబర్క్యులోసిస్ రిపోర్ట్ 2025 ప్రకారం,2024లో ప్రపంచవ్యాప్తంగా1.07కోట్ల కేసులు, 12లక్షలకుపైగా మరణాలు నమోదయ్యాయి. ప్రపంచంలోని మొత్తం టీబీ కేసుల్లో నాలుగో వంతు భారత్‌లోనే ఉండటం అత్యంత ఆందోళనకరం. 2025నాటికి దేశాన్ని టీబీ రహితంగా మార్చాలన్న లక్ష్యం ఎందుకు ఇంకా దూరంలోనే ఉందనే ప్రశ్నసహజం.భారత్‌లో టీబీ నిర్మూలనకు ప్రధానఆటంకం వ్యాధి నిర్ధారణలో జాప్యం. లక్షణాలున్నా పరీక్షలు చేయించుకోకపోవడం వల్ల అనేక కేసులు బయటపడకపోవడం, అంతరంగా వ్యాప్తి చెందుతోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### మూడో ప్రపంచ యుద్ధం!

2030లోగారష్యా, నాటోకూటమితో యుద్ధానికి సన్నద్ధం కావాలని నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టో హెచ్చరిక జారీచేశాడు.ఇరాన్,పాకిస్థాన్, స్వీడన్, ఐర్లాండ్ దేశాలను శత్రుదేశాలుగా గుర్తిస్తున్నామని ఇజ్రాయిల్ అధ్యక్షుడు బెంజమిన్ నెతన్యాహు ప్రకటించాడు. రష్యా నాటో మీద, ఇజ్రాయిల్ ఇరాన్ మీద, చైనా తైవాన్ మీద దాడి చేస్తేమూడో ప్రపంచ యుద్ధం జరిగే అవకాశం ఉంది.

- పుట్లూరి రాం నర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా

### ఫ్యాషన్ ప్రపంచానికి జిల్లాల వెలుగు

తెలంగాణలోని చందూరు ప్రాంతం చారిత్రకమైన చేతి నేస్తాల్లో ప్రసిద్ధిపొందిన ప్రాంతం.అక్కడి వీవర్లు తరతరాలుగా వస్త్రోత్పత్తిని తమ వృత్తిగా కొనసాగిస్తూ, సంప్రదాయాన్ని సంరక్షించడమే కాకుండా కొత్త ధోరణులను స్వీకరించే సామర్థ్యాన్ని ప్రతిస్ఫూరింపజేస్తున్నారు. తాజాగా చందూరు వీవర్లు రూపొందించిన వినూత్న డిజైన్లు, ఆధునిక రంగుల సమన్వయం, ప్రత్యేకమైన మగ్గనిర్మాణం దేశవ్యాప్తంగా ఫ్యాషన్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవలి కాలంలో ప్రజలు చేతి నేస్తాలపై మళ్లీ ఆసక్తి చూపుతున్నారు. ఈ అవకాశాన్ని చందూరు వీవర్లు సద్వినియోగం చేసుకుంటూ సంప్రదాయ పట్టు, కాటన్ చీరలకు ఆధునిక శైలి జోడించారు. ముఖ్యంగా యువతను ఆకర్షించే విధంగా లైట్‌వెయిట్ ఫ్యాబ్రిక్స్, జ్యామితీయ నమూనాలు,సాఫ్ట్‌కలర్ కాంబినేషన్లు వినియోగించి ప్రత్యేకమైన వస్త్రాలు తయారు చేస్తున్నారు. వీరి చేతిపనిలో కనిపించే నైపుణ్యం, నూలుజాడల మధ్య ఉండే కచ్చితత్వం, రంగుల సమతుల్యత - ఇవన్నీ ప్రపంచ స్థాయి డిజైనర్లను కూడా ఆకర్షిస్తున్నాయి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### ఖంగు తింటున్న సర్పంచ్ అభ్యర్థులు

పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తున్న పాలకులను ప్రజలు ఎన్నుకుంటున్న ప్రజా సమస్యలు మాత్రం మారడం లేదు. ప్రతిఎన్నికల్లో ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇస్తూ సర్పంచిగా ఎన్నికైన తర్వాత ఆ గ్రామంలో ప్రజలకుమౌలిక సదుపాయాలు కల్పనలో సర్పంచులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం గ్రామపంచాయతీ ఎన్నికలకుప్రభుత్వం సిగ్నల్ఇవ్వడంతో పోటీ చేసే అభ్యర్థులపై ఆయా గ్రామంలో ప్రజలు ఖంగు తింటున్నారు.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### వ్యవస్థలు బాగా పని చేయాలి

దేశంలోని ముఖ్యమైన వ్యవస్థలు సక్రమంగా పని చేయాలి. పోలీసు,చట్టాలు, చట్టసభలు, ఇతర రంగాల ఉద్యోగులు, పౌరులు బాగా పని చేయాలి. వ్యవస్థలను నియంత్రించి అణచివేసేది రాజకీయ శక్తులు కాబట్టి వ్యవస్థలుఅప్రమత్తంగా ఉంటే సరిపోతుంది. వ్యవస్థలు ఎవరి వత్తిళ్లకు లొంగకూడదు. ప్రజాసేవలో ఉన్న ప్రతి ఒక్క పౌరులు నిజాయితీగా పనిచేయాలి. అప్పుడే శాంతియుత స్వతంత్ర దేశంగా ఉంటుంది.

- డి చాంద్ బాషా, కర్నూలు

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# కులగణనపై ఇంత దుష్ప్రచారమెందుకు!

**బీసీలకు,ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి కేటాయించే నిధులు, వనరుల పంపిణీ విషయంలో ఇచ్చేది జానడు.. ప్రచారం మాత్రం మూరెడు అన్నట్టు వుంటుంది. అంబానీ, ఆదానీ వంటి పారిశ్రామిక, వాణిజ్యవేత్తలకు ఇచ్చే లక్షల కోట్ల రాయితీలతో పోల్చుకుంటే బడుగులకు కేటాయించే నిధులు నామమాత్రమే. ఉదాహర ణకి మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధిగ్యారంటీ పథకం కింద దేశవ్యాప్తంగా 27కోట్ల మందికి 2024-25 సంవత్సరానికి 86,000కోట్ల రూపాయలు కేటాయించగా, అదే సంవత్స రంలో ఎక్సైజ్,కస్టమ్స్ వంటి పన్నులకి సంబంధించి ఒక్క అంబానీకి చెందిన రిలయన్స్ సంస్థలు లక్షా 20వేల కోట్ల రూపాయల మేరకు మినహాయింపులు పొందాయి. అందు వల్ల అధికారంతోపాటు బడ్జెట్ కేటాయింపు,వనరులపంపిణీ జరిగినప్పుడు అది ప్రజాస్వామ్య దేశం అవుతుంది.నిజమైన ప్రజాస్వామ్యాన్ని కోరుకునే వారందరూ తప్పనసరిగా కుల గణనకు మద్దతుపలకాల్సి నఅవసరం వుంది.**



అన్నవరపు బ్రహ్మయ్య

కులగణనకు ఆమోదం తెలిపిన కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇటీవల కొంతమంది వ్యక్తులు కులగణన వలస కులతత్వతం పెరుగుతుందనే వాదనలను ముందుకు తీసుకువస్తున్నారు. కులగణన కోరుకుంటున్న వారెవ్వరూ కులపునాదులపై జాతిని నిర్మించాలని కోరుకోవడం లేదు. 75 సంవత్సరాలుగా కొనసాగతున్న రెండు మూడు కులాల పాలనా ఆధిపత్యాన్ని నివారించి, సమాజంలో అన్ని వర్గాలకు పాలనతోపాటు ప్రకృతివనరుల పంపిణీలో భాగస్వామ్యం కల్పించాలని కోరుకుంటున్నారు. నిజానికి స్వాతంత్య్రం లభించిన వాటి నుంచి నేటి వరకు అగ్రవర్ణ పునాదులపైనే భారతదేశ పాలన కొనసాగుతోంది. దాదాపు ఏడున్నర దశాబ్దాలుగా మూడు నాలుగు కులాలే అధిపత్యం చెలాయిస్తున్నప్పటికీ గుర్తుకురాని కులతత్వం కేవలం కులగణన చేయడంవల్ల ప్రజలలో కులతత్వం పెరుగుతుందని ప్రచారం చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. కులగణన చేయడం వల్ల 'ప్రజాస్వామ్యం పలుచన' అవుతుందని కొంతమంది మేధావులు వ్యాఖ్యానిస్తున్నారు. దేశ జనాభాలో కనీసం 10 శాతం కూడా లేని మూడు నాలుగు కులాలకు చెందినవారు, 90 శాతం ప్రజలకు అధికారం, వనరులు అందకుండా చేయడం 'చిక్కనైన ప్రజాస్వామ్యం' ఎలా అవుతుందో అర్థం కావడం లేదు. లెజిస్లేచర్ (చట్ట సభలు), కార్యనిర్వాహణ (ఎగ్జిక్యూటివ్), న్యాయ (జుడిష్యరీ) వ్యవస్థలతో కూడినదే ప్రజాస్వామ్యం మొత్తం 543 లోక్‌సభ స్థానాలలో బీసీ వర్గాలకు చెందిన లోక్‌సభ సభ్యుల సంఖ్య 26శాతం దాటలేదు. 18వ లోక్‌సభ(ప్రస్తుత)లో ఒబీసీల సంఖ్య 140 నుంచి 145 మంది మాత్రమే ఇక సివిల్ సర్వీసులలో, వివిధ ప్రభుత్వశాఖలలో పనిచేసే ఉన్నత ఉద్యోగాలలో సమాజంలో 52 శాతం (మండల కమిషన్ నివేదిక ప్రకారం) కలిగిన బీసీ కులాల వాటా 20 శాతం మించలేదు. న్యాయవ్యవస్థకు వస్తే భారత దేశంలో వున్న మొత్తం 25 రాష్ట్ర హైకోర్టులలో 2018, జులైనాటికి మొత్తం జడ్జీల సంఖ్య 1125, వీరిలో ఒబీసీల సంఖ్య కేవలం 93మంది, ఎస్సీలు 25, ఎసిటి 17 మంది మాత్రమే. ఇక సుప్రీం కోర్టులో పనిచేస్తోన్న మొత్తం జడ్జీల సంఖ్య34, వీరిలో ఒబీసీ సామాజికవర్గానికి చెందినవారు కేవలంఒకరు మాత్రమే. ఈ విషయాలను ఇటీవల రాజ్యసభలో సిపిఎం సభ్యులు జాన్ బిటాస్ అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ప్రభుత్వ న్యాయశాఖ ప్రకటించింది. ప్రజాస్వామ్యంలో లెజిస్లేచర్, ఎగ్జిక్యూటివ్, జుడిష్యరీలను మూడు స్తంభాలుగా, మీడియాను నాలుగో స్తంభంగా పేర్కొంటారు. ఇక మీడియా, వాణిజ్య, వ్యాపార, పారిశ్రామిక రంగాలలో బడుగుల వాటా ఎంతో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కులగణన వల్ల ప్రజలలో కులాల దృష్టి పెరుగుతుందని వ్యాసంలో ప్రస్తావించారు. స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి నేటివరకు కులమే ప్రధాన పాత్ర వహించడం జగమెరిగిన సత్యం. వివిధ రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపికలో కులం తొలి ప్రాధాన్యత. ఆ తర్వాత ప్రాధాన్యం ఆర్థిక వనరులు. వీటికి ఆయా పార్టీలు పెట్టిన ముద్దుపేరుగెలుపు గుర్రాలు. ఉదాహరణకి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో 4 శాతం జనాభా కలిగిన కమ్మ సామాజిక వర్గం నుంచి 36 మంది శాసన సభ్యులు, 5 శాతం వున్న రెడ్డి సామాజిక వర్గం



నుంచి 32 మంది, 10 శాతం జనాభా కలిగిన కాపుల నుంచి 18 మంది శాసన సభ్యులు, 0.6 శాతం జనాభా కలిగిన క్షత్రియ సామాజిక వర్గంనుంచి ఏడుగురు,4 శాతం జనాభా కలిగిన వైశ్య, బ్రాహ్మణ వంటి ఇతర ఒసి కులాల నుంచి 4శాసన సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తుండగా ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగ రక్షణ వుండటం వల్ల వారి జనాభా నిష్పత్తి ప్రకారం 29మంది ఎస్సీలు, ఎడుగురు ఎస్టీ శాసన సభ్యులు వున్నారు. ఇక 52 శాతం జనాభా కలిగిన బీసీ కులాలకు సంబంధించి కేవలం 40 మంది శాసన సభ్యులు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ముఖ్యమైన రాజకీయ పార్టీలకు తమని లౌకిక పార్టీలని,బీసీల పార్టీలని చెప్పుకొంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీ తరపున కమ్మేతరులు, వైఎస్ఆర్ కాంగ్రెస్పార్టీ తరపు రెడ్డేతరులు, ఒకవేళ జనసేన అధికారంలోకి వస్తే కాపేతర సామాజిక వర్గాలను ముఖ్యమంత్రులు కాగలరా? పాము ఎన్ని మెలికలు తిరిగినా పుట్టలోకి వెళ్లే సమయంలో సాఫీగానే వెళ్లినట్టుగా రాజకీయపార్టీ నేతల ఎన్నికలకు ముందు బీసీలకు అత్యంత ప్రాధాన్యత, బీసీలకు ప్రత్యేక బడ్జెట్టు అంటూ కబుర్లు చెప్పినా చివరకు వచ్చే సరికి మొత్తం జనాభాలో 10 శాతం కూడా లేని అధిపత్యాల కులాలదే ఆధిపత్యం అవుతుంది. అందువల్ల కులగణన వల్ల కొత్తగా ప్రజలలో కులాలపై దృష్టిపెరగడం అంటూ ఏమీవుండదు.స్వాతంత్య్రం వచ్చి ఏడున్న దశాబ్దాలు దాటుతున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్లో కుమ్మరి, కమ్మరి, నాయీబ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, మేదర, గంగిరెద్దుల వంటి అత్యంత వెనుకబడిన కులాలు ఇప్పటి వరకు చట్టసభల మెట్టుఎక్కలేదు. బండ, మొండి, కాటిపాల, పెరిక ముక్కుల, దాసరి, బుడబుక్కల, పిచ్చికుంట్ల, పాముల, దమ్మలి, ఉప్పర, గౌడజెట్టి, కాకిపడగల, అద్దపు సింగులు, గౌడజెట్టీలు వంటి దాదాపు 96కులాలకు అధికారం అంటే, ఏమిటో కూడా తెలియదు. ఊరిలో జీవించే ఈకులాల సంగతి ఎలావున్నప్పటికీ సంచారజీవనం,యాచన వృత్తి కలిగిన వారికి ఆధార కార్డులు,బియ్యం కార్డులు కూడ లేకుండా ఊరిబయట గుడిసెలలో జీవిస్తున్నారు. ఇటువంటి వారిని కనీసం పౌరులుగా గుర్తించాలన్న కులగణన చేయడం అనివార్యం.ఒబిసి కులాల కేటగిరీల డివిజన్కు సంబంధించి కేంద్రప్రభుత్వం నియమించిన జస్టిస్ రోహిణి కమీషన్ ఇటువంటి సంచార, విముక్తి కులాల గురించే ప్రధానం నివేదికలో ప్రస్తావించారు. కులగణనతోపాటు ఈ నివేదికను కూడా బహిర్గత పర్చాల్సిన అవసరం వుంది. కులగణన చేపడితే ఒక ప్రతి పది సంవత్సరాలకు కులగణన జరిగితే ఏవో ఘోరాలు జరిగిపోతాయనే భావనకూడా వ్యక్తంచేశారు. ప్రతి పది సంవత్సరాలకు కులగణన జరిగితే తమ జనాభా నిష్పత్తి కంటే అత్యధికంగా అధికారం అనుభవిస్తున్న వర్గాల నుంచి అధికారం చేజారిపోవడం మినహా ఏమీ జరగదు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన నాటినుంచి నేటి వరకు ప్రతి 10ఏళ్లకు జనాభాగణనతో పాటు షెడ్యూల్‌కులాల,షెడ్యూల్ తెగల జనాభా గణన జరుగుతూనే వుంది. వారికి కేటాయించిన సీట్లు వారు పొందడం మినహా అదనంగా ఒక్క స్థానం కూడా పొందడం లేదు. అయినా బడుగువర్గాలకు చెందిన వారు అన్ని సీట్లు మాకే కావాలని కోరడం లేదు, "మేకెంతో మా కంత" అనే నినాదంతో తమ జనాభా నిష్పత్తి ప్రకారం తమకు చట్టసభలలో స్థానాలు కావాలని మాత్రమే కోరుతున్నారు. సంక్షేమం పేరిట బడుగులకు కేంద్ర ప్రభుత్వం వేల కోట్లరూపాయలు వృధాచేస్తోందనే భావనలో అధిపత్య కులాలకు చెందినవారు వుంటారు.బీసీలకు,ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి కేటాయించే నిధులు, వనరుల పంపిణీ విషయంలో ఇచ్చేది జానడు.. ప్రచారం మాత్రం మూరెడు అన్నట్టు వుంటుంది. అంబానీ, ఆదానీ వంటి పారిశ్రామిక, వాణిజ్యవేత్తలకు ఇచ్చే లక్షల కోట్ల రాయితీలతో పోల్చుకుంటే బడుగులకు కేటాయించే నిధులు నామమాత్రమే. ఉదాహరణకి మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధిగ్యారంటీ పథకం కింద దేశవ్యాప్తంగా 27కోట్ల మందికి 2024-25 సంవత్సరానికి 86,000కోట్ల రూపాయలు కేటాయించగా, అదే సంవత్సరంలో ఎక్సైజ్,కస్టమ్స్ వంటి పన్నులకి సంబంధించి ఒక్క అంబానీకి చెందిన రిలయన్స్ సంస్థలు లక్షా 20వేల కోట్ల రూపాయల మేరకు మినహాయింపులు పొందాయి. అందు వల్ల అధికారంతోపాటు బడ్జెట్ కేటాయింపు,వనరులపంపిణీ జరిగినప్పుడు అది ప్రజాస్వామ్య దేశం అవుతుంది.నిజమైన ప్రజాస్వామ్యాన్ని కోరుకునే వారందరూ తప్పనసరిగా కుల గణనకు మద్దతుపలకాల్సి నఅవసరం వుంది. •

# అభివృద్ధిని వెక్కిరిస్తున్న బాల కార్మిక వ్యవస్థలు

ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి

బానిసత్వ దురాచారం అనాదిగా మానవాళిని పట్టి పీడిస్తున్నది. డిజిటల్ వెలుగుల నీడన బలవంతపు వెట్టిచాకిరి చీకట్లు కమ్ముకున్నాయి. బానిసత్వం అమానవీయం, మానవ హక్కుల హననం. బానిసత్వం ప్రపంచ దేశాలన్నింటిలో విస్తరించింది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 50 మిలియన్ల అణగారిన వర్గాల ప్రజలు బలవంతంగా ఆధునిక బానిసత్వ సంకెళ్లలో బంధించబడి జీవితాలను కటిక చీకట్లలో గడుపుతున్నారు. వీరిలో 28 మిలియన్లు బలవంతపు శ్రమ, 22మిలియన్లు బలవంతపు వివాహాల వలయంలో చిక్కుకొని బతుకులు దుర్భరంగా గడుపుతున్నారు. ఒకవ్యక్తి కడు పేదరికాన్ని బలహీనతను ఆసరాగా చేసుకొని అక్రమంగా బలవంతంగా శ్రమకు నియమించుకోవడం, లైంగిక హింసకు గురి చేయడం, బాల్య వివాహాలు చేసుకోవడం, బాల కార్మికులు, యుద్ధ సంక్షోభాల్లో పిల్లల చేతుల్లో ఆయుధాలు పెట్టడం, వెట్టిచాకిరిని ప్రోత్సహించడం, పరిశ్రమల్లో చిట్టి చేతులను బంధించడం లాంటి దురాచారాలను బానిసత్వ రూపాలుగా చెప్పుకుంటున్నాం. అంతర్జాతీయ బానిసత్వ నిర్మూలన దినం2025 ఇలాంటి అమానవీయ ఆధునిక బానిసత్వ దురాచారాన్ని రూపుమాపడానికి ఐరాస చొరవ తీసుకొని ప్రతి ఏటా 02 డిసెంబర్ రోజు'అంతర్జాతీయ బానిసత్వ నిర్మూలన దినం (ఇంటర్నేషనల్ డే ఫర్ అబాలిషన్ ఆఫ్ స్లేవరీ)' పాటించడం 2016 నుంచి కొనసాగుతున్నది. అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం బానిసత్వం, బలవంతపు వివాహాలు జరగడం విచారకరం. అంతర్జాతీయ కార్మిక సంస్థ 2021 వివరాల ప్రకారం ప్రపంచ దేశాల్లో28 మిలియన్ల ప్రజలు బానిసత్వ చీకట్లలో మునిగి పోయారని, వీరిలో అధికంగా ఏసియా పసిఫిక్ దేశాలు, యూరోప్ సెంట్రల్ ఏసియా, ఆఫ్రికా, అమెరికా, అరబ్ దేశాల్లో బానిసత్వం విస్తరించుట గమనించారు. పరిశ్రమలు, వ్యవసాయం, గృహ పనులు, సేవా సంస్థల్లో బానిసత్వ కోరలు అధికంగా వ్యాపించి ఉన్నాయి. దక్షిణాషియా, ముఖ్యంగా భారత్, పాకిస్థాన్, నేపాల్‌లో పేదరికం అధికంగా ఉండడంతో బానిసత్వ దురాచారం వేళ్లూనుకొని ఉన్నది. భారత్‌లో 3కోట్లబానిసలు బతుకులు భారంగా ఈడ్చుతున్నారు. భారతంలో బానిసత్వ దురాచారం అనేక రూపాల్లో ఉన్నాయి. ప్రాచీన కాలంలో బానిసల నుదుటిపై కాల్చిన కడ్డీలతో శాశ్వతగుర్తులు కూడా వేసే విషసంస్కృతి అమలైంది. వినని వారిని కొరడాలతో కొట్టడం, చీకటి గదుల్లో బంధించి ఆహారం ఇవ్వకపోవడం కూడా జరిగేది.రుణబంధన వ్యవస్థ, వెట్టిచాకిరి, శ్రమ దోపిడీ,బలవంతపు పెళ్లిళ్లు ఆధునిక బానిసత్వ రూపాలుగా కొనసాగుతున్నాయి. బానిసత్వ దురాచారానికి పేదరికం, కులం,సామాజిక అసమానతలతో విడదీయరాని సంబంధం ఉంటుంది. ఇటుక బట్టీలో మాడుతున్న బాల్యాలు, బాల్య వివాహ సంకెళ్లు, బాణాసంచా తయారీ కేంద్రాల్లో విష విస్ఫోటక పదార్థాలతో పిల్లలు నలిగిపోవడం లాంటివని డిజిటల్ యుగంలో కూడా కొనసాగుతున్నాయి. చట్టాలు ఎన్ని ఉన్న బానిసత్వ దురాచారం రెచ్చిపోతూనే ఉన్నది. బానిసత్వ దురాచారం నేర సమానం,ఆక్షేపణీయం. అభివృద్ధి భాషణాలు ఒకవైపు, ఆకలికేకలు మరోవైపు వినిపిస్తూనే ఉన్నాయి.బానిసత్వ దురాచారం జడలు విప్పుతూనే ఉన్నది. చట్టాలు కాగితాల్లో పదిలంగానే ఉన్నాయి. వంటింటిలో చిట్టి బానిస చేతులు బోళ్లు తోముతూనే,బట్టలు ఉతుకుతూనే ఉన్నాయి. బానిసత్వాన్ని బొందపెట్టని ప్రగతి నిరర్థకం.బానిసత్వాన్ని పోషిస్తున్న పౌరసమాజం మానవ విలువలను మంటగలుపుతున్నాయి. •

# చర్చించి పరిష్కరించడమే ప్రజాస్వామ్య సూత్రం



రావులపాటి సీతారాంరావు

ప్రజాస్వామ్యంలో చర్చలు అత్యం త ప్రాధాన్యతను సంతరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మేధావులే కాదు ఇంగితజ్ఞానం ఉన్న ప్రతి వ్యక్తీ నమ్ముతాడు. దురదృష్ట వశాత్తు ప్రస్తుతం డిబేట్లు అంటే చర్చలు అటు చట్టసభలలోనూ ఇటు టీవీల్లాంటి దృశ్యసాధనాల్లోనూ నిరర్థకంగా తయారవుతున్నాయి. అర్థవంతమైన పరిష్కారాలు ప్రతిపాదించి వీక్షకులకు రోజువారీ సమస్యలపైనా, ప్రభుత్వాలూ, ప్రతిపక్షాలూ వ్యవహరించే తీరుపైనా నిర్ణ యాల ప్రభావాలపైనా సమసగ్రమైన విషయాలు అందించడానికి బదులు, గొడవలూ కొండొకచో పోట్లాటలుగంపగుత్తుగా ఇచ్చే వ్యవస్థలుగా మారాయి. సోషల్ మీడియా సరేసరి! వాళ్ల సబ్జెక్టుకు పెట్టే హెడ్డింగ్ కూడా చూపించే కార్యక్రమానికీ పొంతనలేకపోగా, అసలు లింక్ అనేదే లేకపోవటం హాస్యాస్పదంగా మారుతున్నది. కామెడీ కోసమే ఇలాంటివి చూసే పరిస్థితులు క్రమేపీ హద్దులు దాటుతున్నాయి. డైలాగ్, డిబేట్, డిస్కషన్ అన్నీ చర్చల్లో పాల్గొనేవారి చేతుల్లో చావుదెబ్బలు తింటున్నాయి. వాయిలెంట్ సినిమాల కంటే ఛానెల్లు,గొప్పగొప్ప వ్యవస్థ ఛానెల్లు కూడా తలా తోకా లేని, అర్థంపర్థం లేని, అవసరం లేని, కార్యక్రమాలు ప్రసారం చేస్తూ (సరదాగా చెప్పుకోవాలంటే) వీక్షకులకు మానసిక వ్యథను కలిగిస్తున్నారు.చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిన స్థితిని ఎవరన్నా చెప్పినా, హాస్యోక్తిగా కొట్టి పారేయటం తగదు. ప్రభుత్వాలు తప్పకచర్యలు తీసుకోక తప్పదు. శ్రుతి మించిన రాగం,అపస్వరాల విజృంభణతో నానాయాగీ చేస్తున్న మాటనిజం! ఈ మధ్య ఎవరైనా హేతుబద్ధంగా చర్చల్లో పాల్గొనటానికి ప్రయత్నిస్తే హాహాకారాలు చేసే ఎదుటి డిబేటర్ పరిహాసపూర్వకంగా నవ్వటమే కాదు, కాసేపటికి బాల్లే ఆపు!పిచ్చిమాటలు కొనసాగిస్తే. తిట్ల దండకంప్రారంభిస్తాడు. బుద్ధిమంతుడు నివ్వెరపోయి, తలతిరిగి మరోమాటలేకుండా తలొంచుకొని డిబేట్ అయ్యేంతవరకూ నోరువిప్పడు.యాంకర్ కూడా అతన్ని మురికికూపంలోకి లాగేప్రయత్నంచేయడు, యాంకర్ అప్పటికే అందులో నిండా మునిగి ఉన్నాడు కనుక. ఆ వ్యకినతరువాత ఏ ఛానెల్‌లోనూ డిబేట్లలోనూ కనపడలేదు! బుద్ధిజీవులు హమ్మయ్య ఊ అని ఊపిరిపీల్చుకున్నారు!అతని నిష్క్రమణ అతనికే మేలు చేస్తుంది కాబట్టి! అవసరాన్ని మించిన హైరానా ఎందుకోసం ఈ డిబేటర్లకూ, డిస్కషన్ దారులకు అని సామాన్యుడు తలపోస్తాడు కానీ తలపండిన వారికే తెలియదు అందులోని మర్మం! తెలిసిన ఒక డిబేటర్‌ను అసలు రహస్యమేమిటో తెలుసుకుందామని అడిగినప్పుడు నిజం చెప్పమంటారా? అబద్ధం చెప్పమంటారా? అని పాత సినిమా పాతాళాభైరవిలో కథానాయకుడిలా అడిగాడు, అడిగినవాడు మాట్లాడలేదు. ఎందుకైనా అతగాడి విరుపులకు, మెరుపులకూ వింత వింత శబ్దాలకు భయపడి నిశ్శబ్దాన్ని ఆశ్రయించి మౌనవ్రతాన్ని సాగించాడు. మౌనవ్రతాన్ని గర్వంగా స్వీకరించిన డిబేటర్ గొంతు సవరించుకొని ఆయన డిబేట్‌లో ధరించే వీరావతార రహస్యాన్ని సెలవిచ్చాడు. అఫెన్స్ బెస్ట్ డిఫెన్స్ ఎదుటి వాడు నా ప్రతిపక్ష పార్టీ వాడు, మొదట్లోనే మాటల్లో ఫెడీల్ మని మనం చరవకపోతే మనల్ని మరుక్షణమే చానబాదుతాడు. పాత రోజుల్లో డిబేట్లు ఊరేసిన మగాయాల్లాంటివి. ఎప్పుడో గాని మాగి రుచికెక్కవు! ఇప్పటి డిబేట్లు గుంటూరు మిరపకాయల్లాంటివి. నాలుక కొరకగానే రాలిపడిపోవాలి.మాటరాకుండా ప్రత్యర్థి గుడ్లు తేలేయ్యాలి. ఘాటు డిబేట్ రహస్యం అదే. హైపిచ్‌లో సందేశాన్ని ఇచ్చాడు. సీరియస్‌గా విషయం విశ్లేషణకు వస్తే సమాజాన్ని రెండుగా చీల్చేందుకు అన్ని వ్యవస్థలూ పని చేస్తున్నాయా అన్న సందేహం కలగక మానదు. మార్పు సహజం అని మంచి చెడులు ఆలోచించే వ్యక్తులు ఇంతకు మునుపు అనుకొనేవారు కానీ ప్రస్తుతం మార్పు స్వార్థంతో కూడుకున్నదిగా కనిపిస్తున్నది. వ్యక్తి స్వార్థం తాను పనిచేసే పార్టీ స్వార్థం ( రాజకీయాల్లో ఉంటే) ఉద్యోగంలో ఉంటే ఆ వ్యవస్థ స్వార్థంగా ప్రస్తుత మార్పు సూత్రాన్ని అన్వయించుకోక తప్పదు. అందుకనే ఇవ్వాళ చర్చల్లో పాల్గొనేవారు ఒకే రకమైన కోపాన్ని అసహనాన్ని తాను వ్యతిరేకించే పార్టీ మీదనో, వ్యక్తి మీదనో ప్రదర్శించినా, తాను పార్టీ మారితే అదే రకమైన వ్యతిరేకతను, అసహనాన్ని అదే మోతాదులో తన పాతపార్టీపైన కూడా ప్రదర్శించే నేర్పు ఉండాలి అని అతనూ అనుకుంటాడు. అతన్నికొత్తగా చేరుకున్న పార్టీ అనుకుంటున్నది. సీసాలు మారినా, సీసాల రంగు మారినా పాత రసాన్ని నింపటమే చేయాల్సిన కర్తవ్యం. ప్రస్తుత సమాజంలో నీవు అటో ఇటో ఉండక తప్పటం లేదు. మరోవిధంగా ఆలోచించే వారికి మరోమార్గంలేక మౌనంగా ఉండక తప్పటం లేదు. న్యూట్రల్‌గా ఉంటూ న్యూటాలిటీని సమర్థించ ప్రయత్నించటం అసాధారణ చర్యగా, ధైర్యంతో కూడుకున్నపనిగా శ్లాఘించకతప్పదు. అలాంటి వారికి సహకారం,సహాయం, దాదాపు దుర్లభం. కులం, మతం, ప్రాంతం, పార్టీ, సమర్థించుకోవటంవిధిగాపెట్టుకున్న ఈనవ సమాజంలో మంచి చెడుల బేరీజుకు విలువలేనట్లు కనిపిస్తున్నది. విలువల కంటే చర్చల్లో విరుపులు మెరుపులకే విలువనిస్తున్నారు. వాదనలు సమాజాన్ని చీల్చటానికే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. చెన్నై హైకోర్టు జడ్జిగా పనిచేస్తున్న జస్టిస్ ఆనంద్ వేంకటేష్ ఒక పేపర్‌లో సమాజంలో పడిపోతున్న గౌరవాన్ని ఓపెన్ డైలాగ్‌ను తిరిగి తెచ్చుకొనే విధంగా ప్రయత్నాలు చేయాలని రాయటం, అదీ ఉద్యోగంలో ఉంటే ఆ విలువైనమాటలు చెప్పటం చాలాసంతోషంతో పాటు, బాధ్యతను గుర్తుకు తెచ్చింది. వారే జె గార్ ఫీల్డ్ అనే ఫిలాసఫర్ హెచ్చరికను కూడా ఆవ్యాసంలో ప్రస్తావించారు. ఈ విధంగా సమాజం రెండుగా చీల్చటం మంచిది కాదని, అట్లాంటి చీలిక అన్నివైపులా ఆలోచనను పెంపొందించే ప్రక్రియను పూర్తిగా నాశనం చేసి, ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తుందని ఆహెచ్చరికను ఉటంకించారు. అలాంటి అరమరికల్లేని, వినయంతో కూడిన మాటలతో ప్రత్యర్థులను సమానస్థాయిలో తోటిమానవులుగా శత్రువులుగా కాకుండా చర్చల ద్వారా సంభాషణల ద్వారా సంబంధం ఏర్పరుచుకోగలుగుతే ఆ చీలికను పోగొట్టి సమాజాన్ని ఒకటిగా చేయొచ్చు అని జేగార్ ఫీల్డ్ అభిప్రాయపడ్డారు. వాదనల ద్వారా, ఆవేశకావేషాల ద్వారా సమాజానికి మేలు జరగదు.ప్రజాస్వామ్యంలో చర్చలూ, వాదనలు అవసరమే కానీ ఆవాదనలూ, ఆవేశాలూ,సమాజాన్ని నిలువునా చీల్చడానికి కానేకాదు. ఆ ఎరుక ప్రతివారికీ ముఖ్యంగా ప్రజాప్రతినిధులకూ,రాజకీయ నాయకులకూ ఉండకతప్పదు. 'నేను గౌరవ ప్రదంగా నా అంగీకారాన్ని తెల్పుతున్నాను' నేను నీతో విబేధించినా,నీ అభిప్రాయాన్ని గౌరవిస్తాను అన్న ఏకైక సిద్ధాంతం మీద ప్రజాస్వామ్యం ఆధారపడి ఉంది. ప్రజాస్వామ్య మనుగడనే దెబ్బతీసే వాదనలూ,చర్యలూ ఎందుకు? వ్యక్తి, వ్యవస్థల, పార్టీల స్వార్థానికా? కానేకాదు.ప్రజాప్రయోజనానికి అందరి అభిప్రాయాలవసరం.అభిప్రాయాలు వ్యక్తపర్చటానికే చర్చలూ!వాదనలూఅవసరం.బంధాలు తెంపుకోటానికి కాదు. •

# పేదలకు కొండంత ధైర్యం ఇస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్: మేయర్, కమిషనర్





**గుంటూరు కార్పొరేషన్, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** పేద ప్రజలైన ఎంతోమందికి ప్రభుత్వం ప్రతినెల ఒకటో తేదీన అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కొండంత ధైర్యాన్ని అందిస్తుందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 1వ తేదీన లబ్ధిదారులైన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ గుంటూరు నగరంలోని సచివాలయాల వారీగా పంపిణీ జరుగుతున్న తీరును మేయర్, కమిషనర్లు లబ్ధిదారులకు వీరి చేతులు మీదగా పెన్షన్ సొమ్మును అందించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందించాలని, ఒకవేళ వారు ఇక్కడ లేకపోతే ఏమైనా అనారోగ్యాలతో ఆసుపత్రి ఉన్న అక్కడ పంపిణీ చేసేలా దృష్టిసారించాలని సూచించారు.

# ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు పునరావృతం కాకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి : నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు కార్పొరేషన్, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** నగరంలో ఎదుర్కొంటున్న ప్రధానమపి జి ఆర్ ఎస్ కుఫిర్యాదులు పునరావృతం కాకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించార. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా వివిధ సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. తొలుత డైలీ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించి ల్యాండ్ లైన్ ఫోన్ లో ప్రజలు చేసిన ఫిర్యాదులు పరిష్కరించాలని సంబంధిత విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 21 ఫిర్యాదులు వచ్చాయని వాటిని క్షుణ్ణంగా పరిశీలించి తక్షేమం చేయగలిగేవి చేయాలని, అంత గడువు తో చేయగలిగేవి ప్రత్యేక జాబితా తయారు చేసి ఆ రెండు నివేదికను సమర్పించాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ హాల్ లో నిర్వహించిన పి జి ఆర్ ఎస్ కు 21 మంది అర్జీలు




సమర్పిస్తూ ఫిర్యాదులు చేశారని తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి అక్కడకు వెళ్లి సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్పొరేషన్ లోని ప్రతి విభాగంలో పిజిఆర్ఎస్ అర్జీలు పరిష్కారం కోసం ప్రత్యేక విభాగాన్ని నియమించడం జరిగిందని తెలిపారు. ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్ శ్రీనివాస్, బి శ్రీనివాసరావు, డిప్యూటీ సిటీ ప్లానర్ సూరజ్ కుమార్, ఇన్చార్జి ఎస్ ఈ సుందర్ రామిరెడ్డి, సీఎం ఓహెచ్ డాక్టర్ శాంతి కళ, మేనేజర్ బాలాజీ భాషా తదితరులు పాల్గొన్నారు మేనేజర్ బాలాజీ భాషా తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పారిశుధ్య పనులు పిన్ పాయింట్ ప్రకారం జరగాలి గుంటూరు నగరంలో పారిశుద్ధ్య పనులు పిన్ పాయింట్ ప్రోగ్రాం ప్రకారం జరగాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా సోమవారం పాత గుంటూరు, మాచిరాజు వారి వీధి,కొండా వారి వీధి తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులు తనిఖీ చేశారు. నగరంలో చేపట్టే పారిశుధ్య పనుల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. నగరంలో ఎక్కడ చెత్తకుప్పలు కనబడిన అధికారులు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో పాదేశించే పనులు మెరుగ్గా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల తీరును పరిశీలించేందుకు ఆకస్మిక తనిఖీలు నెరవేస్తామని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో అన్ని విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# ఎలాన్ మస్క్‌ను ఆదర్శంగా తీసుకోండి
## - ఇంజనీరింగ్ విద్యార్థులకు వీసీ సూచన

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, డిసెంబరు1, ప్రభాతవార్త: టెస్లా సిఇఓ ఎలాన్ మస్క్, మైక్రోసాఫ్ట్ సిఇఓ సత్య నాదెండ్ల లను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించే ప్రణాళికలు వేసుకోవాలని ఏఎన్‌యు ఇన్‌చార్జ్ వీసి ఆచార్య కె.గంగాధరరావు సూచించారు. ప్రస్తుతం ఇంజనీరింగ్ విద్యార్థుల మధ్య పోటీ అధికంగా ఉందని పోటీని



అధిగమించాలంటే నిరంతర సాధన అవసరమని పేర్కొన్నారు. ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య రామినేని శివరాం ప్రసాద్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు ఉద్యోగాలు పొందాలంటే సమయాన్ని వృధా చేసుకోవద్దని సూచించారు. రీజనింగ్‌పై పట్టు సాధించి సాఫ్‌స్కిల్స్‌ను పెంచుకోవాలని అన్నారు. ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు 10రోజుల క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ (సిఆర్‌టి) ముగిసింది. ముగింపు కార్యక్రమానికి వీసి, రెక్టార్‌లు అతిధులుగా పాల్గొని విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.హెచ్.లింగరాజు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై శిక్షణా తరగతులు నిరంతరం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రీమ్‌ప్యాంట్ ట్రైనింగ్ సొల్యూషన్స్ సిఇఓ జలపాటి శ్రీధర్, ఇంగ్లీష్ ట్రైనర్ గోపీ,ఆప్టిట్యూట్ ట్రైనర్ హరిశంకర్, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్, ప్రోగ్రాం మేనేజర్ సాయికిరణ్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా.తౌసిఫ్ అహ్మద్, అ సిస్టెంట్ ప్రిన్సిపాల్స్ డా.గోపీకృష్ణ, డా.చంద్రమౌళి, గెస్ట్ ఫ్యాకల్టీ పృద్వీరాజ్, సాంకేతిక నిపుణులు బి.అజయ్, కె.కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

# యంగ్‌లీడర్ డైలాగ్‌కు అనూహ్య స్పందన

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, డిసెంబరు1, ప్రభాతవార్త: వికసిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్-2026కు యువత నుంచి అనూహ్య స్పందన లభించిందని ఏపి ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి అన్నారు.ఏపిఎస్‌సిహెచ్‌ఇఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ వ్యాసరచన పోటీల రెండో దశ మూల్యాంఖనం ఏఎన్‌యులో జరుగుతుంది. సోమవారం ఈ కేంద్రాన్ని పరిశీలించిన మధుమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు యూనివర్సిటీలు, విభాగాలకు చెందిన 40మంది ప్రొఫెసర్‌లు పాల్గొన్నారు. ప్రతీ ప్రొఫెసర్ సగటున 100 వ్యాసాలు మూల్యాంకనం చేయగా, మొత్తం 3659 వ్యాసాలు పరిశీలించినట్లు వివరించారు.




యువత అభివృద్ధి, ప్రజాస్వామ్యం, మహిళా నేతృత్వం, స్టార్టప్ భారత్, ఫిట్ భారత్, సస్టైనబుల్ వ్యవసాయం, గ్రీన్ వికసిత్ భారత్, భారత్ సాఫ్ట్ పవర్, ఆవిష్కరణలు- సంప్రదాయం, భవిష్యత్ వర్క్‌ఫోర్స్ వంటి అంశాలపై వ్యాసాలు వచ్చాయన్నారు. ఈ మూల్యాంకనం ఆచార్య జి.రోశయ్య, డాక్టర్ శ్రీరంగం మాధ్యూ పర్యవేక్షణలో జరుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా ఏపి యువజన సర్వీసుల శాఖ మేనేజర్ పి.వి.ఎన్.మల్లేశ్వరరావు తగు సూచనలు చేశారు.

**బ్రోచర్ ఆవిష్కరణ::** ఏఎన్‌యు కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో వచ్చేనెల 7,8 తేదీలలో యూజిసి జాతీయ సదస్సు బ్రోచర్‌ను ఇన్‌చార్జ్ వీసి ఆచార్య కె.గంగాధరరావు సోమవారం ఆవిష్కరించారు. ఆచార్య నాగార్జున ఆల్కెమికల్ వారసత్వం- సాంప్రదాయక, ఆధునిక దృక్పదాలు-2026 అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సదస్సుకు ఆచార్య రామచంద్రన్ కన్వీనర్‌గా ఉంటారని తెలిపారు. ఈ సందర్భంలో ఉన్నతవిద్యామండలి ప్రతినిధి ఆచార్య జి.రోశయ్య, ఇన్‌చార్జ్ ఏఎన్‌యు రెక్టార్ ఆచార్య ఆర్.శివరాంప్రసాద్, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభ గోడ పత్రిక ఆవిష్కరణ

గుంటూరు విద్య డిసెంబర్ 1 ప్రభాతవార్త: డిసెంబర్ 10 మానవ హక్కుల దినోత్సవం రోజున సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ పునర్ధన చేయాలని కోరుతూ గుంటూరు జిల్లా కలెక్టరేట్ ఎదుట జరుగు సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయుల ఆత్మగౌరవసభకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు గుంటూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె. నరసింహ రావు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ అయినటువంటి సిపిఎస్ ను రద్దు చేసి ఓ పి ఎస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.




ఈ కార్యక్రమంలో సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా సిపిఎస్ నాయకులు కె. మున్నీ నాయక్, స్థానిక గాంధీనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అప్పర్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయినులు నాగలక్ష్మి, శివకుమారి, స్వాతి, జాస్మిన్, వెన్నెల, లక్ష్మి పాల్గొని గోడపత్రికను ఆవిష్కరించారు.

# గుంటూరు వార్త



# 6 నుంచి ఏఎన్‌యు యువజనోత్సవాలు



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, డిసెంబరు1, ప్రభాతవార్త: ఏఎన్‌యు అంతర కళాశాలల యువజనోత్సవాలు ఈనెల 6,7,8 తేదీలలో జరుగనున్నాయి. ఈ మేరకు 2025-2026 కోఆర్డినేటర్ ఆచార్య ఎస్.మురళీమోహన్ అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్, కల్చరల్ కోఆర్డినేటర్‌లకు యువజనోత్సవాల వివరాలను, నిబంధనలను పంపారు. ఆయా కళాశాలల నుంచి యువజనోత్సవాల్లో పాల్గొనే విద్యార్థి కళాకారులను పంపాలని సూచించారు. ఆర్ట్స్ కళాశాలకు సంబందించి 3,4 తేదీల్లో మ్యూజిక్, ఫైన్ ఆర్ట్స్, థియేటర్, డాన్స్, లిటరరీ ఈవెంట్స్ పోటలు నిర్వహించి జట్టును ఎంపిక చేయనున్నట్లు ప్రిన్సిపాల్ ఆచార్య యం.సురేష్‌కుమార్ తెలిపారు. ఆర్ట్స్ కళాశాలకోఆర్డినేటర్‌గా ఆచార్య మాధవి వ్యవహరిస్తారని పేర్కొన్నారు. పోటీల వివరాలకు డాక్టర్ యం.వసంతరావు (ఎడ్యుకేషన్-9848519890), డాక్టర్ షేక్ రమీ బేగం (హిస్టరీ అండ్ ఆర్కియాలజీ- 9642693929)లను సంప్రదించాలని సూచించారు.

**విభాగాలను తనిఖీ చేసిన ప్రిన్సిపాల్:** ఏఎన్‌యులోని ఆర్ట్స్ కళాశాలలో పలు విభాగాలను సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య యం.సురేష్‌కుమార్ ఆకస్మిక తనిఖీలు చేశారు. తరగతుల నిర్వహణ, టైం టేబుల్ అమలు అధ్యాపకుల హాజరు వంటి విషయాలను పరిశీలించారు.

# ప్రజల కంట్లో గుంటూరు కల్తీ కారం!

**-మిరపకాయలు లేకుండానే కారం తయారు చేస్తున్న కేటుగాళ్లు.!? - ప్రజల కళ్ళల్లో కారం కొడుతున్న మిర్చి కారం ఏజెంట్లు.. మిల్లుల యజమానులు!**

**-పసిపిల్లలు.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం! -రూ.వందల నుంచి వేలల్లో కొనుగోళ్లు... -మొద్దు నిద్రలో అధికార యంత్రాంగం !**

**గుంటూరు మిర్చి యార్డును అడ్డాగా చేసుకొని చుట్టుపక్కల కొంతమంది మిల్లుల యజమానులు.. ఏజెంట్లు కేంద్రాలను ఏర్పాటు చేసి కల్తీ కారంను అడ్డగోలుగా సరఫరా చేస్తున్నారు... గుంటూరు మిర్చి మార్కెట్ ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్ గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది... ఇంత పెద్ద స్థాయిలో గుర్తింపు పొందిన గుంటూరు మార్కెట్ యార్డు చుట్టుపక్కల కొన్నిఎల్లులను ఏర్పాటు చేసి నాణ్యమైన కారం అంటూ ప్రజలు గుర్తించలేని విధంగా కొంతమంది కారం విక్రయ ఏజెంట్లు..మిల్లుల యజమానులు కలిసి కల్తీ కారాన్ని తయారుచేసి వారి కళ్ళల్లో కొడుతున్నారు.**

వాస్తవానికి మంచి నాణ్యమైన మిరపకాయలను కొనుగోలు చేసి కారం తయారు చేసుకునేందుకు ప్రతి ఇంట్లో గృహిణిలు ఇష్టపడతారు. కూరలు రుచిగా ఉండాలంటే అటువంటి కారంనే కొనుగోలు చేసేందుకు కూడా ఎక్కువ ఆసక్తి చూపుతారు. అయితే గుంటూరు కేంద్రంగా ఇక్కడ తయారుచేస్తున్న కల్తీ కారంలో అసలు మిరపకాయలే లేకుండా తయారు చేస్తున్నారంటే ప్రతి ఒక్కరూ ఆశ్చర్యానికి గురికాక తప్పని పరిస్థితి దాపురించింది. మిరపకాయలే లేకుండా కారమా...? అది ఎలా సాధ్యం అంటూ



సందేహ పడుతున్నారా.? ఇక్కడ జరిగే తంతు తెలిస్తే బయట షాపులలో, వ్యాపార సముదాయాలలో అమ్మే కారం కొనాలంటే భయంతో వణికి పోవాల్సిన పరిస్థితి ఎదురవుతుంది.

మిరపకాయల నుంచి తీసి పడేసిన కేవలం తొడిమెలతో కారం తయారు చేయడం ఒక పద్ధతైతే.. గర్భాలు పోయిన కాయలను.. ఫంగస్ వచ్చి చెడిపోయిన కాయలతో...



పూర్తిగా పాడైపోయిన తాలుకాయలు సేకరించి కల్తీ కారం తయారు చేసి మార్కెటింగ్ చేయటంలో సిద్ధహస్తులుగా మారారు. ఇలా తయారుచేసిన పొడిలో పామాయిల్ ని మిక్స్ చేసి... రంగులు కలిపి నాణ్యమైన కారంగా తక్కువ ధరకే అమ్ముతున్నాం అంటూ మార్కెటింగ్ వ్యాపారం చేసే కల్తీ కేటుగాళ్లు కోట్ల సంపాదనకు పడగలెత్తారు.

.....వివరాలు మెయిన్‌లో

# అంతరరాష్ట్ర దొంగలు అరెస్టు

**గుంటూరు క్రైమ్, డిసెంబర్ 1, ప్రభాతవార్త:** ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్న ఇరువురు అంతర్ రాష్ట్ర దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు.వారి వద్ద నుండి 26 లక్షల యాభై వేలు విలువైన 227 గ్రాముల బంగారు, 182 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం గత నెల 8వ తేదీన లాలాపేట



పోలీసుస్టేషన్ పరిధిలోని సంపత్ నగర్ మెయిన్ రోడ్డులో నివాసం ఉంటున్న అవ్వారు వెంకటప్పయ్య శాస్త్రి ఇంటికి తాళాలు వేసి తిరుపతి కి వెళ్ళాడు.తిరిగి12వ తేదీన ఇంటికి చేరుకున్నాడు.మెయిన్ రోడ్డు వైపు ఉన్న తాళాలు పగలగొట్టి,తలుపులు తెరిచి ఉండడంతో లోపలికి వెళ్లి చూసాడు.బీరువా తెరవబడి ఉండి అందులో వెండి,బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు గమనించాడు.వెంటనే లాలాపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.కేసు నమోదు చేస్తున్న లాలాపేట పోలీసులు సి.సి.యస్ పోలీసుల సహకారంతో ఎస్పీ ఆదేశాల మేరకు దర్యాప్తు కొనసాగించారు.సి.సి.యస్ డిఎస్పీ మధుసూదన్ ఈస్టు డిఎస్పీ అబ్దుల్ అజీజ్ లాలాపేట సిఐ శివప్రసాద్, సీసీఎస్ ఎస్.ఐ రాములు,పోలీసు సిబ్బంది



అతిచకచక్యం తో నిందితులైన గోరంట్ల తూర్పు బజారుకు చెందిన చిల్లర సురేష్,విజయవాడ రామలింగేశ్వర నగర్ కు చెందిన కాజా నాగవీర భాస్కరావు లను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా వారు నేరం అంగీకరించారు. వీరు పాత నేరస్తులు కావడంతో సులువుగా నేరాలు చేయుటలో సిద్ధస్తులు అయ్యారని ఎస్పీ వెల్లడించారు. చిల్లర సురేష్ పై గుంటూరు పట్టణంలోని పట్టాభిపురం, ఆరెండల్ పేట,కొత్తపేట, లాలాపేట, పాతగుంటూరు, నల్లపాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికీ78కి పైగా ఇంటి దొంగతనాల కేసులు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. ఇతను పై సస్పెక్ట్ షీట్ నెంబర్809 గా నమోదైంది. గుంటూరు జిల్లా పోలీసు వారు గురించిన టాప్ టెన్ దొంగల జాబితాలో చిల్లర సురేష్ మొదటి వాడు అని ఎస్పీ పేర్కొన్నారు. రెండో ముద్దాయి నాగవీర భాస్కర్ రావు తెలంగాణ రాష్ట్రం లోని హుజూర్ నగర్ జైలు నుండి గంజాయి కేసులో అరెస్టు అయ్యాడు.జైలులో ఉన్న సమయంలో సురేష్ తో పరిచయం ఏర్పడి ఇరువురు బయటకు వచ్చిన అనంతరం కలిసి విజయనగరం జిల్లాలో ఇంటి దొంగతనాలు చేయగా విజయనగరం పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు.బెయిల్ పై వచ్చిన తర్వాత మరల ఇంటి దొంగతనాలు చేస్తూ దొంగిలించిన ఆభరణ సొత్తును పంచుకొంటూ జల్సాలు చేస్తుంటారు. దొంగలు వద్ద నుండి దొంగిలించిన సొత్తును కొనుగోలు చేసిన గుంటూరు శివనాగరాజు కాలనీకి చెందిన లంకా రాజేష్ ని కూడా అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలియజేశారు.

# పోలీసు జాగిలం రెమో మృతి

**గుంటూరు క్రైమ్, డిసెంబర్ 1, ప్రభాతవార్త:** వయోభారంతో పోలీసు జాగిలం రెమో మృతి చెందడంతో గుంటూరు జిల్లా పోలీసులు పోలీసు గౌరవ లంచాలతో అంతిమ నివాళులు అర్పించారు.





జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు జిల్లా ఆదనపు ఆర్మ్ రిజర్వ్ ఏ.ఎస్.పి హనుమంతరావు ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ లు, ఆర్.ఎస్.ఐ లు ఇతర పోలీసు పాల్గొన్నారు.

# క్విజ్‌లో వేములూరిపాడు విద్యార్థుల ప్రతిభ

గుంటూరు విద్య , డిసెంబర్ 1 ప్రభాతవార్త: విద్యార్థి విజ్ఞాన మందన్ రాష్ట్రస్థాయి ప్రతిభ అన్వేషణ పరీక్షకు జిల్లా పరిషత్ వేములూరిపాడు హైస్కూల్ కు చెందిన ఆరవ తరగతి విద్యార్థులు ఉప్పు మోనాలిక,వేముల ఐశ్వర్య మరియు ఏడో తరగతికి చెందిన బీమనాధుని లోహిత, షేక్ అన్వర్, ఓబుల శెట్టి యవన వెంకటేశ్వరరావు మొత్తం ఐదుగురు విద్యార్థులు ఎంపిక య్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య తెలిపారు. వీరికి గైడ్ టీచరుగా ఆ పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు



వి ఎస్ రామాంజనేయులు వ్యవహరించారు. ఈ సందర్భంగా పాఠశాల జరిగిన కార్యక్రమంలో విజయం సాధించిన విద్యార్థుల్ని గైడ్ టీచర్ ని ప్రధాన ఉపాధ్యాయులు సాంబయ్య, వేలాగిని రాజు, తోటి ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

# వాహనాల దొంగతనాలు, దారిదోపిడీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

**గుంటూరు క్రైమ్, డిసెంబర్ 1, ప్రభాతవార్త:** దారిదోపిడికి పాల్పడుతూ ద్విచక్రవాహనాలు దొంగలిస్తున్న వ్యక్తిని నల్లపాడు పోలీసులు అదుపులోకి అరెస్ట్ చేశారు. ఎస్పీ ఆదేశాలు మేరకు సౌత్ డిఎస్పీ బానోదయా ఆధ్వర్యంలో నల్లపాడు సి.ఐ వంశిధర్, ఎస్.ఐ మహేష్ కుమార్,సిబ్బంది గట్టి నిఘాను ఏర్పాటు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు నిందుతుడైన గుంటూరు వికాస్ నగర్2వ లైన్ కు చెందిన ఉప్పుతల శ్రీకాంత్ గతంలో ద్విచక్ర వాహనాలు, సెల్ ఫోన్లు, దారి దోపిడీ వంటివి చేసి అరెస్ట్ అయ్యి కోర్టు



వాయిదా లకు తిరుగుతూ ఉన్నాడు. బెయిల్ పై వచ్చిన తర్వాత మళ్ళీ దొంగతనాలకు పాల్పడుతూనే ఉన్నాడు. ఐజాక్ అనే స్నేహితుడితో కలసి కొన్ని దొంగతనాలు చేసినట్లు విచారణ లో తేలింది.నిందితుల వద్ద నుండి3 ద్విచక్ర వాహనాలు,ఆటో,ఒక సెల్ ఫోన్ ను రికవరీ చేసినట్లు సిఐ వంశిధర్ తెలిపారు.

# ఎన్ఐఆర్ఎఫ్‌పై వర్క్‌షాపు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, డిసెంబరు1, ప్రభాతవార్త: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, కళాశాలలు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల సాధనపై దృష్టిసారించాలని యాప్సీ చైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి సూచించారు. ఏపి ఉన్నత విద్యామండలి (ఏపిఎస్‌సిహెచ్‌ఇ), ఏఎన్‌యు లో సంయుక్తంగా డ్రైవింగ్ ఎక్స్‌లెన్స్ ఇనిస్టిట్యూషనల్ స్ట్రాటజీస్ అనే అంశంపై సోమవారం ఎన్ఐఆర్ఎఫ్ కోఆర్డినేటర్‌లకు ఒకరోజు రాష్ట్రస్థాయి వర్క్‌షాపు



నిర్వహించారు. ఈ వర్క్‌షాపు ప్రారంభ కార్యక్రమానికి ఆచార్య మధుమూర్తి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్య నాణ్యత, పరిశోధన సామర్థ్యాల పెంపు, విద్యార్థుల ఫలితాలు మెరుగుదల, పరిశ్రమ- కళాశాలల అనుసంధానం, ఉత్తమ ఆచారాల అమలు, డేటా ఆధారిత పరిపాలన వంటి అంశాలు 2026 ఎన్ఐఆర్ఎఫ్‌లో ఉన్నత ర్యాంకుల సాధనకు కీలకమని పేర్కొన్నారు. ఈ వర్క్‌షాపులో రీసోర్స్ పర్సన్స్‌గా మద్రాస్ ఐఐటి నుంచి డా. జి. రమేష్ లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎస్‌సిహెచ్‌ఇ వైస్- చైర్మన్ ఆచార్య ఎస్.విజయభాస్కరరావు, అకడమిక్ ఆఫీసర్ శ్రీరంగం మాథ్యూ, సిసిఈ-ఏపి ఓఎస్‌డి డా. కె.విజయబాబు, ఏఎన్‌యు ఇన్‌చార్జ్ వీసి ఆచార్య గంగాధరరావు, అధ్యాపకులు డాక్టర్ పి.సుధాకర్, డా.కృష్ణసత్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాల పెంపునకు సామాజిక కార్యక్రమం

గుంటూరు విద్య, డిసెంబర్ 1 ప్రభాతవార్త: జీవవిజ్ఞాన రంగాల్లో (వ్యవసాయం మరియు ఆరోగ్య సంరక్షణ) విశ్వవ్యాప్తమైన గుర్తింపు కలిగిన సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాలు పెంపుకు బేయర్ సంస్థ తన నూతన సామాజిక కార్యక్రమం"నాటివో - మేక్ దెమ్ షైన్" ప్రారంభించింది. భారతదేశంలోని రైతు కుటుంబాల్లోని పిల్లలకు అభ్యాసన మార్గాలను అందించాలనే ధ్యేయంతో ఈ సామాజిక ప్రభావ కార్యక్రమం రూపుదిద్దుకుంది. ప్రతి పిల్లవాడు ఎక్కడ జన్మించినా, తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకోగలిగే అవకాశం పొందాలి అనే విశ్వాసం మీద ఈ కార్యక్రమం ఆధారపడి ఉంది. భారత గ్రామీణ యువత ప్రతిభావంతులుగా, నేర్చుకోవడానికి ఆసక్తిగలవారుగా ఉన్నప్పటికీ, విస్తృతమైన నేర్చుకునే అవకాశాల లోపం ఉంది."మేక్ దెమ్ షైన్" ఈ లోటును పూడ్చుతూ విద్య, సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన మరియు నాయకత్వాన్ని పెంచే అనుభవ అవకాశాలను కల్పిస్తుంది తద్వారా యువత పెద్ద కలలు కనడానికి, దృఢంగా ఎదగడానికి ప్రేరణ పొందుతుంది.

# ఘనంగా అయ్యప్ప స్వాముల సద్ది

గుంటూరు విద్య, డిసెంబర్ 1, ప్రభాతవార్త: గుంటూరు ఆర్టీసీ కాలనీలోని వై ఆర్ కె రెసిడెన్సి ఆర్టీసీ కాలనీ మెయిన్ రోడ్డు ఒకటో లైన్ వాటర్ ప్లాంట్ ఎదుట గత 11 రోజుల నుంచి అయ్యప్ప స్వాముల సద్ది కార్యక్రమం ఘనంగా జరిగింది. నవంబర్ 21వ తేదీ నుండి డిసెంబర్ 1 తేదీ వరకు ఆయా తేదీల్లో మధ్యాహ్నం 12:30 నుండి 2 గంటల వరకు అయ్యప్ప స్వాముల సద్ది కార్యక్రమం ఘనంగా జరిగింది. అయ్యప్పలు ,భవానీలు, శివ స్వాములు, ఇతర స్వాములు పెద్ద సంఖ్యలో ఈ సద్ది కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు ఎర్రం రామకృష్ణారెడ్డి బ్రదర్స్ వారి ఆధ్వర్యంలో జరిగిన అయ్యప్ప స్వాముల సద్ది కార్యక్రమం సోమవారం మధ్యాహ్నంతో ముగిసింది.

వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, SHAIK HALIMUNNISA D/O Abdul Rawoof, R/o 5-69-48, 1st Floor, 6/19 Lane, Brodipeta, Guntur, AP-522002, have changed my name from HALIMUNNISA to SHAIK HALIMUNNISA For all future purposes.
(Ro.No.32504)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

పల్నాడు జిల్లా వార్త



# కంటి చూపు లేకుంటే అన్నీ సమస్యలే : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, డిసెంబర్ 1, ప్రభాతవార్త: వృద్ధుల్ని తమ బిడ్డలు, కుటుంబసభ్యులు ప్రేమ, గౌరవంతో చూస్తారనే ప్రభుత్వం వారికి రంధన్ గా ఒకటో తేదీన పింఛన్లు అందిస్తోందని, వయసు పైబడినవారు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ, దూరం వెళ్లి వైద్యసేవలు పొందలేరనే ప్రత్తిపాటి ఫౌండేషన్ పలు రకాల వైద్య శిబిరాలు ఉచితంగా నిర్వహిస్తోందని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పట్టణంలోని 28వ వార్డులో ప్రత్తిపాటి ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సంయుక్త సహకారంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రత్తిపాటి సోమవారం ప్రారంభించి మాట్లాడారు . వినికిడి సంబంధిత సమస్యలున్నవారికి 7న ఉచిత వైద్య శిబిరం కంటి చూపు సరిగా లేకుంటే ఎన్నో అవస్థలు పడాలని, ఒకరిపై ఆధారపడే వయసులో ఉన్న వృద్ధులు మరిన్ని సమస్యలు ఎదుర్కొంటారని ప్రత్తిపాటి చెప్పారు. పేదలకు ఉచిత వైద్యసేవలు అందించే సంస్థలకు ప్రభుత్వ సహాయ సహకారాలు ఉంటాయన్న ప్రత్తిపాటి.. శంకర కంటి ఆసుపత్రి వారు పేదలకు అందించే వైద్యసేవల్లో కూటమిప్రభుత్వ సహకారం కూడా ఉందన్నారు. ప్రత్తిపాటి





ఫౌండేషన్ ఏర్పాటు చేసిన 38వ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కంటిసంబంధిత సమస్యలతో బాధపడేవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నియోజకవర్గ ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రత్తిపాటి ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుం దన్నారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ సేవా కార్యక్రమాలపై టీడీపీ శ్రేణులు ప్రజలక విస్తృత అవగాహన కల్పించా లని, వార్డు, బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జ్ లు ప్రజల అనారోగ్య సమస్యల్ని గుర్తించి, ఫౌండేషన్ వైద్య శిబిరాలకు వారిని చేర్చాలన్నారు. 7వ తేదీన వినికిడి (చెవిటి, మూగ) సంబంధిత సమస్యలున్న వారికి ప్రత్తిపాటి గార్డెన్స్ లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ప్రత్తిపాటి చెప్పారు. వైద్య పరీక్షలు చేసిన తర్వాత సమస్య ఉన్నవారికి ఉచితంగా వినికిడి మిషన్లు కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, షేక్ మస్తాన్ వలి, శంకర్ కంటి ఆసుపత్రి డాక్టర్ శ్రీనివాసరావు, ఫౌండేషన్ నిర్వాహకులు కంచర్ల శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ల రూపంలో రూ.55వేల కోట్లు అందించి చంద్రబాబు చరిత్ర సృష్టించారు : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, డిసెంబర్ 1, ప్రభాతవార్త: సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా రూ.55 వేలకోట్ల సాయం పేదలకు అందించడం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు రికార్డు సృష్టించాడని, పేదల పక్షపాత ప్రభుత్వం పనితీరు ఎలా ఉంటుందో దేశానికి చూపించాడని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పేదల సేవలో భాగంగా సోమవారం ఆయన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. పట్టణంలోని 30, 31 వార్డులతో పాటు చిలకలూరిపేట



మండలం రాజాపేట, నాదెండ్ల మండలం మల్లయ్యపాలెం, యడ్లపాడు మండలం కారుచోల గ్రామాల్లో పర్యటించిన ప్రత్తిపాటి.. తొలుత అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. రాజాపేట గ్రామంలో రూ.9.80 లక్షలతో నిర్మించనున్న ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణపనులకు, కారుచోల గ్రామంలో రూ.6 లక్షలతో చేపట్టిన ప్రాథమిక పాఠశాల భవనం మరమ్మతుల పనులకు శంకుస్థాపన చేశారు. తరువాత పేదల ఇళ్లకు వెళ్లిన ప్రత్తిపాటి.. లబ్ధిదారులకు పింఛన్లు అందించి ప్రభుత్వ పథకాలపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం పలుచోట్ల ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. తొలుత పింఛన్ల అందించిన అనంతరం పట్టణంలో మీడియాతో మాట్లాడారు.మేనిఫెస్టో అమల్లో చంద్రబాబు కూటమిప్రభుత్వాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారు పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ లు పట్టువదలని విక్రమార్కుల్లా పనిచేస్తున్నారని, విశాఖ సీఐఐ సమ్మిట్ ద్వారా ఆకర్షించిన రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులతో కలిగే ప్రయోజనాల్ని ప్రజలకు అందించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు. ప్రతి ఇంటికి పెద్దకొడుకుగా అండగా ఉంటానన్న హామీని చంద్రబాబు నిలబెట్టుకున్నారని, మేనిఫెస్టో హామీల అమల్లో కూటమిప్రభుత్వాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారని ఈ సందర్భంగా ప్రత్తిపాటి తెలిపారు.. రాష్ట్రంలో 1.40 కోట్ల కుటుంబాలుంటే 67 లక్షల కుటుంబాలకు చంద్రబాబు పింఛన్లు అందిస్తున్నారన్నారు. సోమవారం ఒక్కరోజే నియోజకవర్గ వ్యాప్తంగా రూ.15.82,27, 000 (రూ.16కోట్లు) పింఛన్ల రూపంలో పేదలకు అందచేశామన్నారు. జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, టీడీపీ జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, టీడీపీ నాయకులు కందిమల్ల రఘురామారావు , మద్దినేని సుబ్బారావు, మద్దిబోయిన శివ, షేక్ మస్తాన్ వలి, ముల్లా కరీముల్లా, గంజి శ్రీనివాసరావు, పోపురి వెంకయ్య, మద్దూరి శ్రీనివాస రెడ్డి, వార్డు, గ్రామ నాయకులు, కూటమి నాయకులు, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, ఎంపీడీవోలు, ఎమ్మార్వో లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## చెల్లి ప్రకాశం మృతికి నివాళి

నాదెండ్ల, డిసెంబర్ 1, ప్రభాతవార్త: చిలకలూరిపేట నియోజకవర్గం, నాదెండ్ల మండలం, మల్లాయపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు చెల్లి ప్రకాశం ఇటీవల మరణించడం జరిగింది. సోమవారం ఆయన ఇంటికి వెళ్లి పూలమాలలు వేసి, నివాళులర్పించి, వారి కుటుంబసభ్యులను పరామర్శించిన నియోజకవర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తదితరులు

## ఎంజి స్కూల్ విద్యార్థులచే ఎయిడ్స్ అవగాహన ర్యాలీ



చిలకలూరిపేట, డిసెంబర్ 1, ప్రభాతవార్త: డిసెంబర్ 1 వ తేది,వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా ఎ.యం. జి.విద్యార్థిని, విద్యార్థులు చిలకలూరిపేట పట్టణములో ర్యాలీ చేసారు.ఎయిడ్స్ పై అవగాహన కల్పించడం కొరకు విద్యార్థులు ప్లకార్డ్స్ ప్రదర్శిస్తూ, ఎయిడ్స్ గురించిన స్లొగన్స్ పలుకుతూ పట్టణ ప్రజలకు ఎయిడ్స్ ను గురించి అవగాహన కల్పించారు. ఇందులో తిలిబి స్కూల్ టీచర్స్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## 3న 'చలో విజయవాడ' .. అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన యాత్రను జయప్రదం చేయాలి

చిలకలూరిపేట, డిసెంబర్ 1, ప్రభాతవార్త: చిలకలూరిపేట: డిసెంబర్ 3 న చలో విజయవాడ అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన యాత్ర జయప్రదం చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె మంత్రు నాయక్ కోరారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ పదేళ్లగా వేలాది డిపాజిటర్లు ఆర్థిక, మానసిక, ఆరోగ్యపరమైన కష్టాల్లో



అల్లాడుతుండగా, ఎన్నికల ముందు బాధితులకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీలు నేడు అమలు కాకపోవడం బాధాకరమన్నారు. అగ్రిగోల్డ్ బాధితులపై ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్య వైఖరిని నాయకులు తీవ్రంగా ఖండించారు.కంపెనీకి స్పష్టమైన ఆస్తులు ఉన్నప్పటికీ డిపాజిటర్లకు చెల్లింపులు జరగకపోవడం వ్యవస్థ వైఫల్యాన్ని సూచిస్తోందన్నారు. డిసెంబర్ 3న విజయవాడలో జరిగే ఆవేదనా యాత్ర బాధితుల న్యాయ పోరాటానికి చారిత్రాత్మక మలుపవుతుందని పేర్కొన్నారు.

## ఘనంగా గురజాడ అప్పారావు వర్ధంతి

చిలకలూరిపేట, డిసెంబర్ 1, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణంలోని వెనకబడిన తరగతుల



బాలుర హాస్టల్ లో ఆదివారం జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (గార్డ్స్) ఆధ్వర్యంలో మహాకవి గురజాడ అప్పారావు 110వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ప్రముఖ సాహితీ విమర్శకులు డా.పీవీ సుబ్బారావు పాల్గొని గురజాడ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. కొన్ని గురజాడ గేయాలు పాడి వినిపించారు. అనంతరం విద్యార్థులకు కథల పుస్తకాలు ఉచితంగా అందజేసి, వారిచే చదివించి పఠనాసక్తి కలిగించారు. తొలుత గురజాడ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రచురణల విభాగం కన్వీనర్ డా. దార్ల బుజ్జిబాబు, హాస్టల్ వార్డన్ కృపవతి, రవికిరణ్ తదితరులున్నారు.

## అరాచక శక్తులపై ఉక్కు పాదం: ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట, డిసెంబరు1 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో అన్యాయాలు, అక్రమాలకు విముక్తి లభించిందని, కిరాయి గుండాలను, రౌడీలను ఉక్కుపాదం మోపి అణచివేశామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. స్థానిక 15,17 వార్డులలో సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేశారు.



ఇంటింటికీ తిరిగి పెన్షన్లను అందజేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో నరసరావుపేట పట్టణంలోని వరవకట్ట ప్రాంతం అసాంఘిక శక్తులకు నిలయంగా ఉండేదని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హత్యా రాజకీయాలను ప్రోత్సహించడంతో, రౌడీలు, గుండాలు ఈ ప్రాంతాన్ని ఆక్రమించి ఎన్నో దుర్మార్గాలు చేశారని ఆరోపించారు. రౌడీలను పక్కన పెట్టుకుని హత్యలు చేయించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు. ప్రధానంగా వరవకట్ట ప్రాంతంలో కిరాయి గుండాల రాజ్యం ఏలారన్నారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో వైసీపీ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన చిన్నపరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే గుండాలు దాడి చేసి ఒక చేతిని విరగగొట్టారని తెలిపారు. అలాగే, బీజేపీ నాయకుడు రామకృష్ణపై అక్రమ కేసులు పెట్టి వేధించారని, ముస్లిం నాయకుడు ఇబ్రహీంను, మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి తన గుండాల చేత హత్య చేయించారని ఆరోపించారు. ప్రస్తుతం వరవకట్ట ప్రాంతం ప్రశాంతంగా ఉందన్నారు. మహిళలు, చిన్నారులు స్వేచ్ఛగా తిరిగే వాతావరణాన్ని కల్పించామని ఎమ్మెల్యే తెలిపారు. ఇలాంటి మంచి పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాచర్లలో 'పిన్నెల్లి' చేసిన అభివృద్ధిని 'కాసు' చూపించాలి మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డిపై మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి విమర్శ


నరసరావుపేట, డిసెంబర్ 1 ప్రభాతవార్త :గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి .... మీ తాత కాసు అయితే .... మీ నాన్న అరకాసు, నువ్వు పావు కాసు అని కాసు కుటుంబాన్ని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. సోమవారం పల్నాడు జిల్లా టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబుతో కలిసి జూలకంటి బ్రహ్మారెడ్డి కాసు కుటుంబంపై తీవ్రస్థాయిలో దుమ్మెత్తి పోశారు. మాచర్ల గురించి కాసు మహేష్ కి ఏం తెలిసని మాట్లాడుతున్నారని అన్నారు. ఓ విగ్రహాల దొంగ అని, ఒక దోపిడీ దారుడని, పెద్ద అవినీతిపరుడు మీ పార్టీ జిల్లా అధ్యక్షుడని అన్నారు. అది ఒక దౌర్భాగ్యమన్నారు. విగ్రహాల దొంగ అని మీ పిన్నెల్లి ని ఎన్నిసార్లు విమర్శించినా, ఒక్కసారి అయినా ఖండించాడా అని ప్రశ్నించారు. తమ సొంత నియోజకవర్గాన్ని వదిలి పారిపోయింది తాను కాదని, పారిపోయింది కాసు కృష్ణారెడ్డి, మహేష్ రెడ్డిలే నని చెప్పారు. 1972లో అప్పటి ప్రభుత్వం పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల చదువు కోసం నరసరావుపేటలో శ్రీ కాసు రాఘవమ్మ బ్రహ్మానందరెడ్డి కళాశాల కట్టించేందుకు అతి తక్కువ ధరకు భూమిని కేటాయించారన్నారు. కానీ మహేష్ రెడ్డి నువ్వు ఏం చేసావ్, కాసు రాఘవమ్మ పేరును తొలగిస్తూ జీఓ తీసుకువచ్చావన్నారు. మా తాత నేతులు



తాగారని గొప్పలు పోతావేగాని, మీ తాత విగ్రహాన్ని తీసుకువచ్చి నడిరోడ్డుపై పడేశావని విమర్శించారు. అసలు ఏ కళాశాలలోనైనా సినిమా హాళ్లు, కళ్యాణ మండపాలు కడతారా అని ప్రశ్నించారు. క్రికెట్ స్టేడియం అని చెప్పి దానిపై, డబ్బులు గుంచుకుంటున్నామన్నారు. నీ తాతలు సంపాదించి కట్టిన కోటలు ఏమీ లేవనీ, నాకు తెలిసి మీ నాన్న కాసు కృష్ణారెడ్డి కూడా అవినీతిపరుడు కాదని, ఐతే కాసు సెంట్రల్ షాపింగ్ మాన్ కట్టడానికి నీకు కాసులు ఎలా వచ్చాయి కాసు అని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో గురజాలలో మహేష్ రెడ్డి దోపిడీ చేసిన డబ్బుతోనే ఈ షాపింగ్ మాల్ కట్టాడని ఆరోపించారు. ఈ విషయం పల్నాటి ప్రజలకు తెలుసన్నారు. 23 ఎకరాల భూమిని, ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని కబ్జా చేసిన కబ్జాదారుడన్నారు. మహేష్ కి నిజంగా దమ్ము ధైర్యం ఉంటే అతని ప్రాపర్టీస్ మీద సిబిఐ దర్యాప్తు చేయాలా, లేక ఈడి దర్యాప్తు కావాలా చెప్పమన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై చిన్నతనంలోనే డబుల్ మర్డర్ కేసులో ముద్దాయన్నారు. మాచర్లలో పిన్నెల్లి ఎంతో అభివృద్ధి చేశాడని కాసు చెబుతున్నాడని, దమ్ముంటే మాచర్లకు వచ్చి పిన్నెల్లి చేసిన అభివృద్ధిని చూపించాలన్నారు. పల్లెటూర్లలోని సాధారణ రోడ్లు కూడా వేయించలేని పిన్నెల్లి, నేషనల్ హైవే తీసుకువచ్చాడని పచ్చి అబద్దాలు చెబుతున్నాడని విమర్శించారు. దొంగలకు దొంగ సపోర్టు అన్నట్టు, కాసు మహేష్ వ్యవహరిస్తున్నాడన్నారు. మాచర్లలో పిన్నెల్లి చేసిన దుర్మార్గాలు దోపిడీలు, అవినీతిని నేను చూపిస్తా రా అని మహేష్ కు సవాల్ విసిరారు. ఒక సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చి, మీ తాతను ఎదిరించి గెలిచిన మొనగాడు మా నాన్న జూలకంటి నాగిరెడ్డి అని తెలిపారు. మీ నాన్న గురజాలకు వస్తే ఓడించింది మా నాన్నే అన్నారు. 62 ఏళ్ళ నిజాయితీగా జూలకంటి కుటుంబమన్నారు. మా కుటుంబపు నిబద్ధత, నిజాయితీ, చరిత్ర, తాము ఎన్ని ఆస్తులను పోగొట్టుకున్నామో పల్నాటి ప్రజలకు తెలుసన్నారు. పల్నాడులో అభివృద్ధి అని చెబుతూ 50 సంవత్సరాలు ప్రజలను మోసం చేసింది కాసు కుటుంబమే అన్నారు. అవమానాలు, బాధలు, ఆర్థిక దోపిడీలకు గురి అయి, పల్నాడును ప్రశాంతంగా ఉంచితే, డబుల్ మర్డర్ చేయిస్తారా, అలాంటి వాడికి నువ్వు సపోర్ట్ చేస్తావా అని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మాచర్లకు నువ్వొస్తావో, పిన్నెల్లి వస్తాడో, వాడి బాబు వస్తాడో రండి .... 20 ఏళ్లలో చేసిన అభివృద్ధి చూపించండని సవాల్ విసిరారు. ఎన్నికల్లో పిన్నెల్లి ఓడిపోతే రాజకీయం సన్యాసం చేస్తానని అన్నది నిజమా కాదా అన్నారు. పల్నాడు రక్తసిక్తం వైసీపీ నాయకులేనని స్పష్టం చేశారు. పిన్నెల్లి కాళ్ళమీద పడితే నీకు నరసరావుపేట ఎమ్మెల్యే సీటు కేసు రాదన్ని, మీ అధినేత జగన్ కాళ్లు పట్టుకుంటే నీకు నరసరావుపేట సీటు వస్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు.

## ఫిర్యాదులు స్వీకరించిన పల్నాడు జిల్లా ఎస్పీ కృష్ణారావు

నరసరావుపేట క్రైమ్, డిసెంబర్ 1 ప్రభాతవార్త :: జిల్లా ఎస్పీ బీ కృష్ణారావు సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి వినతి పత్రాలు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి కుటుంబ, ఆర్థిక,ఆస్తి తగాదాలు,మోసం మొదలగు ఆయా సమస్యలకు సంబంధించి 94 ఫిర్యాదులు అందాయి.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం



ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేయాలని ఎస్పీ ఆదేశాలు ఇచ్చారు. గురజాల కు చెందిన యువతికి ఉద్యోగ ప్రయత్నం చేయుచుండగా ఎల్ఐసి ఏజెంట్ గా పని చేస్తున్న ఒక వ్యక్తి గ్రహించి నీ కుమార్తె కు టీచర్ పోస్టు ఇప్పించగలను అని నమ్మించి ఫిర్యాది దగ్గర నుండి సుమారు ఐదు లక్షల రూపాయలు తీసుకున్నట్లు,డబ్బులు ఇచ్చే సమయంలో గురజాల మండలం పులిపాడు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మధ్యవర్తులు గా ఉన్నట్లు తెలిపారు. డబ్బుల గురించి అడిగితే ఫిర్యాది పై దౌర్జన్యం చేశారన్నారు.రొంపిచర్ల మండలం గోగులపాడు గ్రామానికి చెందినటువంటి ఫిర్యాది పిల్లలకు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నాదెండ్ల మండలం తూబాడు గ్రామానికి చెందినటువంటి భార్యాభర్తలు కలసి ఫిర్యాదు వద్ద నుండి దఫాల వారీగా 50 లక్షల రూపాయల తీసుకున్నట్లు, అదే విధంగా మరొ ఒక వ్యక్తి కూడా ఉద్యోగం ఇప్పిస్తానని నాలుగు లక్షల రూపాయల నగదు తీసుకున్నట్లు వీరిద్దరిని ఉద్యోగం గురించి అడిగితే కాలయాపన చేస్తూ నమ్మించి మోసం చేస్తున్నట్లు తెలిపారు.నరసరావుపేట లోని రామిరెడ్డి పేటకు చెందిన మహిళను 2014వ సంవత్సరంలో ప్రకాశం జిల్లా దర్శి మండలం శివరాజ నగర్ కు చెందిన వ్యక్తికి వివాహం చేసినట్లు,ఆ తరువాత ఫిర్యాది కి ఒక ఆడ, ఒక మగ సంతానం కలిగినట్లు, ఫిర్యాది భర్త మిలిటరీ లో పనిచేస్తూ 2023వ సంవత్సరంలో అనారోగ్యంతో చనిపోయినట్లు, ఫిర్యాది భర్త చనిపోయినప్పటి నుండి ఫిర్యాది అత్తమామలు ఫిర్యాది ని ఇంటికి రానివ్వకుండా తిడుతూ కొడుతూ ఇబ్బందులకు గురి చేయగా అప్పటి నుండి ఫిర్యాది నరసరావుపేట కు వచ్చి పిల్లలను చదివించుకున్నట్లు తెలిపారు. ఫిర్యాది భర్త చనిపోయిన తరువాత మిలిటరీ నుండి రావలసిన బెనిఫిట్స్ పూర్తిగా తనకు రాకుండా అడ్డుపడుతున్నట్లు పేర్కొన్నారు.మాచర్ల పట్టణమునకు చెందిన ఒక మహిళ ఒక వ్యక్తిని ప్రేమిస్తున్నట్లు, ఆ వ్యక్తి ఫిర్యాదిని పెళ్లి చేసుకుంటాను అని 3 నెలల క్రితం హైదరాబాదుకు తీసుకుని వెళ్లినట్లు పెళ్లి చేసుకుంటానని తెలిసిన వారి ఇంట్లో ఉంచి ఫిర్యాదుని శారీరకంగా వాడుకుని ఇప్పుడు పెళ్లి చేసుకోను అని బెదిరిస్తున్నట్లు తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు వారి ఫిర్యాదులను రాసి పెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయ సహాయ సహకారాలు అందించారు.

## అర్హులైన ప్రతిఒక్కరికీ పెన్షన్లు: ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, డిసెంబర్ 1, ప్రభాతవార్త: ఇంటి ఇంటికి వెళ్లి వృద్ధులకు దివ్యాంగులకు అర్హులైన లబ్ధిదారులకు సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ సోమవారం పంపిణీ చేశారు.సత్తెనపల్లి నియోజకవర్గం లో ఉదయాన్నే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జరిగింది.అర్హులైన ప్రతి ఒక్కరికి



పెన్షన్ లు అందిస్తున్నామని, పెద్దఎత్తున ప్రజలకు సంక్షేమం అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్అని ఎమ్మెల్యే కన్నా తెలిపారు. ప్రజలకు అభివృద్ధి తో కూడిన సూపరి పాలన అందిస్తున్నామని,పేదల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ద్వారా లక్షలాది మంది నిరుపేదలకు ఆర్థిక భరోసా లభిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా10వ సచివాలయం నందు 487 మంది లబ్ధిదారులకు 21,02,000రూపాయలు పెన్షన్లు అందిస్తున్నామన్నారు.రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు ఈ రోజు సత్తెనపల్లి పట్టణం 22వ వార్డులో కూడా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఇంటి ఇంటికి వెళ్లి కన్నా పంపిణీ చేశారు. వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ, వార్డు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఆటోనగర్ సమస్యల పరిష్కారానికి సిఎం హామీ: ఎమ్మెల్యే 'కన్నా'

సత్తెనపల్లి, డిసెంబర్ 1, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం ఆటోనగర్లో మిత్ర ఆటోనగర్ వర్కర్స్ యూనియన్ రెండవ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక ఎమ్మెల్యే





కన్నాలక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆటోనగర్ సమస్యలను యూనియన్ సభ్యులు కన్నాకు వివరించారు. సత్తెనపల్లి పట్టణంలో ఆటోనగర్ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు ఇవ్వాలని గతంలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలసి కోరామని కన్నా వెల్లడించారు. అన్నింటిని పరిశీలించి సమస్య లకు పరిష్కారం చూపిస్తానని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారన్నారు.ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ వార్డు నాయకులు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు .

## నియోజకవర్గంలో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే డా.గోపిరెడ్డి

రొంపిచర్ల, డిసెంబర్ 1 ప్రభాతవార్త :: నియోజకవర్గంలో వైయస్సార్సీపి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సోమవారం పర్యటించారు. ఇటీవల కనుమూసిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను కలిసి మాట్లాడారు. నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత రొంపిచర్ల మండలం వడ్లమూడి వారి



పాలెం గ్రామంలో పర్యటించారు. గ్రామంలో అన్నెం శివనారాయణ భార్య అన్నెం అనురాధ పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొన్నా రు. వారి చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వారి వెంట వైయస్సార్సీపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా నరసరావుపేట పట్నంలోని వార్డుల్లో వారు పర్యటించారు. పట్టణంలోని 23వ వార్డు కార్యకర్త బాదుగున్నల శ్రీనివాసరావు పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు.వారి చిత్రపటానికి నివాళులు అర్పించా రు. పార్టీకి వారు అందించిన సేవల ను గుర్తు చేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పార్టీ వారికి అండగా ఉంటుందని పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి భరోసా ఇచ్చారు. పట్టణంలోని వైయస్సార్సీపి నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## పట్టణంలో వరల్డ్ ఎయిడ్స్ డే ర్యాలీ

నరసరావుపేట, డిసెంబర్ 1 ప్రభాతవార్త : వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా సోమవారం స్థానిక పిఎన్సీ కె ఆర్ కళాశాలలో వరల్డ్ ఎయిడ్స్ డే 2025 ను కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హెచ్ఐవి /ఎయిడ్స్ పట్ల కళాశాల విద్యార్థులకు అవగాహన కోసం స్టాల్ ను ఏర్పాటు మరియు కలజాతర ప్రదర్శన కూడ ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చందలవాడ అరవింద్ బాబు పాల్గొని జెండా ఊపి ఎయిడ్స్ డే ర్యాలీ ను ప్రారంభించారు. కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ



పల్నాడు బస్టాండ్ వరకు, సాగింది. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, డిఎంహెచ్ఓ డాక్టర్ బి రవి మాట్లాడుతూ ప్రజలందరూ వ్యక్తిగతంగా హెచ్ఐవి /ఎయిడ్స్ వచ్చే మార్గాలు గురించి ప్రజలు తెలుసుకోవాలన్నారు. జిల్లా లోని ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా హెచ్ఐవి పరీక్ష చేస్తారని ఎవరికైనా హెచ్ఐవి పట్ల సందేహాలు ఉంటే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలోనీ ఐ సి టి సి కేంద్రాన్ని సందర్శించాలని సూచించారు. గత ఏడాది ఉత్తమ పనితీరు కనబరచిన వారికి మరియు వరల్డ్ ఎయిడ్స్ డే కి సహకరించిన వివిధ కళాశాల ప్రిన్సిపల్స్ కి సర్టిఫికెట్స్ మరియు మెమాంట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసి, ఎయిడ్స్ మరియు టిబి అధికారి డాక్టర్ మాధవిలత, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్, స్థానిక రెడ్ క్రాస్ యాజమాన్యం, వివిధ కళాశాల విద్యార్థులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, జిల్లా దిశ సిబ్బంది, జిల్లా ఎన్ ఏ సి పి సిబ్బంది, జిల్లా లోని టి ఐ ఎన్ జి వో ఓస్ సిబ్బంది,షేర్ ఇండియా, లింక్ వర్కర్ సిబ్బంది పాల్గొన్నారు.

## కేరిడ్జ్ విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట, డిసెంబర్ 1 ప్రభాతవార్త :స్థానిక కే-రిడ్జ్ స్కూల్ విద్యార్థులు పల్నాడు బాలోత్సవ్ పోటీల్లో తమ అద్భుత ప్రతిభను ప్రదర్శించి మొత్తం 20 బహుమతులు సాధించారు. సోమవారం విద్యార్థుల అభినందన కార్యక్రమంలో చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు వివరాలు తెలిపారు. ప్రిన్సిపాల్ జి. బర్నబాస్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. చైర్మన్ మాట్లాడుతూ జూనియర్ మరియు సీనియర్ విభాగాల్లో వివిధ కార్యక్రమాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయిలో కేరిడ్జ్ స్కూల్కు




ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని అన్నారు. జూనియర్ విభాగంలో క్లాసికల్ డాన్స్, హ్యాండ్రైటింగ్, స్పెల్ బీ, స్టోరీ టెల్లింగ్ లలో 1వ స్థానం, క్విజ్, గ్రూప్ సింగింగ్ 2వ, సైన్స్ ఎక్స్పెరిమెంట్స్, స్పెల్ బీ లో 4వ స్థానం, మోనో యాక్షన్ – కన్సొలేషన్, సీనియర్ విభాగంలో క్లాసికల్ డాన్స్, 3వ, ఫోక్ 1వ, స్పెల్ బీ 2వ, ఎలోక్యూషన్ 3వ, బెస్ట్ ఫ్రమ్ వేస్ట్ – 2వ, రంగోలి 2వ, పోస్టర్ ప్రెజెంటేషన్ 5వ, స్టోరీ అనాలిసిస్ – 2వ స్థానాలలో నిలిచారన్నారు. ఈ సందర్భంగా ²చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు విద్యార్థులు సాధించిన ఈ అద్భుత విజయం పాఠశాల ప్రగతిని ప్రతిబింబిస్తోందన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కోమటనేని నాసరయ్య, అకాడెమిక్ హెడ్ టీ. విజయరాజు, క్యాంపస్ ఇన్చార్జ్ కోట బాపూజి, ఎన్. హేమలత, ఉపాధ్యాయులు చురుకుగా పాల్గొని విజేతలను అభినందించారు.

## ఎపి మోడల్ స్కూల్ విద్యార్థికి పురస్కారం

రొంపిచర్ల, డిసెంబరు 1 ప్రభాతవార్త :మండలంలో వి.రెడ్డిపాలెం ఎపి మోడల్ స్కూల్ విద్యార్థిని రాష్ట్ర స్థాయి తెలుగు ప్రతిభా పురస్కారం 2025అవార్డుకు ఎంపికైనారు.ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవినాయక్ మాట్లాడుతూ తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పొలిమేర హారిక మన సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో గత నెలలో జరిగిన "రాష్ట్ర స్థాయి తెలుగు ప్రతిభా పురస్కారం 2025" అవార్డు పరీక్షలో పాల్గొని రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానంలో నిలిచారని అన్నారు.ఈ పరీక్షలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి సుమారు 2500 మంది విద్యార్థులు పాల్గొని వ్రాయటం జరిగిందని అన్నారు.ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానంలో నిలవడం పాఠశాలకు ఎంతో గర్వ కారణమని అన్నారు.ఉపాధ్యాయులు ఇచ్చిన శిక్షణ వలన విద్యార్థి ఈ స్థాయికి వచ్చారని అన్నారు.అనంతరం విద్యార్థి ని ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు.

## పేరయ్యకు 'ప్రత్తిపాటి' పరామర్శ



నాదెండ్ల, డిసెంబర్ 1, ప్రభాతవార్త: చిలకలూరిపేట నియోజకవర్గం, నాదెండ్ల మండలం, మల్లాయపాలెం గ్రామానికి చెందిన చింతకుంట పేరయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కారణంగా, సోమవారం ఆయన ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకొని, వారిని పరామర్శించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తదితరులు.

## పెంచలయ్య హత్యకు సిపిఎం నిరసన



రేపల్లె, డిసెంబరు 1, ప్రభాతవార్త:నెల్లూరు గంజాయి మాఫియా చేతిలో చనిపోయిన సిపిఎం నేత పెంచలయ్య హత్యను ఖండిస్తున్నట్లు సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్.మణిలాల్ చెప్పారు. సోమవారం రేపల్లె ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో సిపిఎం నేతలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ గంజాయి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తూ యువతను చైతన్యపరుస్తున్న పెంచలయ్యను హత్య చేయటం అమానుషమన్నారు.ఈ సంఘటనను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు.హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని మణిలాల్ డిమాండ్ చేశారు.రాష్ట్రంలో గంజాయిని రూపుమాపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు వై.కిషోర్,కె.ఆశీర్వాదం,కె.గోపి,జె.ధర్మరాజు,సిహెచ్.ప్రకాష్,రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ అవగాహన సదస్సు

రేపల్లె, డిసెంబరు 1, ప్రభాతవార్త:ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం అనగాని భగవంతరావు డి గ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్,ఇండియన్ రెడ్‌క్రాస్,ఎన్‌సిసి,ఎన్ఎస్ఎస్‌లు సంయుక్తంగా నిర్వహించాయి.విద్యార్థులలో అవగాహన పెంచేందుకు క్విజ్,డిబేట్,వ్యాసరచన పోటీలను నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో డాక్టర్ ఎం.దాసు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి లక్షణాలు,నివారణా చర్యలు,సమాజంలో అవగాహన అవసరాన్ని తెలియజేశారు.కళాశాల విద్యార్థులు, క్యాడెట్లు,వాలంటీర్లు మానవహారంలో భాగంగా రెడ్ రిబ్బన్ ఆకారంలో నిలబడి ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవానికి ప్రత్యేకత చేకూర్చారు.ఈ కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.బుజ్జిబాబు,ఎన్‌సిసి ఆఫీసర్ కె.బాలగురవయ్య,అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



## ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

నగరం, డిసెంబరు 1, ప్రభాతవార్త:సమాజంలో ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ అన్నారు.సోమవారం నగరంలోని శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హరికృష్ణ మాట్లాడుతూ హెచ్ఐవి సంక్రమణ ద్వారా ఎయిడ్స్ వ్యాప్తి చెందటం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.హెచ్ఐవి,ఎయిడ్స్ బాధితుల పట్ల ఉన్న వివక్షత తగ్గించటమే ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ నివారణ ఉద్దేశ్యమన్నారు.ఈ కార్యక్రమంలో ఐక్యూఎసి కో ఆర్డినేటర్ ఆర్.ప్రసన్న,ఎన్ఎస్ఎస్ ప్రో గ్రామ్ ఆఫీసర్ ఎం.వి.శివయ్య,రెడ్ క్రాస్,రెడ్ రిబ్బన్ కో ఆర్డినేటర్ గోపికృష్ణ,ఎన్‌సిసి ఆఫీసర్ వి.సాంబమూర్తి,కళాశాల అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.



## వితంతువులకు అండగా ప్రభుత్వం

నగరం, డిసెంబరు 1, ప్రభాతవార్త:వితంతువులకు అండగా కూటమి ప్రభుత్వం ఆర్థిక ప్రయోజనాన్ని అందజేస్తున్నదని అద్దంకివారిపాలెం సర్పంచ్ విచారపు పావని చెప్పారు.సోమవారం నగరం మండల పరిధిలోని నూతన వితంతు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.పావని మాట్లాడుతూ కుటుంబంలో ఇంటి పెద్ద మరణిస్తే ఆ కుటుంబానికి కూటమి ప్రభుత్వం తోడుగా నిలుస్తున్నదన్నారు.నిరుపేదల సంక్షేమాన్ని కోరే కూటమి ప్రభుత్వం పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశ్యంతో ప్రతి పేదవాడికి ఇంటిని నిర్మించే దిశగా చర్యలు తీసుకోవడం అభినందనీయమని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో ధూళిపూడి నీటి సంఘం అధ్యక్షుడు ఉయ్యూరు భీమేష్,కుమార్,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయాలి

నగరం, డిసెంబరు 1, ప్రభాతవార్త:భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయాలని జిల్లా అధ్యక్షుడు కొండముది బంగారు బాబు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌లు పిలుపునిచ్చారు.సోమవారం జరిగిన సమావేశంలో భారతీయ జనతాపార్టీ బాపట్ల జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా యార్లగడ్డ చింతయ్యను నియమించారు.జిల్లాలోని రైతుల సమస్యలను తెలుసుకుని పరిష్కార దిశగా సాగాలని వారు సూచించారు.యార్లగడ్డ చింతయ్య నియామకం పట్ల బిజెపి నగరం మండల అధ్యక్షుడు సురేష్,మండల ప్రధాన కార్యదర్శి యల్లాప్రగడ సీతాపతి హర్షం వ్యక్తం చేశారు.నగరం మండలంలోనే కాకుండా బాపట్ల జిల్లాలోని ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు చింతయ్య తన శైలిలో పనిచేయాలని బిజెపి నాయకులు,కార్యకర్తలు కోరారు.

## గీతా కర్పూర యజ్ఞం



రేపల్లె, డిసెంబరు 1, ప్రభాతవార్త: భట్టి ప్రోలు సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమంలో ఆ శ్రమ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం 5163వ గీతా జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆశ్రమ అధ్యక్షురాలు అరుణకుమారి మాట్లాడుతూ మార్గశిర మాసం శుక్లపక్ష ఏకాదశి సందర్భంగా గీతా జయంతి జరుపుకోవటం విశేషమన్నారు.గీతా జయంతిని భగవద్గీత పుట్టిన రోజుగా జరుపుకుంటున్నామని తెలిపారు.మహా విష్ణువుకు అత్యంత ప్రీతికరమైన రోజుగా పేర్కొన్నారు.శ్రీ మహావిష్ణువుని అర్చించిన పారాయణం చేసిన శ్రీ కృష్ణ జగద్గురువు అనుగ్రహంతో పాపాల నుంచి,జనన మరణ చక్రము నుండి విముక్తి కలిగించి మోక్షాన్నిస్తుందని ఆమె వివరించారు.గీతా కర్పూర యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోట యశోద దేవి,దేవసేన ఆండాళ్,జ్యోతి, రాజరాజేశ్వరి,సునీత,భార్గవి,హేమలత,మందులు బాబు, జవ్వాజి హేమ శంకరరావు,శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ ఎంపిడీఓగా దానయ్య



కొల్లిపర,డిసెంబరు 1 ప్రభాతవార్త: మండల కేంద్రం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓగా దానయ్య సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు.ఈయన తెనాలి మండలం పెదరావూరులో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ ప్రమోషన్ పై కొల్లిపర వచ్చారు.పదవీ బాధ్యతలు చేపట్టిన దానయ్యకు ఎంపీపీ భీమవరపు పద్మావతి,ఇన్‌చార్జ్ ఎంపీడీఓ భార్గవ్,పరిపాలనాధికారి శరణుకిషోర్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి మరియు సిబ్బంది అభినందించారు.

## చిన్న వయస్సులో వివాహం చేయటం చట్టరీత్యా నేరం..



కొల్లిపర,డిసెంబరు 1 ప్రభాతవార్త: ఆడపిల్లలకు చిన్న వయస్సులో వివాహం చేయటం చట్టరీత్యా నేరమని డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి అన్నారు.సోమవారం మండల కేంద్రం కొల్లిపరలో ద్వాక్రా మహిళలు లింగ సమానత్వంపై ర్యాలీ నిర్వహించి డీఆర్‌డీఏ అధికారులు అవగాహన కలిగించారు.ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ఆడపిల్లలను చదివించటం వలన ఆ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్నారు.18 సంవత్సరాలు నిండని కుమార్తెలకు వివాహం చేయటం వలన ఎన్నో సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందన్నారు.కార్యక్రమంలో సీసీలు టి.మధు, వి.విజయకుమార్, ఎన్.ప్రమీలాదేవి,బుజ్జిబాబు,ఎమ్ఎస్ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమం ఆలోచించిన ఏకైక సిఎం చంద్రబాబు

### -దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి

కొల్లిపర,డిసెంబరు 1 ప్రభాతవార్త: పేదవారి సంక్షేమం గురించి ఆలోచించిన ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి పేర్కొన్నారు.సోమవారం మండల పరిధిలోని వల్లభాపురంలో టీడీపీ నాయకులతో కలసి ఆయన ఇంటింటికీ తిరిగి పెన్షన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ నాడు ఎన్నికలలో సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ భార్గవ్,నీటి సంఘం అధ్యక్షుడు బొట్లా శ్రీరాములురెడ్డి,పంచాయతీ కార్యదర్శి పద్మావతి,నాయకులు ఆరిగ పూర్ణచంద్రారెడ్డి,కొమ్మారెడ్డి గోపిరెడ్డి,కొండా కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# బాపట్ల జిల్లా వార్త



## ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

బాపట్ల,డిసెంబర్ 1,ప్రభాతవార్త: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా సోమవారం నిజాంపట్నంలోని మేకల శోభారాణి ఇంటికి జిల్లా కలెక్టర్ వెళ్లి పింఛన్ నగదు అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల కొరకు ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. లబ్ధిదారురాలైన శోభారాణితో కలెక్టర్ మాట్లాడారు. తాగునీటి కొరకు ఇబ్బందులు పడుతున్నామని ఆమె కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆర్డబ్ల్యూఎస్ ద్వారా సురక్షిత తాగునీరు అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అరటి బోదెలతో గృహ ఉపకరణాలు తయారు చేస్తున్న మహిళలతో మాట్లాడారు. తుపాను షెల్టర్లలో అరటి బోదెలతో గృహ ఉపకరణాల తయారీపై శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. ఒక స్వచ్ఛంద సంస్థ సహకారంతో అనంతపురం నుంచి అరటి బోదెలు తెప్పించుకుని వివిధ రకాల వస్తువులను తయారుచేయడాన్ని ఆయన పరిశీలించారు. సుగంధ పరిమళాలు వెదజల్లే కొవ్వొత్తులను తయారు చేయడంలో వారి ఆసక్తిని చూసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ స్వయంగా రూ.500లకు కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించారు. గ్రామంలో ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన ఆరా తీశారు.వరి పంట సాగు చేసిన రైతులు ఆందోళన చెందకుండా వ్యవసాయశాఖ సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు.నిజాంపట్నంలోని రైతు సేవ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రైతులకు గోనె సంచులు, టార్పాలిన్ పట్టలను ఉచితంగా పంపిణీ చేశారు. వర్షానికి పడవకుండా ధాన్యాన్ని భద్రపరుచుకోవాలని రైతులకు సూచించారు. భారీ వర్షాల హెచ్చరికలతో అత్యవసరంగా గోదాములను గుర్తించామన్నారు. అన్ని ప్రాంతాలలో గోదాములు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. నిజాంపట్నంలో 30 ట్రాక్టర్లను రైస్ మిల్లులకు అనుసంధానించామని, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అవసరమైన వాహనాలను రైతులు తెచ్చుకోవచ్చన్నారు. వాటికి జిపిఎస్ అమర్చాలన్నారు. రైతులు వరి పంట కోసిన తర్వాత వర్షానికి తడవకుండా భద్రంగా ఉంచుకోవాలన్నారు. తేమ 17 శాతానికి రాగానే రైతు సేవా కేంద్రాలలో అమ్ముకోవచ్చన్నారు. ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట రేపల్లె ఆర్డిఓ రామలక్ష్మి, తహసిల్దార్ శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.



## దిత్వా తుపాను ప్రభావంతో భారీ వర్షాలకు సాగు భూములు నీట మునగకుండా చర్యలు తీసుకోవాలి

బాపట్ల,డిసెంబర్ 1,ప్రభాతవార్త: దిత్వా తుపాను ప్రభావంతో భారీ వర్షాలకు నిజాంపట్నంలోని సాగు భూములు నీట మునగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. దిత్వా తుపాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ రేపల్లె నియోజకవర్గం నిజాంపట్నం మండలంలో సోమవారం విస్తృతంగా పర్యటించారు. తుపాను షెల్టర్, అందులో వసతి సౌకర్యాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పునరావాస కేంద్రానికి ఉపయోగపడేలా లేవని, ప్రభుత్వ పాఠశాలను ఎంపిక చేసుకోవాలన్నారు. అక్కడే ఉన్న గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. భారీ వర్షాలకు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్త చర్యలపై సచివాలయం సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలనే ఉద్దేశంతో జాగ్రత్తలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. మురికి కాల్వలు, పంట కాల్వలలో గుర్రపు డెక్క, చిల్లచెట్లను తొలగించాలని, వర్షం నీరు దిగువకు వెళ్లేలా శుభ్రం చేయాలన్నారు. సిద్ధంగా ఉంచిన జెసిబి యంత్రాలను ఆయన పరిశీలించారు. సముద్రంలోకి వేటకు వెళ్లిన మత్స్యకారులను కాపాడేందుకు గజ ఈతగాళ్లకు పంపిణీ చేసిన సంరక్షణ పరికరాలు, లైఫ్ జాకెట్లు, టార్చిలైట్స్, రోప్, ఎయిర్ బెలూన్స్, తదితరమైన వాటిని పరిశీలించారు. సహాయక చర్యలకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. రేపల్లె ప్రధాన కాల్వ వద్ద చెడిపోయిన లాక్ లను పరిశీలించారు.తుపాను సమయంలో సముద్ర జలాలు కాల్వలోకి రాకుండా గేట్లు ఎంతో ఉపకరిస్తాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రేపల్లె తదితరమైన ఎగువ ప్రాంతాల నుంచి కాల్వలోకి వరద నీరు సజావుగా వెళ్లడానికి మార్గం సుగుమం చేయాలన్నారు. లాక్ లు పనిచేయకపోవడంతో గత తుపాను సమయంలో ఎగువ భాగంలోని వందలాది ఎకరాలు నీట మునిగాయని చెప్పారు. జెసిబి యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.భారతీయ తీర రక్షణ దళం కార్యాలయాన్ని , తీర ప్రాంత సంరక్షణపై కమాండెంట్ రాజేంద్ర స్వరూప్ తో అర్ధ గంటకు పైగా చర్చించారు. భారతీయ తీర రక్షణ దళం పనితీరు, అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం యంత్రాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. నూతనంగా లైట్ హౌస్ నిర్మాణానికి 1.5 ఎకరాల స్థలాన్ని కేటాయించామన్నారు. మెకనైజ్డ్ బోట్లు పర్యవేక్షణ తీరును పరిశీలించారు.ఆయన వెంట రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, తహసిల్దార్ శ్రీనివాసులు, తదితరులు, పాల్గొన్నారు.



## 'స్వామివారికి సేవ చేయడం ఎంతో అదృష్టం'

బాపట్ల,డిసెంబర్ 1,ప్రభాతవార్త: అయ్యప్ప స్వామి వారికి సేవ చేసుకునే భాగ్యం కలగడం తనకు ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు మాజీ ఉమ్మడి గుంటూరు జిల్లా ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. శ్రీ సోమేశ్వర స్వామి దేవస్థానం లో గత 41 రోజులుగా మాలదారులకు నిర్వహిస్తున్న చద్ది కార్యక్రమం ముగింపు సందర్భంగా శివాలయంలో సోమవారం ప్రత్యేక హోమాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో మాలదారులతో పూజలు చేశారు. చివరి రోజు చదివి ముగింపు సందర్భంగా స్వాములకు చద్ది వడ్డించారు. ఈ సందర్భంగా అన్నం సతీష్ ప్రభాకర్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా సోమేశ్వర స్వామి దేవస్థానంలో మాలదారులకు చద్ది కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా గత 21 సంవత్సరాలుగా తన వ్యక్తిగత నిధులతో ప్రతి సంవత్సరం మాలదారులకు అయ్యప్ప స్వామి ఆశీస్సులతో చద్ది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాని ఆయన తెలిపారు. వేలమంది స్వాములు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరిస్తున్నారని, రానున్న రోజులలో స్వామివారి కృపతో మరెన్నో మంచి కార్యక్రమాలు చేయడానికి ముందుకు వెళ్తామన్నారు. చద్ది కార్యక్రమాన్ని తాను నిర్వహిస్తున్నప్పటికీ శివాలయంలో దగ్గర ఉండి అన్ని కార్యక్రమాలు విజయవంతం అవ్వడానికి కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ పూజలలో దేవస్థానం చైర్మన్ బుర్ల రామసుబ్బారావు, గురుస్వామి కొటికం సుబ్బారావు, దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




## రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో హెచ్ఐవి పీడితులకు అవగాహన కార్యక్రమం

తెనాలి టౌన్, డిసెంబర్1, ప్రభాతవార్త: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా,సోమవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో,పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషియన్ ఫుడ్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి మాట్లాడుతూ, ఎయిడ్స్ పేషెంట్లు క్రమం తప్పకుండా మందులు వాడితే వారి జీవితకాలం పెరుగుతుందని గతంలో కన్నా ఇప్పుడు ఎయిడ్స్ పేషెంట్లు పెరుగుతున్నారు కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజల్లో హెచ్ఐవి వ్యాధి పట్ల అవగాహన కల్పించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెనాలి శాఖ అధ్యక్షురాలు శ్రీమతి ముమ్మనేని భానుమతి, కోశాధికారి నాళం శ్రీమన్నారాయణ మూర్తి, యూత్ రెడ్ క్రాస్ సభ్యులు, డాక్టర్ రమ్యకృష్ణ,డాక్టర్ స్నేహ, హాస్పిటల్ నర్సింగ్ స్టాఫ్,ఇతర వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ గ్రీవెన్స్ లో అర్జీలు స్వీకరించిన కమీషనర్

తెనాలి మునిసిపాలిటీ, డిసెంబర్1, ప్రభాతవార్త: ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతి సోమవారం నిర్వహించే,ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజీఆర్ఎస్) కార్యక్రమంలో, మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.స్వీకరించిన అర్జీలను సంబంధిత విభాగాధిపతులకు తగిన చర్యలు తీసుకోవలసిందిగా ఆదేశాలిస్తామ్మన్నారు.ముఖ్యంగా,టౌన్ ప్లానింగ్ విభాగము నుండి,భూముల వివరాలు తెలపాలని,ఇంజనీరింగ్ విభాగము నుండి, 9వ వార్డు నాజరుపేట లో డ్రైయిన్ నీరు పోవుటకు కాలువ ఏర్పాటు చేయవలసినదిగా,అలాగే ఇందిరాయానాది కాలనీ చెంచుపేట 40 అడుగుల రోడ్డు నిర్మాణము చేయుట కొరకు, అర్జీలు వచ్చినట్లు కమీషనర్ రామఅప్పలనాయుడు తెలిపారు.



## ఏపి ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో బొల్లిముంత శివరామకృష్ణ జయంతి



తెనాలి టౌన్, డిసెంబర్1, ప్రభాతవార్త: దివంగత బొల్లిముంత శివరామకృష్ణ రచయితే కాక కళాకారుడిగా,అభ్యుదయ సాహిత్యంతో "అరసం"తో ప్రజా సాంస్కృతిక కార్యక్రమాలతో,కమ్యూనిస్టు కార్యాచరణతో పెనవేసుకున్న జీవితం శివరామకృష్ణదని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి సభ్యులు పేర్కొన్నారు. సోమవారం అభ్యుదయ సినీ రచయిత, ప్రజానాట్యమండలి సభ్యులు, దివంగత బొల్లిమంత శివరామకృష్ణ జయంతి సందర్భంగా,మండల గ్రామం కటివరం లో నిర్వహించిన బొల్లిమంత శివరామకృష్ణ జయంతోత్సవ సభకు తెనాలి నియోజకవర్గ ప్రజానాట్యమండలి అధ్యక్షులు,ముక్కామల మాణిక్యాలరావు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా అభ్యుదయ రచయితల సంఘం(అరసం)జిల్లా ఉపాధ్యక్షులు కనపర్తి బెన్హర్ మాట్లాడుతూ,వాడవాడలా ప్రజానాట్యమండలి నిర్వహణలో యువతి యువకులను చేరదీసి వారితో నాటక,నాటిక,కోలాటం, జానపద కళారూపాలను ప్రదర్శింపజేశారన్నారు.అంతే కాకుండా స్వయంగా ఆయన రచనలు చేసి తెలుగునాట కమ్యూనిజం ఉద్యమ స్ఫూర్తిని వెదజల్లారన్నారు. ఆయన రాసిన కథలు చందమామ లోని జానపద కథలా సాగి అందరిని ఆకట్టుకుంటుందన్నారు. ఆనాడు ప్రజానాట్యమండలిని బలోపేతానికి కృషి చేస్తూ, తెనాలి ప్రాంత కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా,ప్రజా చైతన్యం కోసం కృషిచేసిన నాయకుడు శివరామకృష్ణ అన్నారు.ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షవర్గం అరసం అధ్యక్షుడు,కార్యదర్శిగా, సాహితీ సాంస్కృతిక కృషి చేశారన్నారు.ఈ సభకు అధ్యక్షత వహించిన మాణిక్యాలరావు మాట్లాడుతూ, ప్రగతి అభ్యుదయం పేరిట జీవితాంతం ప్రజావిముక్తి కోసం కృషి చేశారన్నారు. జిల్లా ప్రజానాట్యమండలి కార్యవర్గ సభ్యులు దేవరపల్లి నీలాంబరం,బొల్లిముంత శివరామకృష్ణ జీవిత విశేషాలను వివరించారు.ఈ కార్యక్రమంలో పలువురు కళాకారులు,సాహితీపరులు పాల్గొని శివరామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బొల్లిముంత శివరామకృష్ణ కు నివాళి అర్పిస్తూ పలువురు గాయకులు విప్లవ గీతాలు ఆలపించారు.ఈ కార్యక్రమంలో బొల్లిముంత కృష్ణ,డానియల్,అశోక్ కుమార్,విజయకుమారి, ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి మునిసిపాలిటీ, డిసెంబర్1, ప్రభాతవార్త:పేద మధ్యతరగతి వర్గాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, కూటమి ప్రభుత్వం నాలుగు వేలరూపాయలు పెన్షన్ ఇస్తుందని,శాసనమండలి సభ్యులు,తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం,ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని, పట్టణంలోని సుల్తానాబాద్, సుందరయ్య నగర్, చెంచుపేట ప్రాంతాల్లో, వృద్ధులు, వితంతువులు, మహిళలకు, మరియు దివ్యాంగులకు ఎమ్మెల్సీ ఆలపాటి చేతుల మీదుగా పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి మాట్లాడుతూ, గతంలో చంద్రబాబు హయాంలో 200 రూపాయలు ఉండే పెన్షన్ ని రెండు వేల రూపాయలు చేసింది,చంద్రబాబు అని మళ్లీ అదే పెన్షన్ నేడు నాలుగువేల రూపాయలకు తీసుకువచ్చింది కూడా చంద్రబాబు ప్రభుత్వమేనని,గత ప్రభుత్వం లాగా మోసపూరిత మాటలతో, ప్రజలను మభ్యపెట్టకుండా ఇచ్చిన మాట మీద నిలబడి,అర్హులైన పేద మధ్యతరగతి వర్గాల వారికి ఆర్థికభరోసా కల్పిస్తున్నది కూటమి ప్రభుత్వమేనని ఆయన పేర్కొన్నారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేని విధంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలపై ఆయనకున్న ప్రత్యేక శ్రద్ధతో ఈ మహత్తర కార్యక్రమానికి పూనుకున్నారని,వృద్ధులు వితంతువులకు 4వేల రూపాయలు,దివ్యాంగులకు 6వేలరూపాయలు, అనారోగ్యంతో మంచానికి పరిమితమైన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలకు15 వేల రూపాయలు, అందిస్తున్న కూటమి ప్రభుత్వం, ప్రజారంగ పరిపాలన సాగిస్తుందని ప్రజలు తెలియజేస్తున్నారని, నేడు ఈ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న, తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీల నాయకులు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో,తెదేపా సీనియర్ నాయకులు రావి చిన్ని,అక్కిశెట్టి వెంకటేశ్వరరావు,తెనాలి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కోగంటి రోహిత్,28వ వార్డు టిడిపి అధ్యక్షుడు షేక్ రహంతుల్లా, ఇతర కూటమి నాయకులు, పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.



## సాహితీ సాంస్కృతిక మహోత్సవాల కరపత్రం ఆవిష్కరణ


తెనాలి మునిసిపాలిటీ, డిసెంబర్1, ప్రభాతవార్త: బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి సౌజన్యంతో,పట్టణంలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో డిసెంబర్ 6,7 తేదీల్లో తెలుగు సాహితీ సాంస్కృతిక మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చందు సుబ్బారావు తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎన్జీవో ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో, సాహితీ సాంస్కృతిక మహోత్సవాల ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడు తూ,సాంస్కృతిక మహోత్సవాల్లో తొలిరోజు, శనివారం ఉదయం తెలుగు భాషాసాహిత్యం,వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై కార్యక్రమాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్ మరియు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం



ప్రొఫెసర్ నారిసెట్టి వెంకట కృష్ణారావు మరియు అంతరిక్ష శాస్త్రవేత్త చందు సాంబశివరావు ప్రసంగిస్తారని,అనంతరం ఉభయ తెలుగు రాష్ట్రాల కవులతో కవి సమ్మేళనాన్ని నిర్వహణ,తదుపరి నంది పురస్కార గ్రహీత ఎం. సైదారావు బృందంచే జుగల్ బందీ సంగీత కార్యక్రమం, విజయవాడ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ బృందం చే భవన విజయం సాహితీరూపకం వంటి కార్యక్రమాలతోపాటు,అదే రోజు సాయంత్రం అంతర్జాతీయ రంగస్థలం గుమ్మడి గోపాలకృష్ణ కి విశిష్ట రంగస్థలం కళాపురస్కారం ప్రధానం మరియు బొల్లి ముంత శివరామకృష్ణ విశిష్ట సాహితీ పురస్కారాన్ని, ప్రజాసాహితీ పత్రిక సంపాదకులు కొత్తపల్లి రవిబాబు కి అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే రెండోరోజు ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు పట్టణానికి చెందిన కూచిపూడి కళాకారులచే మహానాట్య సమ్మేళనం, అనంతరం విభిన్న రంగాల్లో పనిచేస్తున్న చేతివృత్తులలో కొనసాగుతున్న,శ్రామిక యోధులకు కళారంగ ప్రముఖులకు,సత్కారం నిర్వహిస్తారని,సాయంత్రం ప్రముఖ సినిహాస్యనటులు కే. బ్రహ్మానందం కి బొల్లిముంత శివరామకృష్ణ జాతీయస్థాయి జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు బొల్లిముంత కృష్ణ,శ్రీ వైష్ణవి కాలేజ్ కరస్పాండెంట్ పాటిబండ్ల శ్రీనివాసరావు,చక్రాయపాలెం మాజీ సర్పంచ్ చందు నాగేశ్వరరావు,ఈవో హరిబాబు,ప్రజానాట్యమండలి అధ్యక్షులు రాందేవ్,బెన్హర్ పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## రోడ్డుపై ఆక్రమణలను తొలగించిన త్రీటౌన్ సిఐ సాంబశివరావు

తెనాలి మునిసిపాలిటీ, డిసెంబర్1, ప్రభాతవార్త: రోడ్డుకి ఇరువైపులా అక్రమణాలతో వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణదారుల వల్ల ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడుతుందని,తెలియజేస్తూ అందుకు బాధ్యులైన దుకాణదారుల ఆక్రమణలను తొలగింపు ప్రారంభించిన పట్టణ త్రీటౌన్ సిఐ ఎస్.



సాంబశివరావు.సోమవారం ఉదయాన్నే సిబ్బందితో సహా చేరుకొని, సీఐ సాంబశివరావు ఆక్రమణ తొలగింపు చేపట్టారు.ఈ సందర్భంగా కాలువలు దాటి రోడ్డు మీదకు వచ్చిన భారీ హోర్డింగ్ లు,కొన్ని షాపులను తొలగించి ఆటోలలో తరలించారు.గత 15 రోజులు ముందుగానే దుకాణదారులకి చెప్పినప్పటికీ వినిపించు కోక,పెడచెవిన పెట్టడంతో, విధిలేక ఈ నిర్ణయం తీసుకో వాల్సి వచ్చిందని సీఐ తెలిపారు. పట్టణంలో రోజురోజుకీ పెరిగిపోతున్న ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా,ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని,నిత్యం ఏదో ఒక చోట ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని,వాటి నియంత్రణలో భాగమే ఈ అనధికార రోడ్డు ఆక్రమణల తొలగింపు అని త్రీ టౌన్ సిఐ ఎస్.సాంబశివరావు తెలిపారు.

## నిరుపేదలను ఆదుకోవడమే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యం

తాడేపల్లి,డిసెంబర్ 1,(ప్రభాతవార్త) : రాష్ట్రంలో ఆపదలో ఉన్న నిరుపేదలను ఆదుకోవడమే లక్ష్యంగా నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని తెలుగుదేశం పార్టీ బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు



అన్నారు.సోమవారం ఉదయం 6గంటలకు మంగళగిరి 8,19,20,21 వార్డుల్లో ఎన్టీఆర్ భరోసా పేరిట అందిస్తున్న సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి నెల 1వ తేది తెల్లవారుజామున 5గంటల నుంచి ఎన్టీఆర్ భరోసా పేరిట 63లక్షల 6వేలకు పైగా వృద్ధాప్య వికలాంగ వితంతు ఒంటరి అనారోగ్యంతో మంచాన పడిన బాధితులకు ఈ విధంగా రూ.4000ల నుండి రూ.15000ల చొప్పున దాదాపు 33వేల కోట్ల రూపాయలను పింఛన్లు రూపేణా లబ్దిదారులకు అందజేస్తున్నారు.ఎన్ని కష్టాలు ఎదురైనా పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.కార్యక్రమంలో కన్వీనర్లు బట్టు సదానంద శాస్త్రి,తిరువీధుల సతీష్,ఒడిశా నరేష్,కారంపూడి అంకమ్మరావు,బట్టు రమేష్,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎస్ఆర్ఎంలో ఐఐసి ప్రాంతీయ సమ్మేళనం

మంగళగిరి డిసెంబర్ 1, ప్రభాతవార్త : ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో మంగళవారం ప్రతిష్టాత్మకంగా జరిగే ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ 2025 ప్రాంతీయ సమ్మేళనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ పరిధిలోని ఉన్నత విద్యాశాఖ మాజీ కార్యదర్శి డాక్టర్ ఆర్ సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా హాజరై సమ్మేళనాన్ని ప్రారంభించనున్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ గ్రూప్ సీఈఓ మరియు ఐఏఎస్ అధికారిణి పి ధాత్రి రెడ్డి, ఎన్ ఆర్ డీ సీ సీనియర్ రీజనల్ మేనేజర్ డాక్టర్ బిజయ్



కుమార్ సాహూ, అమరావతిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ముఖ్య కార్యదర్శి జి కృష్ణన్ లు విశిష్ట అతిథులుగా సమ్మేళనానికి హాజరవుతున్నారు. విద్యార్థుల అధ్యాపకుల్లో ఆవిష్కరణ మరియు నూతన పరిశ్రమల వ్యవస్థాపక సంస్కృతిని పెంపొందించడం కోసం అవసరమైన అవగాహన కార్యక్రమాలను సమ్మేళనంలో సమీక్షి ంచనున్నారు. దేశం నలుమూలల నుంచి సుమారు 150 మంది ఆవిష్కర్తలు అంకుర సంస్థల విచ్చేస్తున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు. సమ్మేళనంలో భాగంగా పరిశోధనా రంగంలో ఉన్న విద్యార్థులు అధ్యాపకుల మధ్య బృంద చర్చలు ఓపెన్ హౌస్ కార్యక్రమాలు, అంకుర సంస్థల ప్రదర్శనలు, నూతన ఐడియాల వ్యక్తీకరణ, పోస్టర్ ప్రజెంటేషన్లు ఉంటాయని పేర్కొన్నారు.

## సాయిబాబా మందిరంలో సామూహిక భగవద్గీత పారాయణం

మంగళగిరి డిసెంబర్ 1, ప్రభాతవార్త : పెదవడ్లపూడి భగవాన్ శ్రీ సత్య షిరిడి బాబా సాయిబాబా మందిరంలో గీతా జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం సామూహిక భగవద్గీత





పారాయణం కార్యక్రమం జరిగింది. 50 మంది మహిళ భక్తులు పాల్గొని పారాయణం చేశారు. అనంతరం మందిరం ప్రతినిధి పాతూరి సుధారాణి మాట్లాడారు. కృష్ణం వందే జగద్గురుమ్ అన్నారని, అర్జునుని ద్వారా కృష్ణుడు మానవాళికి భగవద్గీతను అందించారన్నారు. గ్రంధాలు మునులు, ఋషులు రాసినవి అని, భగవద్గీత మాత్రం కృష్ణ భగవానుని నోటి నుండి ప్రపంచం మొత్తం సుఖశాంతులతో ఉండాలని ఇచ్చిన సందేశమన్నారు. గీతా జయంతి రోజున కృష్ణ భగవానుని తలుచుకుంటే, స్వామి ఆశీస్సులు ఉంటాయని గీతా పారాయణం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రపంచంలో ఏ సమస్య అయినా పరిష్కారం భగవద్గీతలో దొరుకుతుందని కులమతాలకు అతీతంగా నమ్ముతారన్నారు. ఈ కార్యక్రమంలో మందిరం నిర్వాహకులు పాతూరి శ్రీనివాసరావు, శ్రీమతి రాధిక దంపతులు, పలువురు సాయి భక్త బృందం ప్రతినిధులు పాల్గొన్నారు. మందిరం చైర్మన్ పాతూరి నాగభూషణం పర్యవేక్షి ంచారు.

## విజేతలకు నగదు బహుమతి అందజేత

చెరుకుపల్లి , డిసెంబర్ 1 ప్రభాతవార్త : మండలంలోని ఆరంబాక గ్రామంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి నాటు బండి పూటీ ఎడ్ల పోటీలు ఆదివారం ఘనంగా ముగిసాయి. గ్రామ దేవతలు శ్రీ పోలేరమ్మ, నెల్లెమ్మ, అంకమ్మ తల్లి ఆశీస్సులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు మూలల నుండి పోటీదారులు తమ ఎడ్లతో పాల్గొన్నారు. మొదటి రోజు శుక్రవారం 24 జతల ఎడ్లు పోటీల్లో పాల్గొనగా రెండవ రోజు శనివారం 14 జతల ఎడ్ల పోటీల్లో



పాల్గొన్నాయి. చివరి రోజు ఆదివారం నాడు ఎనిమిది జతల ఎడ్లు పోటీల్లో పాల్గొనగా మూడు రోజులుగా ఈ ప్రాంతం రైతులతో కలకలాడింది. నేడు వ్యవసాయంలో ప్రతి చిన్న పనికి ఆధునిక యంత్రాలు చోటు చేసుకున్నప్పటికీ కొందరు రైతులు మాత్రం ఇప్పటికీ తరతరాలుగా ఎడ్లను పోషించే విధానాలను మాత్రం కొనసాగిస్తూనే ఉండటం అభినందనీయం. ఇటువంటి తరుణంలో రాష్ట్రస్థాయి ఎడ్ల బండి పోటీలు నిర్వహణ అంటేనే నలుమూలల ప్రాంతాల్లో ఉన్న రైతులు లో ఒక రకమైనటువంటి ఉత్సాహం నెలకొంటుంది అనటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఇందుకు ఉదాహరణ మూడు రోజులుగా మండలంలో నిర్వహించిన ఎడ్ల బండి పోటీలే రైతుల్లో ఉత్సాహానికి ఒక నిదర్శనంగా కనిపిస్తుంది. ఇటువంటి రైతుల ఉత్సాహానికి దాతలు కూడా తోడైతే వారి ఆనందానికి అవధులు ఉండవు. పోటీలను ప్రోత్సహించేందుకు గ్రామం, చుట్టుపక్కల ప్రాంతాల వ్యవసాయ, వ్యవసాయేతర వ్యక్తులు సైతం తమ వంతు సహాయ సహకారాలు అందించడం వారి ఔన్నత్యానికి అభినందనలు చెప్పాలి. రాష్ట్రంలోని నెల్లూరు నుండి ఉభయగోదావరి జిల్లాల వరకు మొత్తం 46 జతలు ఎడ్లు ఈ పోటీల్లో పాల్గొనగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 22 జతలకు నిర్వాహకులు నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఎడ్లు పెంపకం దారులు మాట్లాడుతూ ఇటువంటి ఎడ్ల పోటీలు తమలో మరింత ఉత్సాహాన్ని నింపడమే కాకుండా పశువుల పెంపకాన్ని ప్రోత్సహించినట్లు అవుతుందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం కూడా ఇటువంటి పోటీలను మరింత అధికారికంగా నిర్వహిస్తే మరిన్ని మేలు జాతి పశువులను పెంచే అవకాశం తమకు లభిస్తుందని పలువురు రైతులు వ్యక్తం చేశారు.

## వాహనదారులు తగిన సూచనలు పాటించాలి

చెరుకుపల్లి , డిసెంబర్ 1 ప్రభాతవార్త : వాహనాలు నడిపే సమయంలో వాహనదారులు తగిన సూచనలు తప్పక పాటించాలని ఎస్సై అనిల్ కుమార్ అన్నారు. సోమవారం ఆరంబాక హరిజనవాడలో స్థానికులకు అవగాహన కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై అనిల్ కుమార్ మాట్లాడుతూ మోటారు సైకిళ్లు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వరాదని, మైనర్లు వాహనాలు నడపకూడదని ఆయన తెలిపారు. అదేవిధంగా




వాహనాలు నడిపే వ్యక్తులు విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ,ఎప్పటికప్పుడు వాహన ధ్రువీకరణ పత్రాలను అధికారికంగా కలిగి ఉండాలని ఆయన సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోక తప్పదని ఆయన తెలిపారు. అదేవిధంగా వాట్సప్ లో అనధికారికంగా లేక ప్రలోభ పెట్టే విధంగా వస్తున్న వాట్సాప్ గ్రూపులను అనుసరించకూడదని ,వాట్సాప్ లో వచ్చే అనధికార లింకులను ఓపెన్ చేయకూడదని ఇలా చేసినట్లయితే తమ బ్యాంక్ ఖాతాల్లో ఉన్న నగదును కోల్పోయే పరిస్థితులు ఉన్నాయని ఆయన తెలిపారు. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులు గాని లేదా స్థానిక పోలీస్ స్టేషన్లో గాని వెంటనే సమాచారాన్ని అందజేసి నగదు బదిలీ నష్టాలను నివారించుకోవాలని ఆయన సూచించారు.

## పింఛన్లు పంపిణీ



కాకుమాను డిసెంబర్ 1(ప్రభాతవార్త): మండల కేంద్రం కాకుమాను గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద నూతన వితంతువు యన్ టి ఆర్ పింఛన్లు పంపిణీ గ్రామ ఇన్ చార్జ్ సర్పంచ్ బోడపాటి. శివప్రసాద్, మండల టిడిపి అధ్యక్షులు మామిళ్ళపల్లి రామ్ గోపాల్, గ్రామటిడిపి అధ్యక్షులు పూర్ణయ్య, కృష్ణ కెనాల్ వైస్ ప్రసిడెంట్ సునీల్ కుమార్ లు సోమవారం పంపిణీ చేశారు. ఈ పంపిణీ లో టి డి పి నాయకులు పింఛను దారులు పాల్గొన్నారు.

## కాకుమాను యన్ జెడ్ పి హెచ్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ ప్రదర్శన



కాకుమాను డిసెంబర్ 1(ప్రభాతవార్త): స్థానిక నన్నపనేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మరో గౌరవం దక్కిందని మండల విద్యాశాఖధికారి కె యఫ్ కెన్నడీ సోమవారం తెలిపారు. ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కె. విలియం బాబు, పి. ప్రియాంక, ఎం. కీర్తన, కౌషల్ జిల్లా స్థాయిలో జరిగిన పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ఎంపిక అయ్యారు.వారి విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర వీర వెంకట రావు, ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల కృషి, గురువుల మార్గదర్శకత, తల్లిదండ్రుల సహకారం ఈ విజయానికి ప్రధాన కారణమని తెలిపారు.రాష్ట్ర స్థాయిలో కూడా పాఠశాల మరింత ప్రతిష్టను సంపాదిస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఒక అర్జీ



కాకుమాను డిసెంబర్ 1(ప్రభాత వార్త): స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఒక అర్జీ అందినట్లు తహసిల్దార్ బి. వెంకటస్వామి మీడియాకు తెలిపారు. అర్జీను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపి సత్వరమే అర్జీను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్. హెచ్ఐవిపై అవగాహన ర్యాలీ

పెదనందిపాడు. డిసెంబర్ 1, (ప్రభాతవార్త) పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల లో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం హెచ్ ఐ వి. ఎయిడ్స్ పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.జి వీర రాఘవయ్య, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్.పి. శ్రీనివాస్, సి. లక్ష్మణ రెడ్డి, వి.




శ్రీనివాస మూర్తి, మరియు అధ్యాపకులు విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ కోసం తీసుకోనాలసిన జాగ్రత్తలు గురించి వివరించినారు. ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు. కళాశాల అధ్యాపక అధ్యాపకేత సిబ్బంది పాల్గొన్నారు.

## భగవద్గీత ఒకసామాజిక,రాజకీయ,ఆర్థిక,మానసిక శాస్త్ర గ్రంథం

గుంటూరు కల్చరల్,డిసెంబర్ 01,ప్రభాతవార్త : భగవద్గీత ఒకసామాజిక,రాజకీయ,ఆర్థిక,మానసిక శాస్త్ర గ్రంధమని మనం ప్రయాణించే దారులు ఎలా ఉన్నా ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా జీవన పయనాన్ని ఎలా విజయవంతంగా కొనసాగించాలి అనే దానిగురించి స్పష్టంగా చెపే ్ప మహాద్భుత గ్రంధమని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన గీతాజయంతి కార్యక్రమంలో ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కె.సురేష్‌కుమార్ అన్నారు.ఇంద్రియ భోగ రక్షణ భంగురమనీ ఆవేశాలను,ఆవేదనను మనిషి వీలున్నంతగా నిగ్రహించుకోవడం అవసరమని గీత చెబుతుందన్నారు.ఈ సందర్భంగా భగవద్గీత ధారణలో రెండు బంగారు పతకాలు సాధించిన కోటా రామలక్ష్మిని,వారి తల్లిని సంస్థ సభ్యులు ఘనగా సత్కరించారు.కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి,సదాశివమ్,తదితరులు ప్రసంగించారు.

## ఎయిడ్స్ వ్యాధి పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలి

అమరావతి, డిసెంబర్ 1ప్రభాతవార్త: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అమరావతి పట్టణంలో గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంద సంస్థ మరియు అమరావతి కో. లోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సత్తనపల్లి రోడ్ లోని అంబేద్కర్ విగ్రహం దగ్గర నుండి భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీని అమరావతి కో లోకేటెడ్ వైద్యాధికారి ఎస్ మోనిక జండా ఊపి ర్యాలీ ని ప్రారంభించారు. అమరావతి పురవీధుల నుండి గాంధీ బొమ్మ సెంటర్ వరకు కొనసాగింది




అనంతరం అంబేద్కర్ విగ్రహం దగ్గర ఏర్పాటు చేసిన మానవహారంలో డాక్టర్ మోనిక మాట్లాడుతూ హెచ్ఐవి బాధితుల కొరకు ప్రభుత్వ వైద్యశాలలో అందిస్తున్న ఐ సి టి సి, ఏ ఆర్ టి సేవలను గురించి క్షేత్రస్థాయి వరకు తెలియజేయాలన్నారు. సిస్టర్ యాంటో మాట్లాడుతూ హెచ్ఐవి బాధితులు క్రమం తప్పకుండా మందులు వాడుకుంటే ఎక్కువ కాలం జీవించే అవకాశం ఉందన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి కే లక్ష్మీ ్మ మనోహర్ , సిఐటియు నాయకులు సూరిబాబు , లక్ష్మణ్, ఎం పి హెచ్ ఎ లు మరియు సిహెచ్ఓలు గుడ్ షెఫర్డ్ సిస్టర్స్ డియానా ,పావని ,స్మిత సంస్థ సిబ్బంది ,ఆశ వర్కర్లు ,హెల్త్ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన హిందూ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

గుంటూరు విద్య డిసెంబర్ 1 ప్రభాతవార్త: హిందూ ఫార్మసీ కళాశాల జాతీయ సేవా సంస్థ తరఫున నవంబర్ 24వ తేదీ నుండి 30వ తేదీ వరకు జొన్నలగడ్డ గ్రామంలో వివిధ సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి నాగభూషణం తెలిపారు .ఈ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం, సీజనల్ మార్పుతో వచ్చే ఆరోగ్య సమస్యలు, వాటి నివారణ చికిత్స విధానం, ప్లాస్టిక్ సంచులు వాడటం వల్ల కలిగే దుష్ప్రభావాలు, చిన్నపిల్లలకు వేయించవలసిన వివిధ టీకాలు వాటి ప్రాముఖ్యత గురించి ప్రజలను అవగాహన పరిచినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్లాంటేషన్ కార్యక్రమం పెద్ద ఎత్తు నిర్వహించామని పేర్కొన్నారు. ఈ



కార్యక్రమంలో యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ దివ్య తేజోమూర్తి జాతీయ సేవా సంస్థ ఆశయాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్ మధుసూదన్ రావు లు కళాశాల విద్యార్థులకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఫార్మా డి డైరెక్టర్ ,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి సీతారామయ్య ,ఫార్మసీ ప్రాక్టీస్ డిపార్ట్మెంట్ హెచ్ ఓ డి డాక్టర్ ఎన్ హేమ కుమారి, అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఎయిడ్స్, హెచ్ఐవిపై అవగాహన

గుంటూరు విద్య, డిసెంబర్ 1, ప్రభాతవార్త: గుంటూరు స్థానిక సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకము ఆధ్వర్యంలో "ప్రపంచ ఎయిడ్స్ డే" ని పురస్కరించుకొని విద్యార్థులకు వక్తృత్వ మరియు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ మహంకాళి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, ఎన్ఎస్ఎస్ అధికారులు ఏ. శ్రీధర్



మరియు వై. చంద్రశేఖర్లు కార్యక్రమాన్ని నడిపించారు. ముందుగా ప్రిన్సిపల్ మహంకాళి శ్రీనివాసరావు మాట్లాడుతూ హెచ్ఐవి అనేది "హ్యూమన్ ఇమ్యునో డెఫిషియన్సీ వైరస్" అని, ఇది శరీరంలోని రోగనిరోధక వ్యవస్థను నెమ్మదిగా బలహీన పరుస్తుందని అన్నారు. ఎయిడ్స్ అనేది హెచ్ఐవి ఇన్ఫెక్షన్ యొక్క చివరిదశ అని అన్నారు. ఈ వ్యాధికి నివారణ లేనప్పటికీ "తిళిగి" ఏ ఆర్ టి అనే చికిత్సతో దీర్ఘకాలం ఆరోగ్యంగా జీవించవచ్చునని అన్నారు. వైరస్ సోకిన సూదులు, సిరంజీలు ఉపయోగించడం, రక్తమార్పిడి ద్వారా కూడా వ్యాపిస్తుందని అన్నారు. రోగనిరోధక శక్తి తగ్గేకొద్దీ ఇన్ఫెక్షన్లు మరియు క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉన్నదని, కాబట్టి తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. శ్రీధర్ మాట్లాడుతూ హెచ్ఐవి గురించి మీకు ఆందోళన ఉంటే లేదా అనుమానం ఉంటే వెంటనే డాక్టర్ను సంప్రదించి తగు పరీక్షలు చేయించుకొని నిర్ధారించుకోవాలని అన్నారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ హిప్ లక్షణాలుగా తరచూ జ్వరం, గొంతు నొప్పి, అలసట చెందడం దద్దుర్లు, కండరాల నొప్పులు, వాపులు మొదలగు లక్షణాలు కనబడిన వెంటనే అశ్రద్ధ చేయక, వెంటనే వైద్యుడిని సంప్రదించాలని అన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన వక్తృత్వ మరియు వ్యాసరచన పోటీలలో విజేతలకు ప్రిన్సిపల్ . ఎం శ్రీనివాసరావు బహుమతులు అందించారు. అధ్యాపకులు రాజేశ్వరి ఇందిరా, కృష్ణ, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## నోబుల్ టీచర్స్ అసోసియేషన్‌ను జిల్లాలో బలోపేతం చేయండి

గుంటూరు విద్య, డిసెంబర్ 1, ప్రభాతవార్త: : నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సంఘాన్ని ప్రకాశం జిల్లాలో బలోపేతం చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు పిలుపు నిచ్చారు. నోబెల్ టీచర్స్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా కార్యవర్గ సమావేశం ఎన్టీఆర్ భవన్ అద్దంకి రోడ్ నందు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నడిపినేని వెంకట్రావు అధ్యక్షతన జరిగినది. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాస్ రాజు మాట్లాడుతూ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్రంలో ఒక బలమైన సంఘంగా ఎదగటానికి పూర్తి అవకాశం ఉందని , ఈ సంవత్సరలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ద్వారా అనేక సమస్యలు పరిష్కారం జరిగిందని, ముఖ్యంగా బదిలీలు చట్టం రూపొందించడంలో, లాంగ్వేజ్ పండిట్ల అప్ గ్రేడేషన్ చేయడంలో, అంతర్ జిల్లాలకు బదిలీ చేయడంలో ఇంకా అనేక సమస్యలు పరిష్కారం చేయడం జరిగిందని




తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో 25 జిల్లాల్లో ఎన్ టి ఏ జిల్లా శాఖలు ఏర్పాటు చేయడం జరిగింది. టెట్ అర్హత పరీక్ష విషయంలో ఉపాధ్యాయుల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం నిర్ణయం ఉపాధ్యాయులకు అనుకూలంగా ఉంటుందని, ఉపాధ్యాయులకు రావాల్సిన అన్ని ఆర్థిక ప్రయోజనాలు ఈ ప్రభుత్వం చెల్లించడానికి సుముఖంగా ఉందని, రాబోయే రోజుల్లో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఒక బలమైన సంఘం ఎదగడానికి అవకాశం ఉందని తెలిపారు. అనంతరం ప్రకాశం జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లా గౌరవ అధ్యక్షులుగా బోడపాటి హనుమంతరావు జిల్లా అధ్యక్షుడిగా ఆళ్ల రమేష్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మేడా రామలింగయ్య ఆర్థిక కార్యదర్శి గుల్లా మధు, అసోసియేట్ అధ్యక్షులుగా మద్ది రెడ్డి గోపాల్ రెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శిగా కంద్రా మల్లికార్జునరావు లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతన జిల్లా కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అభినందించడం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర సిపిఎస్ కన్వీనర్ గద్దె రామ కోటేశ్వరరావు, రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ షేక్ మొజాయిద్దీన్ గుంటూరు జిల్లా అధ్యక్షులు పి సాయి విశ్వనాథ్, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కూరపాటి రాజా ప్రకాశం జిల్లాలోని వివిధ మండలాల నుంచి నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

## మేనిఫెస్టో అమలులో 'కూటమి' ప్రభుత్వాన్ని దేశానికే అదర్శంగా నిలిపిన సిఎం చంద్రబాబు : ప్రత్తిపాటి

యడ్లపాడు, డిసెంబర్ 1, ప్రభాతవార్త : పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు పట్టువదలని విక్రమార్కుల్లా పనిచేస్తున్నారని, విశాఖ సీఐఐ సమ్మిట్ ద్వారా అకర్షించిన 13.25లక్షల కోట్ల పెట్టుబడులతో కలిగే ప్రయోజనాల్ని ప్రజలకు అందించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారని మాజీ మంత్రి, శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. మండల





పరిధిలోని కారుచోల గ్రామంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల భవనం మరమ్మత్తుల నిమిత్తం 6లక్షలతో చేపట్టిన పనులకు శంకుస్థాపనగావించారు. తదుపరి పేదల ఇళ్లకు వెళ్లి లబ్దిదారులకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను అందించారు. ప్రభుత్వ పథకాలపై వారికి అవగాహన కలుగజేసారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటుచేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ సామాజిక పింఛన్లలో భాగంగా 55వేల కోట్ల సాయం పేదలకు అందించడం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు రికార్డు సృష్టించాడని, పేదల పక్షపాత ప్రభుత్వం పనితీరు ఎలా ఉంటుందో దేశానికి చూపించాడని తెలిపారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జ్ తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మండల అధ్యక్షుడు కామినేని సాయిబాబు, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, టీడీపీ జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, కందిమల్ల రఘురామారావు, మద్దినేని సుబ్బారావు, షేక్ మస్తాన్ వలి, ముల్లా కరీముల్లా, గ్రామ నాయకులు, తహశీల్దార్ విజయశ్రీ, ఎంపీడీవో వి హేమలత తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక వైద్యశాలలో డిఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

యడ్లపాడు, డిసెంబర్ 1, ప్రభాతవార్త : యడ్లపాడు ప్రాథమిక అరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య అరోగ్య శాఖాధికారి డాక్టర్ బీ రవి సోమవారం అకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం పరిధిలో నిర్మాణంలో ఉన్న కొత్త బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనం పనుల పురోగతిని, ప్రాథమిక



అరోగ్య కేంద్రాన్ని అయన పరిశీలించారు. దిత్వా తుఫాను ప్రభావం నేపథ్యంలో గర్భిణీ స్త్రీలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని, వ్యాదులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అదేశించారు. వైద్యశాలలోని నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్‌లు, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్, ఓపి సేవల అమలు, రికార్డులు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు అందజేసారు. ఈ సందర్భంగా అయన వివరిస్తూ ఈ నెల 7న నియోజకవర్గ పరిధిలో వినికిడి లోపం ఉన్నవారి వివరాలు సేకరించి ప్రత్తిపాటి గార్డెన్‌లో జరిగే ప్రత్యేక వైద్య శిబిరానికి తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా డిసెంబర్ 21వ తేదిన జరిగే పల్స్ పోలియో కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేయాలని అదేశించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు పి భరద్వాజ్, సూపర్‌వైజర్ వి రాజశేఖర్, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

## భగవద్గీతను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలి

పొన్నూరు, డిసెంబర్ 1,ప్రభాతవార్త: ఫలితాల గురించి ఆలోచించకుండా మన విధులను(కర్మలను) చేయడమే ముఖ్యమని భగద్గీతలో కృష్ణుడు అర్జునుడికి చెప్పాడని విశ్వహిందూ పరిషత్ ప్రముఖ్, విశ్రాంత తెలుగు పండితులు పరాశరం శేషుకుమారి అన్నారు. స్థానిక సాక్షి శ్రీ భావనారాయణస్వామి దేవాలయంలో సోమవారం హైందవి వారి ఆధ్వర్యంలో భగవద్గీత కోటి శ్లోక పారాయణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శేషుకుమారి మాట్లాడుతూ ఈ పారాయణ ఈ నెల 15వ తేదీ వరకు పక్షం రోజులపాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. జీవితంలో ఎదురయ్యే దు:ఖాలు, సందిగ్ధతల నుండి బయటపడేందుకు,



భగవంతుని ఆత్మను, ప్రకృతిని అర్థం చేసుకోవడానికి భగవద్గీత ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.ఫలాపేక్ష లేకుండా చేసే కర్మల ద్వారా మోక్షం పొందవచ్చని కర్మయోగం చెప్తుందన్నారు. ఆత్మ శాశ్వితమైనదని, నాశనమయినది కాదని, శరీరం నశించినా, ఆత భిన్నమైన లోకాల్లోకి మారుతుందని భగవద్గీత ద్వారా తెలుస్తుందన్నారు. భగవంతుడిని భక్తితో ఆరాధించడం వల్ల ముక్తి లభిస్తుందన్నారు.జ్ఞాన యోగం ద్వారా తృజ్ఞానాన్ని పొందవచ్చని భగవద్గీతలో నిరూపితమైందన్నారు.మహాభారతంలో భాగంగా ఉన్నప్పటికీ, భగవద్గీత ఒక ప్రత్యేకమైన గ్రంథంగా పరిగణించబడుతుందన్నారు.ప్రతి ఒక్కరూ భగవద్గీత సారాంశాన్ని తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మానవుడు ఏవిధంగా జీవించాలో....ఏ విధంగా జీవించకూడదో అనే విషయాలు భగవద్గీతలో చెప్పబడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ విష్ణుసహస్రనామపారాయణసంఘం మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార ్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అసిస్టెంట్ కమిషనర్ గాండ్ల కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

## అవసరార్థులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలి



పొన్నూరు, డిసెంబర్ 1,ప్రభాతవార్త: అవసరార్థులను, అనాథలను, దిక్కులేనివారికి చేయూత నిచ్చేందుకు దాతలు ముందుకు రావాలని అర్బన్ సిఐ లావూరి వీరానాయక్ పిలుపునిచ్చారు. హెల్పింగ్ హ్యాండ్ ఆధ్వర్యంలో ఈ నెల 7న జరిగే వార్షికోత్సవానికి సంబంధించిన కరపత్రాన్ని ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐ వీరానాయక్ మాట్లాడుతూ అనాథలను అక్కున చేర్చుకునేందుకు హెల్పింగ్ హ్యాండ్ చేస్తున్న కృషిని కొనియాడారు. హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకుడు దొప్పలపూడి రాజు మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన వడ్డిముక్కల రోడ్డులోని శాంతోమ్ కరుణాలయంలో జరిగే ప్రేమ విందు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కరపత్రాల ఆవిష్కరణంలో చల్లా వెంకట్రామిరెడ్డి, శివరామిరెడ్డి, బాలకృష్ణారెడ్డి, అంబటి పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## పండిత-పామర జనరంజకం భోగి మణిహార గ్రంథం

పొన్నూరు, డిసెంబర్ 1,ప్రభాతవార్త: పండిత-పామర జనరంజకం భోగి మణిహార శతక గ్రంథమని శ్రీ భావనారాయణస్వామి సంస్కృత కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు డాక్టర్ వేదాల వెంకట సీతారామాచార్యులు అన్నారు. స్థానిక దేవాలయ ప్రాంగణంలో సంస్కృత కళాశాలకు చెందిన పూర్వవిద్యార్థి నాదెళ్ళ భార్గవ రామచంద్రన్ రచించిన భోగి మణిహార శతక గ్రంథాన్ని సీతారామాచార్యులు చేతులు మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీతారామాచార్యులు మాట్లాడుతూ అలతి...అలతి పదాలతో సామాన్యులకు కూడా అర్థమయ్యే రీతిలో గ్రంథాన్ని రచించిన భార్గవ్ తన మనసులోని భావాలను, లోకరీతిని ఆవిష్కరించారన్నారు.సమాజాన్ని చైతన్యపరచడంలో పూర్వ కాలం నుంచి కూడా శతకాలు ప్రత్యేక భూమిక పోషిస్తున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. ఈ శతకం భక్తిలో ఉన్న మాధుర్యాన్ని, భక్తుని హృదయంలో రాగద్వేషాలు, కోపతాపాలు,



మాలిన్యాలు ఉండవన్న విషయాన్ని శతకంలో పద్యాల ద్వారా తెలిపారన్నారు.భక్తుని యొక్క హృదయం శుద్ధ స్వచ్ఛంగా ఉంటుందని, భగవంతునితో తన్మయమై ఉంటుదని, అదే మధురానుభూతి అని శతకం ద్వారా కవి భావన తెలుస్తుందన్నారు. మరో అతిథి బ్రాహ్మణ మహాసభ పూర్వాధ్యక్షుడు పివిఎస్ఎస్వి ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి, సమాజాభివృద్ధికి భాషా పండితులు, కవులు చేస్తున్న సేవలను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఆగమశాస్త్ర నిపుణులు, విశ్రాంత తెలుగుపండితులు నాగలింగం హరిహరపంత్ శివాచార్య మాట్లాడుతూ భోగిమణిహార శతకం సమాజానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సమాజంలో ఉన్న పోకడలను కవి శతకరూపంలో ఆవిష్కరించారన్నారు. కవి భార్గవ్ పోతన, దూర్జటి,నన్నయ వంటి కవులను కూడా అనుసరించి పద్యాలను అల్లినట్లుగా తెలుస్తుందన్నారు. శతకాలు సమాజ చైతన్యానికి దర్పణంగా నిలుస్తాయన్నారు. గ్రంథకర్త భార్గవ్ రామచంద్రన్ మాట్లాడుతూ తనకు చిన్నప్పటి నుంచి పద్య రచన చేయాలనే కుతూలం ఉండేదని, ఆ శంకరుడే తనచేత ఈ గ్రంథాన్ని వ్రాయించారని చెప్పారు. తనకు పరమేశ్వరుడంటే అతమితమైన భక్తి అని, ఆయనే తనకు ఈ శతక ప్రేరణ అని చెప్పారు. విశ్రాంత తెలుగుపండితులు పిన్నమనేని గాంధీ, ఎం.కృష్ణకిషోర్, దావులూరి రాజేంద్రప్రసాద్, పరాశరం శేషుకుమారి,ఆర్టీసి వెంకట్రావు, నాగలింగం ఛందో బసవేశ్వర్ తదితరులు ప్రసంగించారు. అతిథులను ఘనంగా సత్కరించారు.

## జీఆర్ఎస్‌కు ఆరు అర్జీలు



పొన్నూరు, డిసెంబర్ 1,ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్)కు వివిధ సమస్యలకు సంబంధించి ఆరు అర్జీలు అందినట్లు తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ తెలిపారు. అందులో రెవెన్యూకు సంబంధించి-1, పంచాయితీరాజ్‌కు సంబంధించి-1,మునిసిపాలిటీకి సంబంధించి-2అర్జీలు, సోషల్ వెల్ఫేర్‌కు సంబంధించి-1,ఆరోగ్యశాఖకు సంబంధించి-1 అందినట్లు చెప్పారు. పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను సంబంధిత శాఖలకు పరిష్కారం నిమిత్తం పంపినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ అడపాల సత్యనారాయణ, ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, డిప్యూటీ ఎంపిడిఓ వేముల శ్రీనివాసరావు, వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

2-12Pg5 9_2-12Pg5.qxd 01/Dec/25 10:22 PM Page 1





# శ్రీలంకను కుదిపేసిన 'దిత్వా'

## 334కు పెరిగిన మృతులు, 370 మంది గల్లంతు



**కొలంబో, డిసెంబరు 1:** దిత్వా తుఫాన్ శ్రీలంకను కుదిపేస్తున్నది. ఇళ్లు కూలిపోవడం, పట్టణాలు జలమయమవడం, కొండచరియలు విరిగిపడటంతో వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల రోడ్డు కొట్టుకుపోవడంతో జనజీవనం స్తంభించింది. శ్రీలంక విపత్తు నిర్వహణ కేంద్రం ఆదివారం సాయంత్రం 6 గంటలకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం.. 334 మంది మరణించగా, 370 మంది ఆచూకీ గల్లంతయింది.

ఈ సంక్షోభ సమయంలో భారతదేశం 'ఆపరేషన్ సాగర్ బంధు' పేరుతో సహాయపడుతున్నది. జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్), భారత వాయుసేన ప్రజల ప్రాణాలను కాపాడుతున్నాయి. భారత ప్రభుత్వం శ్రీలంకకు 21 టన్నుల మానవతా సాయాన్ని అందజేసింది. విశాఖపట్నం నుంచి బయల్దేరిన ఐఎన్ఎస్ సుకన్య త్వరలోనే మరింత మానవతా సాయాన్ని అందించబోతున్నది. కాగా, దిత్వా తుఫాన్ తీవ్ర వాయుగుండంగా బలహీనపడిందని భారత వాతావరణ విభాగం తెలిపింది. తుఫాన్ కారణంగా తమిళనాడులో ముగ్గురు మృతి చెందారు.

**ఇండొనేసియాలో 442కు చేరిన మృతుల సంఖ్య**

**సుమత్ర:** సెనార్ తుఫాన్‌తో ఇండోనేసియా అతలాకులమైంది. ఆ తుఫాన్ వల్ల సుమారు 442 మంది మరణించారు. భారీ వరదలు పెను నష్టాన్ని కలిగించాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. థాయ్‌లాండ్, మలేసియాలో కూడా విధ్వంసం జరిగింది. థాయ్‌లో సుమారు 170 మంది మరణించారు. సైనార్ తుఫాన్‌తో దెబ్బతిన్న ఇండోనేసియాలో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్నది. సుమత్ర దీవుల్లో నష్టం భారీగా ఉన్నది. వేలాది మందికి ఆహారం అందడం లేదు. కొన్ని చోట్ల వరదల వల్ల బిల్డింగ్, ఇళ్లు కొట్టుకుపోయాయి. ఫిలిప్పీన్స్, శ్రీలంకతో పాటు దక్షిణాసియా దేశాల్లో వచ్చిన తుఫాన్ల వల్ల ఈ నెలలోనే 900 మంది మృతి చెందినట్లు తెలుస్తోంది.

కేవలం నార్త్ సుమత్ర దీవుల్లో వరదల వల్ల సుమారు 200 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 200 మంది గల్లంతయ్యారు. డ్యామేజ్ చాలా తీవ్రంగా ఉన్నట్లు శాటిలైట్ చిత్రాల ద్వారా తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో మొబైల్ సిగ్నల్ కూడా అందడం లేదు. దీంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆహారం కోసం అలమటిస్తున్నారు. సైనార్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవ్ సుబియాంటో పర్యటిస్తున్నారు.



## కేరళ సిఎంకు ఇడి షాక్

### 'ఫెమా' ఉల్లంఘన కేసు

**తిరువనంతపురం, డిసెంబరు 1:** కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కు ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గట్టి షాకిచ్చింది. విజయన్‌తో పాటు ఆయన వ్యక్తిగత కార్యదర్శి అబ్రహం, ఆర్థిక శాఖ మాజీ మంత్రి థామస్ ఐజాక్ కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. విదేశీ మారకపు నిర్వహణ చట్టం (ఫెమా) నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి ఈ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం నిధులు సమీకరించే ప్రభుత్వ సంస్థ కేరళ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ బోర్డ్ (కేఐఐఎఫ్‌బీ) 2019లో జారీ చేసిన మసాలా బాండ్‌ల వ్యవహారంలో ఈ నోటీసులు జారీ చేసింది. నిధుల సేకరణలో ఫెమా మార్గదర్శకాలను పాటించలేదన్న ఈడీ ఆరోపణల నేపథ్యంలో ఈ వ్యవహారంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేరళలోని మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు నిధులు సమకూర్చడానికి కేఐఐఎఫ్ బీ 2019 లో లండన్ స్టాక్ ఎక్స్చేంజ్‌లో సుమారు రూ.2,150 కోట్ల విలువైన మసాలా బాండ్ లను జారీ చేసింది. ఈ నిధుల సమీకరణ మరియు వాటి వినియోగంలో ఫెమా నిబంధనలను పాటించలేదని, ఆర్బీఐ మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరించిందనేది ప్రధాన ఆరోపణ. రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన కేఐఐఎఫ్‌బీ కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశీ మార్కెట్ల నుండి నేరుగా రుణాలు తీసుకోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 293(1)కి విరుద్ధమని కాగ్ తన నివేదికలో పేర్కొంది. అయితే, కేఐఐఎఫ్‌బీ తన కార్యకలాపాలు చట్టబద్ధంగా, ఆర్బీఐ మార్గదర్శకాలకు లోబడి ఉన్నాయని, ఈ అప్పులు రాష్ట్ర బడ్జెట్ పరిధిలోకి రావని వాదించింది.

# ప్రజాగళం వినిపించడం డ్రామానా?

### ప్రధాని మోడీ వ్యాఖ్యలపై ప్రియాంక గాంధీ ఆగ్రహం

### చర్చలకు అనుమతించకపోవడమే డ్రామా అని కౌంటర్

### ప్రధాని విమర్శలపై వ్యాఖ్యానించడానికి రాహుల్ నిరాకరణ



**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** పార్లమెంట్ వెలుపల ప్రతిపక్షాలను ఉద్దేశించి ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. డ్రామాలు వద్దు అంటూ ప్రధాని చేసిన కామెంట్స్‌ను కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా గాంధీ తప్పుబట్టారు. ప్రజల సమస్యలను పార్లమెంటులో లేవనెత్తడం డ్రామా ఎలా అవుతుందంటూ ప్రశ్నించారు. ప్రజల సమస్యలపై చర్చ లేకపోతే పార్లమెంట్ ఎందుకని నిలదీశారు. ప్రజల సమస్యలపై చర్చలకు అనుమతించకపోవడమే డ్రామా అంటే అని కౌంటర్ ఇచ్చారు. పార్లమెంట్ వద్ద ప్రియాంక గాంధీ మాట్లాడుతూ, ప్రధాని మోడీ వ్యాఖ్యలను తప్పుపడుతూ, ప్రజలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై చర్చించడమే పార్లమెంట్ పని అని దాన్ని నాటకం అనడం సరికాదని విమర్శించారు.

దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్), వాయు కాలుష్యం దేశవ్యాప్తంగా ఉన్న చాలా పెద్ద సమస్యలు ఉన్నాయని ప్రియాంకా గాంధీ వివరించారు. ఈ సమావేశాల్లో ఈ సమస్యల గురించి చర్చిద్దామని పేర్కొన్నారు. ఇది డ్రామా కాదని ముఖ్యమైన అంశాలను లేవనెత్తి మాట్లాడటం నాటకం కాదని తేల్చి చెప్పారు. ప్రజలకు సంబంధించిన అంశాలపై పార్లమెంటులో ప్రజాస్వామ్య బద్ధంగా చర్చించేందుకు అనుమతి ఇవ్వకపోవడమే నాటకమని ప్రియాంకా గాంధీ మండిపడ్డారు. ఇక ప్రధాని మోడీ విమర్శలపై వ్యాఖ్యానించడానికి లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నిరాకరించారు.

# పోటాపోటీ ఉచితాలు ఆర్థికవ్యవస్థకు ప్రమాదం

### ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు



**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** రాజకీయ పార్టీలు పోటాపోటీగా ప్రకటిస్తున్న ఉచిత పథకాల సంస్కృతిపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఉచిత హామీలు ఎన్నికల్లో గెలిపించవచ్చేమో గానీ, దేశాన్ని మాత్రం నిర్మించలేవని ఆయన స్పష్టం చేశారు. ఒక ఆంగ్లపత్రికలో రాసిన వ్యాసంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు 'రేవ్‌డీ కల్చర్' (ఉచితాల సంస్కృతి)ని తీవ్రంగా విమర్శించిన ప్రధాని నరేంద్ర మోడీ సైతం ఇప్పుడు ఎన్నికల లాభాల కోసం అవే హామీలు ఇస్తున్నారని సుబ్బారావు ఎద్దేవా చేశారు. ఇది ఏదో ఒక పార్టీ వైఫల్యం కాదని, మొత్తం రాజకీయ వ్యవస్థలోనే పాతుకుపోయిన సమస్య అని ఆయన అభిప్రాయపడ్డారు. హామీలు నమ్మశక్యంగా లేనప్పుడు ప్రజలు వాటిని విశ్వసించడం మానేస్తారని పేర్కొన్నారు. ప్రతి ఉచిత పథకం ఒక రాజకీయ వైఫల్యానికి అంగీకారమేనని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలకు గౌరవప్రదమైన ఉపాధి కల్పించలేకపోతున్నాం, అందుకే ఈ తాయిలాలతో సర్దుకుపోవాలని నేతలు చెప్పడమే దీని అర్థమని వివరించారు. దేశంలో ఉద్యోగాల కల్పన, ఉత్పాదకత పెంపు వంటి కీలక అంశాలపై చర్చ జరగడం లేదని, వాటి స్థానంలో నగదు బదిలీ హామీలపై చర్చ జరుగుతోందని విశ్లేషించారు. ఈ ఉచితాల కోసం ప్రభుత్వాలు అప్పులు తీసుకురావడం మరింత ఆందోళన కలిగించే విషయమని, ఇది భవిష్యత్ తరాల పన్ను చెల్లింపుదారులపై భారం మోపడమేనని సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల ఆర్థిక దుస్సాహసాలను అడ్డుకోవాల్సిన ప్రజాస్వామ్య వ్యవస్థలు బలహీనపడుతున్నాయని అన్నారు. పేదలకు వ్యతిరేకులుగా ముద్ర పడుతుందన్న భయంతో ఏ రాజకీయ పార్టీ కూడా ఉచితాలను విమర్శించే సాహసం చేయలేకపోతోందని పేర్కొన్నారు.

# ఉజ్జయిని సామూహిక వివాహాల్లో పెళ్లిచేసుకున్న సిఎం కుమారుడు



**ఉజ్జయిని, డిసెంబరు 1:** మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తన కుమారుడి వివాహాన్ని అత్యంత నిరాడంబరంగా, సామాజిక బాధ్యతతో జరిపించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఉజ్జయినిలో జరిగిన ఒక సామూహిక వివాహ వేడుకలో మరో 21 జంటలతో పాటు తన చిన్న కుమారుడు అభిమన్యు యాదవ్ వివాహాన్ని ఆయన ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో అభిమన్యు డాక్టర్ ఇషిత మెడలో మూడు ముళ్లు వేశారు. సుమారు 25,000 మంది అతిథులు హాజరైన ఈ వేడుకను భారీ ఎత్తున ఏర్పాటు చేసినా, ఆడంబర ప్రదర్శనకు బదులుగా సామాజిక సమానత్వానికి పెద్దపీట వేశారు. వేర్వేరు సామాజిక, ఆర్థిక నేపథ్యాలకు చెందిన 22 జంటలు ఒకే వేదికపై ఒక్కటయ్యాయి. ఈ సందర్భంగా సీఎం మోహన్ యాదవ్ మాట్లాడుతూ "మా కుమారుడు అభిమన్యు, కోడలు ఇషితతో పాటు మరో 21 జంటలు ఈ పవిత్ర వేడుకలో ఒక్కటయ్యాయి. సనాతన సంస్కృతి, సామాజిక సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఈ కార్యక్రమంలో నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలని తెలిపారు. యోగా గురు రాందేవ్ బాబా ఈ జంటలన్నింటికీ వేదమంత్రాల సాక్షిగా వివాహ క్రతువును జరిపించారు. ఇలాంటి గొప్ప ఆదర్శాన్ని ప్రదర్శించిన తొలి ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ అని ఆయన ప్రశంసించారు. ఈ చర్య దేశంలోని సంపన్న కుటుంబాలకు స్ఫూర్తినిస్తుందని, పెళ్లిళ్ల పేరిట జరిగే అనవసరపు ఖర్చులకు అడ్డుకట్ట వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వేడుకకు కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, కేంద్ర మంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, దుర్గాదాస్ ఉయికే, అసెంబ్లీ స్పీకర్ నరేంద్ర సింగ్ తోమర్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

# గగనతలంలోనే లక్ష్యాన్ని ఛేదించిన 'కిజెలెల్మా'


### తుర్కియే అమ్ములపొదిలో అధునాతన అస్త్రం



**అంకారా, డిసెంబరు 1:** ప్రపంచ వైమానిక రంగంలో తుర్కియే సరికొత్త చరిత్ర సృష్టించింది. ఆ దేశానికి చెందిన మానవరహిత యుద్ధ విమానం 'కిజెలెల్మా' తొలిసారిగా గగనతలంలోని ఒక జెట్ టార్గెట్‌ను గాలి నుంచి గాలిలోకి ప్రయోగించే క్షిపణితో అత్యంత కచ్చితంగా ఛేదించింది. ఈ అరుదైన ఘనత సాధించిన ప్రపంచంలోనే మొట్టమొదటి మానవరహిత యుద్ధ విమానంగా కిజెలెల్మా రికార్డులకెక్కింది. నవంబర్ 30న సినోప్ ఫైరింగ్ ఏరియాలో ఈ కీలక పరీక్షను నిర్వహించారు. ఈ ప్రయోగంలో భాగంగా, కిజెలెల్మా యుద్ధ విమానం ఐదు ఎఫ్ 15 ఫైటర్ జెట్‌లతో కలిసి ప్రయాణించింది. రాడార్ నుంచి అందిన సమాచారంతో, తన రెక్క కింద అమర్చిన గోక్‌డోగన్ క్షిపణిని ప్రయోగించి, టార్గెట్ డ్రోన్‌ను విజయవంతంగా నాశనం చేసింది. ఈ ఆపరేషన్‌లో అసెల్సాన్ సంస్థకు చెందిన మురాద్ ఏసా రాడార్ కీలక పాత్ర పోషించింది. ఈ చారిత్రక విజయంపై టర్కీకి చెందిన ప్రముఖ ప్రైవేట్ రక్షణ రంగ సంస్థ, కిజెలెల్మా తయారీదారు అయిన బేకర్ హర్షం వ్యక్తం చేసింది. సంస్థ చైర్మన్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ అయిన సెల్యుక్ బేరక్తార్ మాట్లాడుతూ వైమానిక చరిత్రలో మేం ఒక కొత్త శకానికి నాంది పలికాం. ప్రపంచంలో తొలిసారిగా ఒక మానవరహిత యుద్ధవిమానం రాడార్ గైడెన్స్‌తో క్షిపణిని ప్రయోగించి, గగనతల లక్ష్యాన్ని కచ్చితత్వంతో ఛేదించిందని తెలిపారు. బేకర్ సంస్థ తన ప్రతిష్ఠాత్మక మియస్ ప్రాజెక్టులో భాగంగా కిజెలెల్మాను అభివృద్ధి చేసింది. బేరక్తార్ టీబీ2 డ్రోన్లతో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ సంస్థ, ఇప్పుడు కిజెలెల్మాతో మరో ముందడుగు వేసింది. శత్రు రాడార్లకు సులభంగా చిక్కని స్టెల్త్ టెక్నాలజీ, అత్యాధునిక సెన్సార్లు, విమాన వాహక నౌకల నుంచి టేకాఫ్ అయ్యేసామర్థ్యం దీని ప్రత్యేకతలు. భవిష్యత్తులో సూపర్‌సోనిక్ వేగంతో ప్రయాణించే కిజెలెల్మాబి, కిజెలెల్మాసి వేరియంట్లను కూడా తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# పార్లమెంటు సమావేశాలు కుదించడంపై విపక్షాలు సీరియస్

**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** పార్లమెంట్ శీతాకాల సమావేశాలను కుదించడంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. సాధారణంగా ఈ సమావేశాలు 20రోజులు జరుగుతాయి. అయితే, ఈసారి 15 రోజుల పాటు మాత్రమే జరగనున్నాయి. నేటి నుంచి ఈ నెల 19 వరకు సమావేశాలు జరగనుండగా, ఇందులో నాలుగు రోజులు సెలవులు ఉన్నాయి. శీతాకాల సమావేశాలను కుదించడంపై శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) ఎంపీ ప్రియాంక చతుర్వేది విమర్శలు చేశారు. పార్లమెంట్ సమావేశాలను సజావుగా జరిపే ఉద్దేశం అధికార పక్షానికి ఉన్నట్లు కనిపించడం లేదని ప్రియాంక చతుర్వేది అన్నారు. అహంకారంతో ప్రతిచోట అధికారం నిలుపుకుంటామనే భావన వారిలో కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. పార్లమెంటరీ విధానాలను అనుసరించాల్సిన అవసరం లేదని వారి అభిప్రాయంగా కనిపిస్తోందన్నారు. కేవలం 15రోజులలో 13 బిల్లులు తీసుకురావాలని చూస్తున్నారని, అంటే వీటిపై సరైన చర్చ జరగాలని వారు కోరుకోవడం లేదని అన్నారు. నిరసనల మధ్య ఈ బిల్లులను ఆమోదించాలని చూస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి సురేంద్ర రాజ్‌పుత్ కూడా శీతాకాల సమావేశాలను కుదించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పక్షం పార్లమెంటులో చర్చను అణచివేయాలని చూస్తోందని విమర్శించారు.



## కరవడానికి మనుషులు పార్లమెంట్‌లోనే ఉన్నారు..

### కుక్కపిల్లతో వచ్చిన రేణుక కామెంట్స్ వైరల్

**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ రేణుకా చౌదరి పార్లమెంట్ సమావేశాలకు ఒక కుక్కపిల్లతో రావడం తీవ్ర చర్చనీయాంశం అయింది. కరవడానికి మనుషులు పార్లమెంట్ లోపలే ఉన్నారు అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రస్థాయిలో మండిపడింది. శీతాకాల సమావేశాల్లో పాల్గొనేందుకు రేణుకా చౌదరి ఈ ఉదయం పార్లమెంట్‌కు వచ్చారు. ఆమె వెంట కారులో ఒక కుక్క పిల్ల ఉండటంతో అందరూ ఆశ్చర్యపోయారు. అయితే, దానిని వెంటనే తన కారులోనే ఇంటికి పంపించేశారు. ఈ విషయంపై మీడియా ప్రశ్నించగా, తాను పార్లమెంట్ కు వస్తుండగా దారిలో ప్రమాదానికి గురయ్యేలా ఉన్న ఆ కుక్కపిల్లను చూసి కాపాడానని తెలిపారు. ఒక జీవి ప్రాణాన్ని కాపాడితే తప్పేంటని, పార్లమెంట్‌కు కుక్కపిల్లను తీసుకురావొద్దని ఏదైనా చట్టం ఉందా అని ఆమె ప్రశ్నించారు. ఈ క్రమంలోనే ఆమె ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, కరవడానికి మనుషులు పార్లమెంట్ లోపలే ఉన్నారు, ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారు. దానితో ఎలాంటి సమస్య లేదా నేను ఒక జంతువును కాపాడితే అది పెద్ద చర్చ అవుతుందా అని వ్యాఖ్యానించారు. రేణుకా చౌదరి వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఇది పార్లమెంట్‌ను, ఎంపీలను అవమానించడమేనని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఆరోపించారు. రేణుక తన సహచర ఎంపీలందరినీ కుక్కలతో పోల్చారని, కాంగ్రెస్ పార్టీ చర్చలు కాకుండా డ్రామాలు కోరుకుంటోందని చెప్పడానికి ఇదే నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి రాజ్యాంగ సంస్థలపై గౌరవం లేదని, రేణుకా చౌదరి దేశానికి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.



# బంగ్లా రైఫిల్స్ తిరుగుబాటు వెనుక మాజీ ప్రధాని హసీనా!

**ఢాకా, డిసెంబరు 1:** బంగ్లాదేశ్ అల్లర్ల కేసులో ఢాకాలోని ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనాకు మరణశిక్ష వేసిన విషయం తెలిసిందే. కాగా 16 యేళ్ల క్రితం బంగ్లాదేశ్‌లో జరిగిన రైఫిల్స్ తిరుగుబాటు వెనుక హసీనా ఉన్నట్లు ఆ ఘటనపై దర్యాప్తు చేస్తున్న కమిషన్ తాజాగా ఆరోపించింది. నాడు హసీనానే స్వయంగా తిరుగుబాటుకు ఆదేశించారని విచారణ తేలినట్లు పేర్కొంది. 2009లో జరిగిన ఈ తిరుగుబాటు సమయంలో బంగ్లా ఆర్మీని బలహీనపర్చేందుకు భారత్ యత్నించిందని కమిషన్ ఆరోపించింది. దీనిపై ఆంగ్లపత్రిక ఎఎఫ్‌పి వెలువరించిన కథనాన్ని కమిషన్ ప్రస్తావించింది. హసీనా రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత.. 2009లో బంగ్లాలో జరిగిన రెండు రోజుల తిరుగుబాటులో అగ్రసైనిక అధికారులతో సహా 74 మంది మరణించారు. గతేడాది హసీనా స్వదేశాన్ని వీడిన తర్వాత అనంతరం ఏర్పాటైన యూనస్ ప్రభుత్వం బంగ్లాదేశ్ రైఫిల్స్ తిరుగుబాటుపై దర్యాప్తునకు ఓ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ తిరుగుబాటుపై విచారణ చేసిన కమిషన్ తాజాగా తన నివేదికను విడుదల చేసింది. అందులో హసీనాపై ఆరోపణలు చేసింది. అప్పటి అవామీ లీగ్ ప్రభుత్వ నేతలు కూడా తిరుగుబాటులో ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు పేర్కొంది. హసీనా ఆదేశాలతో మాజీ ఎంపి ఫజ్లే నూర్ తపోష్ దీనిని ముందుండి నడిపించినట్లు వెల్లడించింది. ఆ సమయంలో జరిగిన హత్యలకు హసీనానే కారణమని ఆరోపించింది.

**భారత్‌పై ఆరోపణలు:** రైఫిల్స్ తిరుగుబాటు సమయంలో హసీనాకు మద్దతుగా నిలిచిన భారత్.. బంగ్లాలో అస్థిరతను సృష్టించేందుకు ప్రయత్నించినట్లు కమిషన్ తీవ్ర ఆరోపణలు చేసింది. ఆ సమయంలో 921మంది భారతీయులు ఢాకాకు వచ్చారని వారిలో 67మంది ఎక్కడ ఉన్నారో ఇప్పటికీ తెలియరాలేదని పేర్కొంది. వీటిపై భారత్ ఇంకా స్పందించలేదు. విద్యార్థుల ఆందోళనలతో అనూహ్యరీతిన ప్రధాని పీఠంనుంచి దిగిపోయిన షేక్‌హసీనా గతేడాది ఆగస్టు 5న బంగ్లాదేశ్‌ను వీడి భారత్‌కు వచ్చారు. నాటినుంచి ఆమె ఢిల్లీలోని ఓ రహస్య ప్రదేశంలో నివసిస్తున్నారు. ఆమె పలు కేసుల్లో దోషిగా ఉన్నందున తిరిగి బంగ్లాకు అప్పగించాలని ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం పలుమార్లు భారత్‌ను కోరింది.

# అవినీతి కేసుల్లో క్షమాభిక్ష ప్రసాదించండి

### వారానికి మూడుసార్లు కోర్టుకు వెళ్లాల్సివస్తోంది

### ఇజ్రాయెల్ అధ్యక్షుడు హెర్జోగ్‌కు ప్రధాని నెతన్యాహు లేఖ



**టెల్‌అవీవ్, డిసెంబరు 1:** పలు అవినీతి కేసుల్లో ఐదేళ్లుగా అభియోగాలను, కోర్టు విచారణను ఎదుర్కొంటున్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తనకు క్షమాభిక్ష ప్రసాదించాలని దేశాధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అధికారికంగా లేఖ రాశారు. ప్రధాని కార్యాలయం ఈ విషయాన్ని వెల్లడించింది. మరోవైపు అధ్యక్ష కార్యాలయం దీనిని అసాధారణ అభ్యర్థనగా పేర్కొంది. ఇది అనేక చిక్కులతో ముడిపడి ఉందని తెలిపింది. తనపై సుదీర్ఘంగా సాగుతున్న విచారణను ముగించాలని అందులో నెతన్యాహు కోరారు. తనపై విచారణ దేశాన్ని విభజిస్తోందని ఓ వీడియో సందేశంలో ఆయన పేర్కొన్నారు. వారానికి మూడుసార్లు తాను న్యాయస్థానానికి హాజరుకావాల్సి వస్తోందని, దీని వల్ల దేశానికి నాయకత్వం వహించడం కష్టమవుతోందని తెలిపారు. 'నాపై విచారణ విషయంలో దేశం ముక్కలుగా విడిపోయింది. క్షమాభిక్ష ప్రసాదిస్తే దేశ ఐక్యత పునరుద్ధరణకు తోడ్పడుతాను. ఇజ్రాయెల్ చరిత్రలో హాజరైన ఏకైక ప్రధానమంత్రిగా నిలిచారు. సంపన్న రాజకీయ మద్దతుదారులకు ఆయన అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఇజ్రాయెల్ పర్యటనకు వచ్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ నెతన్యాహుకు క్షమాభిక్ష ప్రసాదించాలని హెర్జోగ్‌ను కోరారు. క్షమాభిక్ష కావాలనుకునేవారు తనకు అధికారికంగా లేఖ పంపాల్సి ఉంటుందని ఆ సమయంలో హెర్జోగ్ స్పష్టం చేశారు. మోసం, నమ్మకద్రోహం, అవినీతి తదితర అభియోగాలతో మూడు కేసుల్లో నెతన్యాహు విచారణ ఎదుర్కొంటున్నారు. ఇజ్రాయెల్-పాలస్తీనా ఘర్షణకు ద్విదేశ పరిష్కారమే మార్గమని పోప్ లియో-14 తెలిపారు. రెండుపక్షాలకు ఈ పరిష్కారమే న్యాయం చేస్తుందని అభిప్రాయపడ్డారు.

## సంక్షిప్తంగా..

### బెంగళూరు ట్రాఫిక్‌పై సమాజ్‌వాది ఎంపి సీరియస్



**బెంగళూరు, డిసెంబరు 1:** కర్ణాటక రాజధాని బెంగళూరు నగర రహదారులు, ట్రాఫిక్ జామ్‌లపై సమాజ్‌వాది పార్టీ ఎంపీ రాజీవ్ రాయ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నగర పోలీసులను యూజ్ లెస్ అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నగర ట్రాఫిక్ సమస్యపై సామాజిక మాధ్యమ వేదికగా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దృష్టికి తీసుకువెళ్లారు. బెంగళూరు నగర ట్రాఫిక్ అత్యంత దారుణంగా ఉందని, ఇక్కడి పోలీసులు నిష్ప్రయోజకులని ఆయన వ్యాఖ్యానించారు. పార్లమెంటు సమావేశాల్లో పాల్గొనడానికి ఆది వారం తాను ఢిల్లీ బయలుదేరగా, గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోయినట్లు తెలిపారు. వాహనాల రద్దీని క్లియర్ చేయడానికి రహదారిపై ఒక్క పోలీసు కూడా కనిపించలేదని విమర్శించారు. విమా నాశ్రయానికి సమయానికి చేరుకోవాలనే ఉద్దేశంతో బెంగళూరు పోలీసులను తాను సంప్రదించానని, కానీ వారు స్పందించలేదని ఆరోపించారు.

### భూకేటాయింపుల కేసుల్లో బంగ్లా మాజీ ప్రధానికి ఐదేళ్లు జైలు

**ఢాకా, డిసెంబరు 1:** బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనాకు మరో అవినీతి కేసులో ఎదురుదెబ్బ తగిలింది. పూర్బాచల్ న్యూ టౌన్ ప్రాజెక్టులో భూముల కేటాయింపులో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఢాకాలోని ప్రత్యేక కోర్టు ఆమెకు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. సోమవారం ఈ సంచలన తీర్పును వెలువ రించింది. ఇదే కేసులో హసీనా సోదరి షేక్ రెహానాకు ఏడేళ్లు, ఆమె మేనకోడలు, బ్రిటిష్ ఎంపీ తులిప్ సిద్ధిఖీకి రెండేళ్ల జైలు శిక్షను కోర్టు ఖరారు చేసింది. ఢాకా స్పెషల్ జడ్జి కోర్టు4 న్యాయమూర్తి ఎండీ రబియుల్ ఆలం ఈ తీర్పును ప్రకటించారు. నిందితులు ముగ్గురూ కోర్టుకు హాజరు కాలేదు. కేసులో మరో 14మంది నిందితులకు కూడా తలా ఐదేళ్ల జైలు శిక్ష పడింది. దోషులైన 17 మందికి లక్ష బంగ్లాదేశ్ టాకాల చొప్పున జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించారు.

### అతిపెద్ద నాటకాల రాయుడు మోడీయే: ఖర్గే, జైరామ్ ధ్వజం



**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం వాడి వేడిగా ప్రారంభమయ్యాయి. తొలిరోజే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీరుపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర స్థాయిలో విరుచు కుపడ్డారు. దేశం ఎదుర్కొంటున్న కీలక సమస్యలపై చర్చ జరపకుండా, ప్రధాని మరోసారి నాటకానికి తెరలేపారని ఆయన ఘాటుగా విమర్శించారు. పార్లమెంట్ సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధాని చేసిన ప్రసంగాన్ని ఉద్దేశించి ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ లో ఒక సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. గడచిన 11 ఏళ్లుగా కేంద్రప్రభుత్వం పార్లమెంటరీ గౌరవాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను నిరంతరం కాలరాస్తోంది. ఇందుకు సంబంధించిన ఘటనల జాబితా చాలాపెద్దదని ఖర్గే ఆరోపించారు. గత వర్షాకాల సమావే శాల్లోనే దాదాపు 12బిల్లులను హడావుడిగా ఆమోదించారని ఆయన గుర్తు చేశారు. కొన్ని బిల్లులను 15 నిమిషాలకన్నా తక్కువసమయంలో, మరికొన్నింటిని అసలు చర్చలేకుండానే పాస్ చేశారని విమర్శించారు.

### హైకమాండ్‌తో శశిథరూర్‌కు పెరిగిన అంతరం..



**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశి థరూర్‌కు, పార్టీ హైకమాండ్ మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. పార్టీ నిర్వహించిన రెండు కీలక సమావేశాలకు ఆయన వరుసగా గైర్హాజరు కావడంతో, ఆయన కాంగ్రెస్‌ను వీడతారనే ఊహాగానాలు తీవ్రమయ్యాయి. వచ్చే ఏడాది కేరళలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ పరిణామాలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు సోనియా గాంధీ నివాసంలో నిన్న సాయంత్రం జరిగిన ఉన్నతస్థాయి సమావేశానికి థరూర్ హాజరుకాలేదు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ సహా ముఖ్య నేతలందరూ ఈ భేటీలో పాల్గొన్నారు. తాను కేరళలో వృద్ధాప్యంలో ఉన్న తల్లితో ఉన్నందున సమావేశానికి రాలేకపోయానని థరూర్ మీడియాకు తెలిపారు. అయితే, నవంబర్ 18న జరిగిన మరో కీలక సమావేశానికి కూడా ఆయన అనారోగ్యం కారణంగా హాజరుకాలేదు.

2-12Pg6exHMNWJQE 10_2-12Pg6exHMNWJQE.qxd 01/Dec/25 10:21 PM Page 1






## ప్రభుత్వ విద్య, పరిశ్రమల భాగస్వామ్యం

# బలోపేతమే ఐఐటి లక్ష్యం

### రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ

శ్రీకాళహస్తి, డిసెంబరు 1 ప్రభాతవార్త: ప్రభుత్వ విద్య, పరిశ్రమల భాగస్వామ్యా లను బలోపేతం చేయటానికి తిరుపతి ఐఐటి కృషి చేస్తుందని డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ వివరించారు. తిరుపతి ఐఐటిలో సోమవారం ప్రత్యేక ఇండియన్ లీన్ కన్స్ట్రక్షన్ సమావేశాలను ఏర్పాటు చేసారు. సోమవారం ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిధిగా రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేడు రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక, నిర్మాణ రంగంలో శరవేగంగా సాగుతుందన్నారు. నిర్మాణ రంగంలో ఆర్ధిక భారాన్ని తగ్గించుకొనుటకు, నిర్మాణ రంగంలో సామర్థ్యాలను పెంచుకుంటూ వృధాలను తగ్గించుకొనుటకు మున్సిపల్ రంగంలో ప్రాజెక్టులను వేగవంతం చేయటానికి లీన్ పద్దతులను అమలు చేయటానికి ప్రభుత్వం నిబద్ధతతో ఉందన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ మూడు రోజుల కార్యక్రమాల గురించి వివరిస్తూ విద్యా పరిశోధనలను పరిశ్రమ అవసరాలతో అనుసంధానించటం అనే లక్ష్యంతో తిరుపతి ఐఐటి ముందుకు వెళుతుందని వివరించారు. ఈ పరిశ్రమ దినోత్సవం అత్యాధునిక విద్యాధృఢత్వాన్ని పరిశ్రమ ఉత్తమ పద్దతులలోకి అనువదించటానికి భారత జాతీ నిర్మాణ ప్రాజెక్టులకు బలమైన, స్థిరమైన భవిష్యత్తును నిర్ధారించటానికి నిబద్ధతతో పని చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమాల్లో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, చైర్మన్ మరియు గోద్రెజ్ కన్‌స్ట్రక్షన్స్ సీనియర్ వైస్ చైర్మన్ బిజెనెస్ హెడ్ అనుప్ మాధ్యూ, ఐఎల్‌సిఇ కార్యదర్శి, జనరల్ కైజాద్‌రంజావాలతో సమీక్షలు జరిగాయి. పలువురు వక్తలు మాట్లాడుతూ భారత దేశ మౌలిక సదుపాయాలను మార్చటంలో సామర్థ్యం, స్థిరత్వం, సాంకేతిక పురోగతిని ప్రోత్సహించటంలో 'లీన్ కన్‌స్ట్రక్షన్' పద్దతులు కీలకంగా ఉంటాయన్నారు. ఈ విధానం విదేశాల నుంచి భారత దేశానికి 2008లో వచ్చిందని వివరించారు.

# సొంత ఖర్చులతోనే లోకేష్ పర్యటన

### ప్రభుత్వ విప్, గంగాధర్ నెల్లూరు శాసనసభ్యులు థామస్



చిత్తూరు, డిసెంబర్ 1 ప్రభాతవార్త ప్రతినిధి: మంత్రి లోకేష్ తన పర్యటనలకు సంబంధించిన విమాన ప్రయాణ ఖర్చులను తన సొంత నిధుల నుండి చెల్లిస్తున్నారని ప్రభుత్వ విప్, చిత్తూరు జిల్లా గంగాధర్ నెల్లూరు శాసన సభ్యులు థామస్ తెలిపారు. కొంతమంది సమాచార హక్కు కార్యకర్తలు ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకొచ్చారని థామస్ పేర్కొన్నారు. కానీ అబద్ధాల పునాదులపై ఏర్పడ్డ పత్రికలో లోకేష్ పర్యటనలపై అసత్య కథనాలు ప్రసారం చేస్తున్నారని తామస్ మండిపడ్డారు ఎప్పటికీ లోకేష్ పర్యటనలను వైసీపీ నేతలు వైసిపి మీడియా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, తామస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. లోకేష్ 77 సార్లు హైదరాబాద్కు విమానంలో వెళ్లారని ప్రభుత్వ సొమ్మును విమాన చార్జీలకు దుర్వినియోగం చేస్తున్నారని జగన్ పత్రికలో పేర్కొన్నారని, కానీ ప్రతి పర్యటనకు లోకేష్ తన సొంత సొమ్ము చెల్లిస్తున్నారని ఈ సందర్భంగా థామస్ గుర్తు చేశారు. చివరికి ప్రభుత్వ అధికారిక పర్యటనలకు తన సొంత సొమ్ము చెల్లిస్తున్నారని గంగాధర నెల్లూరు శాసనసభ్యులు తామస్ తెలిపారు. చివరికి ప్రభుత్వ అధికారిక పర్యటనలు పెట్టుబడుల సాధనకు వెళ్లిన పర్యటనలకు సైతం సొంత సొమ్మునే వెచ్చిస్తున్నారని చిన్నబాబు చిరుతిండి అని గతంలోనూ జగన్ పత్రిక తప్పుడు కథనాలు ప్రచారం చేస్తే విద్యాశాఖ మంత్రి లోకేష్ పరువు నష్టం కేసు వేశారని, అయినా వారి వక్రబుద్ధి మారలేదని థామస్ విమర్శించారు.


నూతన పూజామండపం పరిశీలిస్తున్న ఇఓ

## దుర్గమ్మ ఆలయం కనకదుర్గానగర్ టోల్ కాంట్రాక్టర్‌కు

# రూ.50వేల జరిమానా

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 1 ప్రభాతవార్త: శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంకు వచ్చే దారి కనకదుర్గానగర్‌లో వున్న టోల్ వసూలు కాంట్రాక్టర్‌పై ఇఓ వికె శీనా నాయక్ కొరడా ఝుళిపించారు. ఇటీవల టోల్ వసూల్ కాంట్రాక్టర్‌పై వచ్చిన పలు ఆరోపణల మేరకు ఇఓ కూలంకుశంగా పరిశీలన చేసి ఈ చర్యలు తీసుకున్నారు. టోల్ కాంట్రాక్టు పొందిన పివిఎల్ దేవి కి చెందిన వివిఎల్‌డీ ఎజెన్సీ వారు టెండర్ పాడుకున్న స్థలం కంటే ఎక్కువ స్థలాన్ని ఆక్రమించి టోల్ వసూలు చేస్తున్నట్లు పలు కథనాలపై ఇఓ చర్యలు చేపట్టారు. గతంలో వారు దేవస్థానానికి బకాయి పడ్డ రు.1,11,98,199 లు చెల్లించాలని పలుమార్లు ఆదేశాలిచ్చినప్పటికి చెల్లించలేదని, ప్రస్తుతం విధించిన రు.50వేలు, దేవస్థానానికి బకాయి పడ్డ రు.1,11,98,199 లు నోటీసు అందిన మూడు రోజుల్లో చెల్లించని పక్షంలో నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### నూతన పూజామండపంలో ఎసిల తరలింపు

ఇటీవల ప్రారంభించిన నూతన పూజా మండపంలోకి ఎసిలను సోమవారం మార్పు చేశారు. ఇకపై లక్ష కుంకుమార్చన, శ్రీచక్రార్చన, అన్నప్రాసన వంటి సేవలు నూతన పూజా మందిరంలో అందుబాటులో వుంటాయని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. వేదాశీర్వచన కార్యక్రమాన్ని నిష్క్రమణ మార్గం వద్ద ఇఓ నేతృత్వంలో సోమవారం ఏర్పాటు చేశారు. వారం రోజులు ప్రయోగాత్మకంగా కొనసాగించి అనంతరం దీనిపై తుదినిర్ణయం తీసుకుంటామని ఇఓ తెలిపారు. దుర్గమ్మవారిని సినీ నటుడు నరేష్ దర్శించుకున్నారు.

# సొంతిల్లు, ఇంటి స్థలం కోసం దరఖాస్తులు

విజయవాడ, డిసెంబరు 1 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీలో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం ఆవాస్ యోజన (గ్రామీణ్) ఎన్టీఆర్ పథకాన్ని అమలు చేస్తున్నాయి. సొంత స్థలం ఉన్న వారికి ఆర్థికసాయం, లేని వారికి 3 సెంట్ల స్థలంతో పాటు ఆర్థికసాయం అందిస్తున్నాయి. ఇందుకు సంబంధించి దరఖాస్తు గడువు డిసెంబర్ 2025తో ముగియనుంది. అర్హులైన వారు గ్రామ/మున్సిపల్ వార్డు సచివాలయాల్లో వివరాలు నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు.

# ఆరోగ్యకర సమాజంతోనే వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాధ్యం

- రాష్ట్రాన్ని 2030 నాటికి ఎయిడ్స్ రహిత లక్ష్యంగా తీర్చిదిద్దేందుకు కృషి
- వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్




విజయవాడ, డిసెంబరు 1 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రాన్ని 2030 నాటికి ఎయిడ్స్ రహిత లక్ష్యంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నామని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. వరల్డ్ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తుమ్మలపల్లి కళా క్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికీ ముఖ్యఅతిథిగా వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరై మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న కార్యక్రమాల వల్ల గతంలో ఉన్న 2.34 శాతం పాజిటివిటీ రేటు పది సంవత్సరాలు అయ్యేటప్పటికి 0.58 శాతానికి తగ్గిందన్నారు. పది సంవత్సరాల క్రితం 25 వేల కొత్త కేసులు నమోదు అయితే పది సంవత్సరాల్లో 13,000 కేసులకు తగ్గిపోయాయన్నారు. ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉంటూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గతంతో పోలిస్తే నేడు ఎయిడ్స్ తో మరణిస్తున్న వారి సంఖ్య కూడా గణనీయంగా తగ్గిందన్నారు. పాజిటివిటీ రేటు 2.34 శాతం నుండి 0.58 శాతానికి తగ్గేలా కృషి చేసిన వైద్య ఆరోగ్య, ఏపీ సాక్స్ సిబ్బంది అందరికీ అభినందనలు తెలియజేస్తున్నారు. ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థల సహకారంతో 2030నాటికి ఎయిడ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ భారత్ నిర్మాణం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మారుమూల ప్రాంతాలలో హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించే ప్రయత్నం చేస్తు న్నామని, అవి పూర్తి ఉచితమన్నారు. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ హెచ్ఐవీ వ్యాధిపట్ల అవగాహన కల్పించే ప్రయత్నం చేయాలని, యువతలో కూడా వీటి పట్ల అవగాహన కల్పించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలియజేశారు. శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ రావు మాట్లాడుతూ ఎయిడ్స్ అంటే ఒకప్పుడు భయానక పరిస్థితి ఉండేదని నేడు ఆ పరిస్థితులు మారుతూ వచ్చాయన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా హెచ్ఐవి నివారణ, బాధితుల సంక్షేమానికి ప్రభుత్వాలు, సంస్థలు, ప్రజలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ నీలకంఠా రెడ్డి, తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సెకండరీ హెల్త్ డైరెక్టర్ కేబీఎన్ చక్రధర్ బాబు, పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ డా. పద్మావతి, ప్రముఖ వైద్యులు డాక్టర్ సమరం గోపరాజు, నెట్‌వర్క్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విద్యార్థులు పాల్గొన్నారు.



# పేదల అభ్యున్నతే లక్ష్యం

### మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

సంగం (నెల్లూరు), డిసెంబరు 1 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం పేద వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పెద్ద ఎత్తున పెన్షన్లు పంపిణి చేస్తుందని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. సంగం మండలం గాంధీజనసంఘంలో ఎన్టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణి కార్యక్రమంలో ఆయన మాటాడుతు ప్రళయం వచ్చినా సరే 1వ తేది పించన్లు అందించాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం అని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా పించన్లు పంపిణికి వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని ఆయన తెలిపారు. సంగం మండలంలోని గాంధీ జనసంఘం గ్రామంలో రాష్ట్రీయ గ్రామస్వరాజ్ పథకం ద్వారా పంచాయితీ భవన నిర్మాణాలకు పంచాయితీ భవన నిర్మాణాలకు 32 లక్షలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, ఈ నిర్మాణాలను స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. వీటిని త్వరలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. తమ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంత రహదారుల రూపురేఖలు పూర్తిగా మారుతున్నట్లు మంత్రి చెప్పారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 15 కోట్లతో ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్డు నిర్మించేలా నిధులు మంజూరు చేశామన్నారు. కొన్ని పూర్తి అయ్యాయయని మరికొన్ని మొదలు కానున్నట్లు చెప్పారు. గాంధీజనసంఘంలో 15 లక్షలు రోడ్డు నిర్మాణాలకు మంజూరు చేసినట్లు చెప్పారు. అలాగే మరో 7 గ్రామాలో రాకపోకలకు ఇబ్బంది రాకుండా 27 కోట్లతో రహదారి నిర్మాణాలు పనులను డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ మంజూరు చేశారని చెప్పారు. సంగం మండలం వీర్లగుడిపాడు గ్రామానికి రాకపోకలు కల్పించేందుకు బీరాపేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి 25 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. రెండు సబ్‌స్టేషన్లు కూడా నూతనంగా మంజూరు అయినట్లు చెప్పారు. నియోజకర్గంలో 77 చిన్న ఆలయాలకు 5 లక్షలు చొప్పున మరమ్మత్తులకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజక్టు డైరెక్టర్ నాగరాజకుమారి, ఆర్‌డిఓ పావని, తహసిల్దారు సోమ్లానాయక్, ఎంపిడిఓ షాలెట్, మండల పార్టీ అద్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి, వెంగారెడ్డిపాళెం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి, గాంధీ జనసంఘం నాయకులు మానికల కృష్ణమూర్తి, సంగం సొసైటీ చైర్మన్ గుండ్లపల్లి శ్రీనివాస్‌యాదవ్, సీనియర్ నాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి, నీటి సంఘం అద్యక్షులు సూరా శ్రీనివాసులురెడ్డి, మెట్టు విజయ కృష్ణారెడ్డి, కాకు మధుసూదన్ యాదవ్, గునుపూటి గిరిబాబు, నీటి సంఘం అద్యక్షులు బాబు, సంగం సొసైటీ డైరెక్టర్ జనార్దన్‌రెడ్డి, సూరాయపాళెం పవన్, ఇరిగేషన్ ఏఇ వినయ్, తదితరులు పాల్గొన్నారు.



# హామీలన్నీ అమలు

### మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు, డిసెంబరు 1 ప్రభాతవార్త–వైద్యం: రాష్ట్రంలో ఒకే రోజులో 90 శాతం పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఘనత ఒక్క కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలోని 11డివిజన్లో తుఫాన్ సైతం లెక్కచేయకుండా ఉదయాన్నే పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి నారాయణ చేపట్టారు. జోరు వానలో సైతం కూడా ఇంటింటికి వెళ్లి పెన్షన్ అందజేస్తున్న నారాయణను లబ్దిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పెన్షన్ దారుల బాగోగులను మంత్రి నారాయణ అడిగి తెలుసుకున్నా. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. 68 లక్షల మందికి పెన్షన్లు అందజేస్తున్నట్లు, కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారమే పెన్షన్ దారులకు పెన్షన్ పెంచడం జరిగిందని మరోసారి గుర్తు చేశారు. దాదాపు 34 వేల కోట్ల రూపాయలు పెన్షనును అందజేస్తున్నామని, ఇవ్వన్ని హామీలను కూడా ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. భారతదేశంలో కూడా ఎక్కడ ఇంత మొత్తంలో పెన్షన్ ఇవ్వడం లేదన్నారు. ఆర్థిక పరిస్థితి భాగా లేకున్నా సీఎంకు ఉన్నటువంటి అపారమైన అనుభవంతో హామీలు అమలు చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 90శాతం పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని, 67 లక్షల మందికి తల్లికి వందనం అమలు చేస్తున్నా మన్నారు. రైతులకు 20,000 అందించామని, మహిలలకు కూడా ఉచిత బస్సు అమలు చేశామని గుర్తు చేశారు. మేనిఫెస్టోలో చెప్పినవన్నీ వందకు వంద శాతం అమలు చేస్తామని కంఠాపదంగా చెప్పారు. అనంతరం నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మీడియాతో మాట్లాడారు. మంత్రి నారాయణ క్రమశిక్షణకు మారుపేరని జోరు వానలో సైతం లెక్కచేయకుండా సమయానికి వచ్చి పెన్షన్ పంపిణీ చేయడం అందులో మంత్రిగా నెల్లూరు నగర ఎమ్మెల్యే కావడం నియోజకవర్గ వాసుల అదృష్టమని పేర్కొన్నారు. స్కూల్స్ పార్కుల అభివృద్ధి కాలువల పూడికతీత పనులకు మంత్రి పెద్దపీట వేశారన్నారు. కార్యకర్తల సంక్షేమమే పరమావధిగా ముందుకు సాగుతున్న గొప్ప వ్యక్తి మంత్రి నారాయణ అని.. ఒక విజన్‌తో ప్రణాళిక బద్దంగా నగరాభివృద్ధికి కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, డివిజన్ అధ్యక్షుడు గొడ్డేటి నాగేంద్ర, కోర్పొరేటర్ ఆవుల శ్రీనివాసులు, 227 బూత్ ఇన్‌ఛార్జి ఏకుల నాగార్జున, గోతం బాలకృష్ణ, టీడీపీ ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులున్నా సమపాళ్లలో సంక్షేమం, అభివృద్ధి!

- రాయలసీమ ప్రాజెక్టులు, ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సిఎం ప్రత్యేక దృష్టి
- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్
- ఉరవకొండ మండలం బూదగవిలో పింఛన్లు పంపిణీ

ఉరవకొండ, డిసెంబరు 1 ప్రభాతవార్త: రాష్ట్రం ఎన్నో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ప్రతిరోజూ దినదిన గండంగా సాగుతున్న పరిస్థితుల్లోనూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమాలను సమతూకాల్లో ముందుకు తీసుకెళుతున్నారని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. సోమవారం ఆయన ఉరవకొండ మండల పరిధిలోని బూదగవి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను ఇంటింటికీ వెళ్లి లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్దిదారులతో ముచ్చటించిన మంత్రి గ్రామంలో విస్తృతంగా పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులను మంజూరు చేసుకొని వాటిని పూర్తి చేసుకోవడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టి పెట్టారన్నారు. ఇప్పటికే ఒకవైపు అమరావతి, పోలవరం తోపాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందని, రాయలసీమ ప్రాజెక్టులు, ఇక్కడ వెనుకబడిన ప్రాంతాలు, ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంపై దృష్టి కేంద్రీకరిస్తున్నారన్నారు. సాధ్యమైనంత నిధులను సమీకరించుకొని అవసరమైన మేరకు కేంద్ర సాయాన్ని తీసుకొని ఎంతో కాలంగా ఎదురుచూపులకే మిలిగి పోయిన ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ప్రణాళికను రూపొందించుకోవడం జరుగుతోందన్నారు.


బూదగవిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు లబ్దిదారుకు పంపిణీ చేస్తున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

### జెడ్పీహెచ్ఎస్ నూతన భవనాలు ప్రారంభించిన మంత్రి

గ్రామ పర్యటన సందర్భంగా రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఆర్ఎంఎస్ఏ నిధులు 43.75 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన జెడ్పీ ఉన్నత పాఠశాల భవనాలను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించిన శిలాఫలాన్ని ఆవిష్కరించారు. పాఠశాలలో కలియతిరిగి సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం పక్కనేగల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన మంత్రి విద్యార్థులతో కాసేపు ముచ్చటించి విద్యాభ్యాసం, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ గత ఐదేళ్ల పాఠశాలలు నిర్లక్ష్యానికి గురయ్యాయని ఇప్పుడు తమ ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత నిస్తోందన్నారు. ఒక్కో విద్యార్థికి ఏడాదికి 90వేలు ఖర్చు చేస్తున్నామన్నారు. కమ్యూనికేషన్స్ స్కిల్స్ పెంపొందించుకుంటే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించవచ్చని, ప్రణాళిక బద్దంగా చదివి విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. అనంతరం ప్రసిద్ధ చెందిన సూర్యనారాయణస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి బి.విజయ్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మెన్ ఛత్రగుడి చిరంజీవి, సభ్యులు మహేంద్రగౌడ్ తదితరులు మంత్రి పయ్యావుల కేశవ్‌ను సన్మానించి అర్చకులతో తీర్థప్రసాదాలు అందించారు.

### గత ప్రభుత్వంలో ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాయలసీమలోని ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయని మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. ప్రాజెక్టులలో ఒక గంప మన్ను తవ్వలేదని, ఒక మీటరు కాలువ తీయలేదన్నారు. హంద్రీనీవా గాలేరు–నగరి, కొట్టుకుపోయిన ప్రాజెక్టులు, దెబ్బతిన్న శ్రీశైలం ప్రాజెక్టు రిపేర్లు సైతం చేయలేదన్నారు. గత ప్రభుత్వానికి భిన్నంగా రాయలసీమలో ప్రాజెక్టులను మళ్లీ పరుగులు పెట్టించే దిశగా ముందుకుపోవడం జరుగుతోందన్నారు. ఇప్పటికే హంద్రీనీవా వెడల్పును ఒక దశ పూర్తి చేసామని, ఇందులో రెండవ దశలో లైనింగ్ అంతా పూర్తి చేయడం జరిగిందన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు, కోస్తాంధ్రలో ఉన్న డ్రైనేజీలపై ప్రభుత్వం దృష్టి పెట్టబోతోందన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, తహశీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీవో రవిప్రసాద్, డీఈఈ రమణారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో సతీష్‌కుమార్, ఎంఈవో ఈశ్వరప్ప, టీడీపీ నాయకులు ఎస్.విజయ భాస్కర్, మోపిడి గోవిందు, దేవినేని పురుషోత్తం, రేగటి నాగరాజు, కె.జె.కుళ్లాయప్ప, యర్రగుంట్ల వెంకటేష్, బోదపాటి గోవిందప్ప, ప్యారం కేశవానంద, గ్రామ మాజీ సర్పంచ్ సి.చిరంజీవి, జనసేన నాయకుడు గౌతమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


# భవితకు బంగారు బాటవేస్తాం



### మనోధైర్యంతో ఉండండి: జిల్లా కలెక్టర్

విజయవాడ, డిసెంబరు 1 ప్రభాతవార్త ప్రతినిధి: తల్లిదండ్రులను కోల్పోయినంత మాత్రన మీరు అనాధులు కారని మేమందరం మీకు అండగా ఉండి భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తామని మనోధైర్యంతో ఉన్నత విద్యాను అభ్యసించి సమాజంలో ఉత్తమ పౌరులుగా జీవించేందుకు అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ అనాథ చిన్నారులకు భరోసా ఇచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బెంజ్ సర్కిల్ సమీపంలోని వాసవ్య మహిళా మండలి నందు సోమవారం అనాధ బాలలతో ఏర్పాటు చేసిన అల్పాహారం విందులో జిల్లా కలక్టర్ డా. జి.లక్ష్మీశ పాల్గొన్ని చిన్నారులతో మమేకమై అల్పాహారం స్వీకరించారు. చిన్నారులు తమ కుటుంబం గురించి చెప్పిన కొన్ని మాటలకు కలెక్టర్ చలించి పోయారు. బాలలతో ముచ్చటిస్తూ మీరు ఆనాధులు కారని మేమందరం మీకు తల్లిదండ్రులమని మీ అలానే పాలన చూడవలసిన భాధ్యత మాపై ఉందన్నారు. మనోధైర్యంతో ముందడుగు వేసి మంచి విద్యాబుద్ధులు నేర్చుకుని అన్నత చదువులు చదివితే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని ఎవరిపై ఆధారపడవలసిన అవసరం లేదని సమాజంలో అందరితో సమానంగా జీవించవచ్చునని చెబుతూ పిల్లలకు జీవితంపై భరోసా కల్పిస్తు మనోధైర్యాన్ని నింపారు. వాసవ్య మహిళ మండలి కార్యదర్శి డా. జి రష్మి మాట్లాడుతూ ఇప్పటి వరకు దాదాపు 3 వేలకు పైగా ఆనాథ పిల్లలను చేరదీసి వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు. హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి బారిన పడిన వారికి ఉచిత మందులను పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డా. జి.సమరం, వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డా. కీర్తి, మెడికల్ డైరెక్టర్ డా.పి.దీక్ష, గోర సైన్స్ సెంటర్ డైరెక్టర్ జి.నియంత, ఎమిక్యూర్ ఫార్మా లిమిటెడ్ ప్రతినిధి మల్లికార్జునరావు, వాసవ్య మహిళా మండలి ప్రతినిధులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# చెరువు నుండి వెలుపలికి వచ్చిన ఏనుగు



### వైద్య పరీక్షల నిమిత్తం తిరుపతి జూకు తరలింపు

చిత్తూరు, డిసెంబర్ 1 ప్రభాతవార్త: యాదమరి మండలం తెల్లరాళ్ళపల్లి పంచాయతీ గుడ్డివాని చెరువు బురద కుంటలో కూరుకు పోయిన ఏనుగును ఎట్టకేలకు సోమవారం అటవీశాఖ, పోలీసు అధికారులు వెలుపలికి తీసుకువచ్చారు. ఏనుగు కాళ్ళకు తీవ్రంగా గాయాలు వుండటంతో ఏనుగుకు ప్రథమ చికిత్స చేసిన అనంతరం దానిని మెరుగైన చికిత్స కోసం తిరుపతి జువాలజికల్ పార్కుకు తరలించారు. యాదమరి మండలం తెల్లరాళ్ళపల్లి పంచాయతీ గుడ్డివాని చెరువు పరిసర ప్రాంతాల్లో గత వారం రోజులుగా ఒక ఒంటరి ఏనుగు తిరుగుతుండేది. తమిళనాడు నుండి ఇక్కడికి వచ్చిన ఏనుగు కాళ్ళకు తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి ఆ ఒంటరి ఏనుగు తెల్లరాళ్ళపల్లి పంచాయతీ పరిధిలో అటవీ ప్రాంతంలో వున్న గుడ్డివానిచెరువులోకి వెళ్ళి బురదలో చిక్కుకొంది. ఈ విషయంను ఆదివారం తెల్లవారుజాము గుర్తించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు అటు తమిళనాడు రాష్ట్ర అటవీశాఖ అధికారులతో పాటు సిఎఫ్ఓ యశోద ఆధ్వర్యంలో జిల్లా అటవీశాఖ అధికారి శ్రీనివాసులు, ఎఫ్ఆర్ఓలు థామస్, పట్టాబిలు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ హరి, యాదమరి ఎస్ఐ ఈశ్వర్‌యాదవ్, ఇతర అధికారులు ఆధ్వర్యంలో చెరువు బురద కుంటలో చిక్కుకున్న ఏనుగును ఒడ్డుకు చేర్చడానికి ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజాము నుండి అటవీ, పోలీసు శాఖలు చేసిన ప్రయత్నాలు ఫలితాలు ఇచ్చాయి. చెరువు ఊబిలో చిక్కిన ఏనుగును సురక్షితంగా సోమవారం బయటకు వచ్చింది. ఏనుగు బలంగా గాయపడి వుండటంతో ఏనుగు కాళ్ళకు ప్రథమచికిత్స దానిని తిరుపతి జువాలజిక్ పార్కుకు తరలించి అక్కడ చికిత్స చేయించాలని అటవీశాఖ అధికారులు నిర్ణయించారు. ఏనుగు సురక్షితంగా చెరువు నుండి బయటపడటంతో పలమనేరు నుండి వచ్చిన రెండు కుంకీ ఏనుగులు వెనుతిరిగి వెళ్ళాయి. చెరువు నుండి బయటపడ్డ ఏనుగును వాహనంతో తీసుకుని తిరుపతికి అటవీశాఖ అధికారులు తరలించారు.

## వైభవంగా మణికంఠుని పడిపూజ

తెనాలి టౌన్, డిసెంబర్1(ప్రభాతవార్త): పట్టణంలోని నాజరుపేట సంకా వారి కొట్ల సెంటర్లో, సోమవారం సాయంత్రం శ్రీ అయ్యప్ప స్వామి భక్తి బృందం ఆధ్వర్యంలో 23వ సంవత్సర పంచమండపముల పడిపూజ మహోత్సవం ఎంతో వైభవంగా, కన్నుల పండగగా నిర్వహించారు.బత్తుల దుర్గారావు గురుస్వామి ఆధ్వర్యంలో శ్రీ అయ్యప్ప స్వామి వారి పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ పడిపూజ మహోత్సవానికి దప్పుశ్రీను ఆధ్వర్యంలోని శిష్య బృందం చే అర్కెస్ట్రా నిర్వహించారు. అనంతరం కన్నెస్వాములచే అభిషేకములు చేయించారు. ఈ సందర్భంగా, అభిషేకాలను భక్తులు పంచమండపముల పూజలను తిలకించటానికి పట్టణం మరియు పరిసర ప్రాంతాలు నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. అనంతరం అయ్యప్పలు,కన్నెస్వాములచే , నిర్వహించిన పడిపూజ మహోత్సవ కార్యక్రమంలో అయ్యప్పలు శివ స్వాములు భవానీలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. . అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం భిక్ష కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో,పట్టణంలోని నాజరుపేటకు చెందిన శ్రీ అయ్యప్ప స్వామి భక్త బృందం సభ్యులు,జన్ను శశి కుమార్ (న్యాయవాది) పెద్దిశెట్టి దినేష్ బాబు,బొంత నారాయణ, మల్లిశెట్టి నాగసాయి నాని,పి. వెంకటేష్,జన్ను ప్రణీత్ సాయి,వెంకటరమణ, తులబండుల మహేష్,ఆకుల సుధీర్,శివారెడ్డి మరియు వారి మిత్రబృందం పాల్గొన్నారు.



## ఎయిడ్స్ నివారణలో పురోగతి: డాక్టర్ పృథ్వి గణేష్

రేపల్లె, డిసెంబరు 1, (ప్రభాతవార్త):ఆరోగ్య ప్రమాణాల పరిరక్షణలో భాగంగా ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన పెంచుతూ ఎయిడ్స్ వ్యాధితో మృతి చెందిన వారిని గుర్తు చేసుకుంటూ ఎయిడ్స్ వ్యాధి కారక హెచ్.ఐ.వికి వ్యతిరేకంగా పోరాడేందుకు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం జరుపుకుంటున్నామని రేపల్లె 30 పడకల ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పృథ్వి గణేష్ చెప్పారు.స్థానిక ప్రభుత్వ సామాజిక కుటుంబ ఆరోగ్య కేంద్రంలో మండల న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యాన సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ పృథ్వి గణేష్ ప్రసంగిస్తూ 1988 సంవత్సరంలో ఎయిడ్స్ దినోత్సవం జరపాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ణయించిందని తెలిపారు.2030 సంవత్సరం నాటికి ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపునిచ్చిందని ఆయన చెప్పారు. అందుకే ఈ సంవత్సరం ఎయిడ్స్ పై చైతన్యం పెంచాలని,వివక్ష కు సంబంధించిన అంతరాయాలను తగ్గించి ఎయిడ్స్ వ్యాధి బాధితుల పట్ల సంఘంలో ప్రతిస్పందనను మార్చాలని ప్రపంచ ఎయిడ్స్ డే నినాదంగా ఎంచుకోవడం జరిగిందని ఆయన వివరించారు.నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ కార్యక్రమాలు,యాంటీ రెట్రోవైరల్ థెరపీ కేంద్రాలు,ప్రజారోగ్య నిపుణుల విశేష కృషితో పురోగతి సాధిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.ఆరోగ్య ప్రమాణాల దృష్టితో ఎవరైతే సక్రమమైన మార్గంలో ముందుకు సాగుతారో అటువంటి వారికి ఎటువంటి వ్యాధులు రావని గుర్తుంచుకోవాలన్నారు.ఈ కార్య క్రమంలో మండల న్యాయసేవ అధికార సంస్థ పారా లీగల్ వాలంటీర్లు చెన్ను నాగమల్లేశ్వరరావు,ఆర్.శ్రీనివాసరావు,ఆలా మోషె,సయ్యద్ తాహిర్ అహ్మద్,విజ్ఞాన్ ఒకేషనల్ జూనియర్ కళాశాల కార్యదర్శి,కరస్పాండెంట్ పాషా సాజిద్,ప్రిన్సిపాల్ రిజ్వానా,ఒర్సు ఉపాధ్యాయుడు అక్బర్,రేపల్లె ఎయిడ్స్ కంట్రోల్ నియంత్రణ ఏరియా డాక్టర్ రాజేంద్రకుమార్,దాసరి అమర్నాథ్,ప్రభుత్వ వైద్యశాల,కోర్టు సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.



## పెన్షన్ పథకంతో పేదలకు ప్రయోజనం

రేపల్లె, డిసెంబరు 1, (ప్రభాతవార్త):కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం పేదల పాలిట ప్రయోజనకరంగా మారిందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు,రేపల్లె నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్ అన్నారు.సోమవారం రేపల్లె పట్టణంలోని 5,6 వార్డులలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ప్రతి నెల 1వ తేదీ పెన్షన్ రూపంలో ఆర్థిక సహాయాన్ని అందజేస్తూ వారి జీవితానికి భద్రత,గౌరవాన్ని కల్పిస్తున్న ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకు దక్కుతుందని తెలియజేశారు.ఈ పథకం ప్రధాన లక్ష్యం నెరవేరటం సంతృప్తికరమన్నారు.ఈ పథకం ద్వారా వృద్ధులు,వికలాంగులు,చేనేత కార్మికులు,గీత కార్మికులు,మత్స్యకారులు,ఒంటరి మహిళలు,పాదరక్షలు కుట్టేవారు,కళాకారులు,ట్రాన్స్ జెండర్స్ ఆర్థిక ప్రయోజనం పొందుతున్నారని ఆయన తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో కంటే పెన్షన్ పథకాలను మెరుగుపరిచి అర్హత కలిగిన వారికి సహాయాన్ని అందించడంలో ప్రభుత్వం అనుకున్న ఫలితాలను సాధిస్తున్నదని అనగాని శివప్రసాద్ స్పష్టం చేశారు.4వ వార్డులో టిడిపి అధ్యక్షుడు ఎన్.వి.ఉమామహేశ్వరరావు,ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసరావు పెన్షన్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు,పెద్దపూడి కనకదుర్గ దేవస్థాన పాలకమండలి సభ్యుడు జి.వి.నాగేశ్వరరావు,మేకా రామకృష్ణ,టి.మల్లికార్జునరావు,గోగినేని పట్టాభిరామారావు,తిరుమలరావు,కూటమి పార్టీల నాయకులు,సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలకు మేలుచేస్తున్న సంక్షేమ పథకాలు

రేపల్లె, డిసెంబరు 1, (ప్రభాతవార్త):ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అన్నారు.సోమవారం సామాజిక వృద్ధాప్య పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు సంక్షేమ పథకాలు అద్భుతమైన ఫలితాలను సాధిస్తున్నాయని చెప్పారు.సీఎం చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సూచనల ప్రకారం డిసెంబరు 1వ తేదీ పెన్షన్లు అందజేయడం లబ్ధిదారులకు సంతోషాన్నిస్తున్నదని ఆయన తెలిపారు. మండలంలోని ఐలవరం,వేమవరం,సూరేపల్లి, కోనేటిపురం,పల్లెకోన, గోరికపూడి, పెదపులివర్రు, ఓలేరు,పెట్లూరు,పెసర్లంక,రామాపురం,ఊరుపాలెం,చింతమోటు,పెదలంక తదితర గ్రామాల్లో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాలు జరిగాయి.ఈ కార్యక్రమంలో భట్టి ప్రోలు సచివాలయ కార్యదర్శి ఎం.నాయక్, పార్టీ నాయకులు,కార్యకర్తలు,ఆయా గ్రామాలలోని సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



## జీఎస్‌డబ్ల్యు అధికారిగా మల్లికార్జునరావు

రేపల్లె, డిసెంబరు 1, (ప్రభాతవార్త):భట్టి ప్రోలు మండల జీఎస్‌డబ్ల్యు అధికారిగా మల్లికార్జునరావు నియమితులయ్యారు.చెరుకుపల్లి మండలం నుంచి భట్టి ప్రోలు మండలానికి బదిలీపై వచ్చిన మల్లికార్జునరావు సోమవారం బదిలీ ఉత్తర్వులను ఎంపిడిఓ వెంకటరమణకు అందజేశారు.మండలంలోని సచివాలయాల అధికారులతో వివిధ అంశాలపై సర్వే చేయించే బాధ్యతలు తన పరిధిలో ఉంటాయని మల్లికార్జునరావు తెలిపారు.



## దిత్వా తుఫాన్లో నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి:జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

నిజాంపట్నం, డిసెంబరు 1, (ప్రభాతవార్త):దిత్వా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిస్తే రైతులు సాగు భూములు నీట మునగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలు జారీచేశారు. దిత్వా తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సోమవారం రేపల్లె నియోజకవర్గంలోని నిజాంపట్నం హార్బర్, పునరావాస కేంద్రాలు, వసతి సౌకర్యాలను పరిశీలించారు.పునరావాస కేంద్రానికి అనుకూలంగా లేని ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేయవలసిందిగా ఆయన సూచించారు.గ్రామ సచివాలయాలను తనిఖీ చేసిన కలెక్టర్ ముందస్తు జాగ్రత్త చర్యలపై సచివాలయాల సిబ్బందికి తగిన సూచనలిచ్చారు.మురుగు కాల్వలు,పంట కాల్వలలో గుర్రపు డెక్క,చెత్త పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి వర్షం నీరు దిగువకు ప్రవహించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.సిద్ధం చేసిన జెసిబి యంత్రాలను కలెక్టర్ పరిశీలించారు.గజ ఈతగాళ్లకు పంపిణీ చేసిన సంరక్షణ పరికరాలు,లైఫ్ జాకెట్లు,టార్పలిన్లు,రోప్,ఎయిర్ బెలూన్స్ ను పరిశీలించారు.రేపల్లె ప్రధాన కాల్వ వద్ద మరమ్మతులకు చేసిన లాకులను కలెక్టర్ పరిశీలించారు.తుఫాన్ సమయంలో సముద్ర జలాలు కాల్వలోకి ప్రవహించకుండా గేట్లు ఎంతో ఉపయోగపడతాయని అధికారులు చెప్పటంతో రేపల్లె తహసీలు ఎగువ ప్రాంతాలలో నీరు సమృద్ధిగా ప్రవహించటానికి వీలైన ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు.లాకుల నిర్వహణ సరిగా పనిచేయనందున గత తుఫాన్ సమయంలో ఎగువలోని పంటలకు ఎకరాలు నీటమునిగాయని జెసిబి యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. భారతీయ తీర రక్షణ దళం కార్యాలయాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్ పరిశీలించారు.తీరప్రాంత సంరక్షణపై కమాండెంట్ రాజేంద్ర స్వరూప్‌తో చర్చించారు.భారతీయ తీర రక్షణ దళం పనితీరు,అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞాన యంత్రాలను అడిగి తెలుసుకున్నారు.నూతనంగా లైట్ హౌస్ నిర్మాణానికి అవసరమైన 1.5 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడి గోతాలు,టార్పలిన్ పట్టాలను పంపిణీ చేశారు. రేపల్లె ఆర్డీవో ఎన్.రామలక్ష్మి,తహశీల్దార్ శ్రీనివాసులు,ఎంపిడిఓ నాగలక్ష్మి,పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## డ్వాక్రా సంఘాలకు సఖీ సురక్ష



మాచర్ల, డిసెంబరు 1 ప్రభాతవార్త: మాచర్ల మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా ఆఫీసు పరిధిలో సఖీ సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్వాక్రా సంఘాలకు చెందిన 35 సంవత్సరాలు దాటిన మహిళల కోసం ఉచిత హెల్త్ టెస్టులు నిర్వహించారు. అదేవిధంగా అర్హులైన మహిళలకు ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులు జారీ చేయనున్నారు. పట్టణ మెప్మా డ్వాక్రా స ంఘాలకు చెందిన మహిళలు ఈ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వేణుబాబు, డాక్టర్ ఆయుష్ కోరారు.

## మాచర్ల - కర్నూలు బస్సుసర్వీసును పునరుద్ధరించాలి

మాచర్ల, డిసెంబరు 1 ప్రభాతవార్త: మాచర్ల-కర్నూలు బస్సు సర్వీవసును పునరుద్ధరించాలని కోరుతూ ప్రయాణికులు వినతులు అందజేస్తున్నారు. విన్నవించిన ప్రతిసారి కొత్త బస్సు రాగానే ప్రారంభిస్తామని డిపో మేనేజరు మాటలకే పరిమితమవుతున్నారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమం ప్రతినెలా జరపకుండా మూడు నెలలకోసారి జరుపుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. మాచర్ల-కర్నూలు బస్సు సర్వీసు గత 20 సంవత్సరాలుగా నడుస్తుంది. గత వైసీపీ ప్రభుత్వం సర్వీసును నిలిపివేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం ద్వారా కర్నూలుకు బస్సు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. కర్నూలు బస్సు సర్వీసు వల్ల బెంగళూరు, బళ్లారి, మంత్రాలయం పట్టణాలకు సౌకర్యం కలుగుతుంది. సంబంధిత అధికారులు దృష్టిసారించి కర్నూలుకు బస్సు సర్వీసును నడపాలని ప్రయాణికులు కోరారు.



## వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ పర్యటన

మాచర్ల, డిసెంబరు 1 ప్రభాతవార్త: ఏపీ వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లెల ఈశ్వరరావు మాచర్లలో పర్యటించారు. వడ్డెర సామాజిక వర్గాన్ని ఉద్దేశించి ఆత్మీయ పర్యటన నిర్వహించారు. వడ్డెరల సమస్యలు, అవసరాలు తెలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎలా పొందుతున్నారో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వడ్డెర సామాజిక వర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ కొమెర దుర్గారావు, జనసేన పట్టణ నాయకులు, న్యాయవాది బత్తుల బాబురావు, బీజేపీ నాయకులు ఓర్సు క్రాంతి కుమార్, టీడీపీ నాయకులు మంజుల వెంకటేశ్వర్లు, దేరంగుల దాసరయ్య, బండారు శ్రీను, కొమెర శివ తదితరులు పాల్గొన్నారు.



## రెండోసారి రాష్ట్రఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షునిగా శివ

మాచర్ల, డిసెంబరు 1 ప్రభాతవార్త: ఏపీ రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికై మాచర్ల పట్టణానికి వచ్చిన సందర్భంగా స్థానిక ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా ప్రతినిధులు రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఏచూరి శివ ఎల్లప్పుడు కృషి చేస్తున్నారు. రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం హర్షణీయమన్నారు. జర్నలిస్టులకు ప్రభుత్వ పథకాలు అందేలా అక్రెడిటేషన్, ఇన్సూరెన్సు, సేఫ్టీ ప్రొటెక్షన్ వంటి భద్రతా చర్యల్ల ఆయన పోరాటాన్ని ప్రశంసించారు. మాచర్లలో మీడియా అభివృద్ధికి మరింత సహకారం అందిస్తామని శివ హామీ ఇచ్చారు. సన్మాన కార్యక్రమంలో మాచర్ల ప్రాంతానికి చెందిన ఎలక్ట్రానిక్ మాడియా, ప్రింట్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.



## ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో పేదలకు ఆర్థిక భరోసా: జూలకంటి అక్కిరెడ్డి

వెల్దుర్తి, డిసెంబరు 1 ప్రభాతవార్త: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు పారదర్శకంగా నేరుగా అందించే కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ యువనాయకుడు జూలకంటి అక్కిరెడ్డి వెల్దుర్తి మండలంలో సోమవారం పర్యటించి ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు లబ్ధిదారులకు సామాజిక పింఛన్లు అందించేందుకు స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు సహా వివిధ వర్గాల వారికి పింఛను అందజేశారు. ఈ సందర్భంగా అక్కిరెడ్డి మాటాన్లడుతూ పేదల ప్రజల కనీస అవసరాలను తీర్చడానికి వారికి పెద్ద ఆర్థిక భరోసా కల్పించడానికి పింఛన్లు దోహదపడతాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడటం ప్రతి కార్యకర్త బాధ్యత అన్నారు. పింఛను అందుకున్న లబ్ధిదారులు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో వెల్దుర్తి మాజీ సర్పంచి కేశిరెడ్డి వెంకటరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు జూలకంటి చిరంజీవిరెడ్డి, కాయితి భాస్కర్‌రెడ్డి, కేశిరెడ్డి హనిమిరెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## అన్ని ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

కారంపూడి, డిసెంబరు 1 ప్రభాతవార్త: అన్ని ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఒప్పిచరర్ల గ్రామంలో దశాబ్ధాలుగా మరుగున పడిన ఎస్‌పేట రోడ్డుకు మోక్షం కలిగిందన్నారు. రూ.70 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ, శంకుస్థాపన నిర్వహించారు. అనంతరం జడ్పీ హైస్కూలులో 56.79 లక్షలతో నిర్మించిన ఆరు తరగతి గదులను ఆయన ప్రారంభించారు. సీఎం చంద్రబాబు మాచర్ల నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి పనులను పట్టాలెక్కిరిస్తున్నారన్నారు. ప్రభుత్వ విద్యకు పూర్వవైభవం తీసుకొచ్చేలా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అహర్నిశలు శ్రమిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆపన్నులకు బాసట ఎన్టీఆర్ భరోసా ఫింఛన్లు: ఎమ్మెల్యే



కారంపూడి, డిసెంబరు 1 ప్రభాతవార్త: ఆపన్నులకు బాసట ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ బీసీ కాలనీలో సామాజిక పింఛన్లు అందజేసి ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి సామాజిక పింఛన్లను ఏకంగా వెయ్యి రూపాయలు పెంచి రూ.4 వేలు ఇస్తున్నారన్నారు.

**నూతన సీసీ రోడ్డు ప్రారంభం:** స్థానిక ఎన్టీఆర్ బీసీ కాలనీలో రూ.30 లక్షలతో నిర్మించిన నూతన సీసీ రోడ్డును ఎమ్మెల్యే జూలకంటి ప్రారంభించారు. రెండు దశాబ్దాలుగా వైసీపీ మాచర్ల నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేసి, దోచుకున్నారన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం నియోజకవర్గానికి పెద్దఎత్తున నిధులు కేటాయించి సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కారంపూడి మండల కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరోగ్యాంధ్రనే కూటమి.. లక్ష్యం

కారంపూడి, డిసెంబరు 1 ప్రభాతవార్త: ఆరోగ్యాంధ్ర లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి స్పష్టం చేశారు. మండల పరిధిలోని పెద్దకొదమగుండ్ల గ్రామంలో రూ.36 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సోమవారం ఎమ్మెలేన భూమిపూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.



## అర్హులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



అచ్చంపేట డిసెంబర్ 1 (ప్రభాతవార్త) : అచ్చంపేట రాజీవ్‌నగర్ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను అర్హులైన కుటుంబాలకు పంపిణీ చేశారు. అర్హులైన ప్రతీ కుటుంబానికి భరోసా ఇవ్వడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రాయుడు సాంబశివుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెనిగండ్ల కొటయ్య, టిడిపి సీనియర్ నాయకులు ఎస్‌కే కాసుల, యూనిట్ ఇన్‌ఛార్జ్ తిరువాయిపాటి ఆంజనేయులు, 51వ బూత్ కన్వీనర్ సంపంగుల రాంబాబు, సంపంగుల వెంకటప్రసాద్, కోటా చంటి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద భరితంగా నదిలో పడవ ప్రయాణం-సీజ్ చేసిన ఎంపీడీవో

అచ్చంపేట డిసెంబర్ 1 (ప్రభాతవార్త) : అచ్చంపేట: కృష్ణా నదిలో పడవ ప్రయాణం ప్రమాద భరితంగా కొనసాగుతుందని స్థానిక ప్రజలు తెలిపారు. జడ్పీ నిబంధనల ప్రకారం నడవాల్సిన పడవలు వాటికి విరుద్ధంగా నడుపుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పడవలలో బైక్ తరలించరాదనే నిబంధనలు ఉన్నప్పటికీ బైక్ పై వెళ్లే వ్యక్తుల నుంచి ..100 వసూలు చేస్తూ ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని స్థానికులు తెలిపారు. మాదిపాడు, తాడువాయి, చింతపల్లి, చామర్తి, కె.వి.పాలెం పరిసర ప్రాంతాల్లోని పడవలు ఫిట్నెస్ లేకుండా మాత్రమే కాకుండా ఓవర్‌లోడ్‌తో ప్రయాణిస్తున్నాయని వారు చెప్పారు. పుట్లగూడెం బల్లకట్టులో అధిక ధరలు వసూలు చేస్తూ, ఎలాంటి భద్రతా చర్యలు లేకుండా ప్రయాణాలు జరుగుతున్నాయని విమర్శించారు. సీసీ కెమెరాలు, టికెట్ ధరల పట్టిక, వాహన రాకపోకలు చూపించకుండా ఇష్టారాజ్యంగా అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై జడ్పీ సీఈవో స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పడవలను సీజ్ చేశామని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పర్యవేక్షణ చేసి, నిబంధనలు పాటించని ఫిట్నెస్ లేని పడవలను సోమవారం సీజ్ చేసినట్టు వెల్లడించారు.



## విలువలతో కూడిన విద్య అవసరం: ఎస్ ఐ అనీల్

ముప్పాళ్ళ డిసెంబర్1 ప్రభాతవార్త: ముప్పాళ్ళ మండలం గొల్లపాడు కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం నందు ..హెల్ప్ ఫౌండేషన్( సత్తనపల్లి)ఆధ్వర్యం లో విలువలతో కూడిన.. ..విద్య.. అనే అంశంపై అవగాహన మరియు ..హెల్ప్ ఫౌండేషన్.. సభ్యులు ..సోమశేఖర్.. ఆర్థిక సహకారంతో అమ్మానాన్న లేని చిన్నారులకు చలి కోట్లు పంపిణీ. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముప్పాళ్ళ మండల సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ .. అనిల్ కుమార్.. ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ చదువు తో పాటు విలువలు ముఖ్యమని సాధించిన విజయమే మీ నిజమైన సౌందర్యం , విలువలు కలిగిన వ్యక్తి పరిపూర్ణ వ్యక్తిగా మారతారని విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలి అంటే నైతిక విలువలు కలిగి ఉండాలని వీటి ద్వారా సరైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని, సానుకూల దృక్పథం తో పాటు మంచి ఆలోచన విధానము కలిగి ఉంటారని సమాజంలో మంచి సంబంధాలను ఏర్పర్చుకోవటానికి అవకాశం ఉంటుందని పేదరికం ను జయించి చరిత్ర సృష్టించేది చదువు ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని అన్నారు.. మరొక ముఖ్య అతిధి ముప్పాళ్ళ ..మండల ఏపీఎం.. బాలస్వామి మాట్లాడుతూ విద్యార్థులు విలువలు కలిగి ఉన్నప్పుడు ఆత్మ విశ్వాసం ఎక్కువగా ఉంటుందని దాని ద్వారా క్రమశిక్షణ ఏకాగ్రత వంటి లక్షణాలను కలిగి ఉండడానికి అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపల్ ఝాన్సీ అధ్యక్షత వహించారు కార్యక్రమానికి ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ..హెల్ప్ ఫౌండేషన్.. వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు సభ్యులు సురేష్ , మురళీకృష్ణ ఉపాధ్యాయులు విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు



## ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

క్రోసూరు, డిసెంబర్ 1 ప్రభాతవార్త: ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ అన్నారు సోమవారం అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పలనాడు జిల్లా క్రోసూరు మండలం ఎర్రబాలెంలో జరిగిన ప్రదర్శన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు ఎయిడ్స్ నిర్మూలన మన బాధ్యత అనే సందేశంతో ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా శాంసన్ హెచ్ఐవి వ్యాధి వ్యాప్తికి కారణాలు, వ్యాధి లక్షణాలు వివరించారు అ సురక్షిత లైంగిక సంబంధాలు పెట్టుకోవడం, స్టెరలైజ్ చేయని సూది మందులు తీసుకోవడం, రక్తమార్పిడికి ముందు రక్త పరీక్షలు చేయకపోవడం, హెచ్ఐవి సోకిన తల్లి గర్భం దాల్చిన లేక ప్రసవించిన లేక రొమ్ము పాలు త్రాగిన శిశువుకు ఈ వైరస్ సోకుతుంది అన్నారు ప్రపంచ ఎయిడ్స్ దినం 2025 థీమ్ గా "అవాంతరాలను అధిగమిస్తూ పరివర్తన దిశగా ప్రజా స్పందన కార్యాచరణ అమలు"అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయటం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఉప్పు రజిని, ఆరోగ్య కార్యకర్త బి ధనలక్ష్మి, అంగన్వాడీ టీచర్ బి మల్లిక, ఆశా కార్యకర్తలు కే పార్వతి జె సుస్మిత, కే గౌతమ్ తదితరులు పాల్గొన్నారు



## పేదలకు భరోసా కల్పించేలా పింఛన్ల పంపిణీ: మద్దిరాల గంగాధర్

పెదకూరపాడు, డిసెంబర్ 1, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశానుసారం, పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ సూచనలతో గారపాడు గ్రామంలో పింఛన్ పంపిణి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ పాల్గొని పింఛన్లు పంపిణి చేసారు. ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబం ఆనందంగా జీవించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు పింఛన్ పథకాన్ని విస్తృతంగా అమలు చేస్తున్నారు. పింఛన్ అర్హత కలిగినవారు లబ్ధి పొందే వరకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, సంక్షేమ పాలన ఫలితంగా ప్రతి ఇంటికి సంతోషం చేరుతోంది. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి తీసుకెళ్తామని అన్నారు. మక్కెన సాగర్, పెనుముచ్చు రమేష్, మేడా రమణ, పొదిలి కోటేశ్వరరావు, పెనుముచ్చు కరుణాకర్ మరియు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఏపీ ఎన్జీజీవోస్ నూతన అధ్యక్షుడిని ఘనంగా సన్మానించిన దళిత నాయకులు

క్రోసూరు, డిసెంబర్ 1, ప్రభాతవార్త: క్రోసూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, డాక్టర్ బాబు జగజీవన్ రామ్ విగ్రహాల వద్ద ఆంధ్రప్రదేశ్ ఎన్జీజీవోస్ అసోసియేషన్ పెదకూరపాడు తాలూకా యూనిట్ నూతన అధ్యక్షుడిగా నియమితులైన పోసిపోగు వెంకట్రావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర హానరరీ చైర్మన్"సేవారత్న" గార్లపాటి దాసు, ఆంధ్రప్రదేశ్ చర్మకారుల సేవా సంఘం బంగారు జిల్లా అధ్యక్షులు చిలక భాస్కరరావు, పెదకూరపాడు నియోజకవర్గ బీఎస్పీ నాయకులు గనిపల్లి రాజశేఖర్, డాక్టర్ నందిగం శ్రీనివాసరావు, వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దుద్దుల యెహోవాను, పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకులు వేమవరపు జీవన్ మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నందిగం దేవదాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎక్స్టెన్షన్ అధికారి శిఖ సామ్సన్, హెల్త్ సూపర్వైజర్ శివుడు, హెల్త్ అసిస్టెంట్ ప్రేమ్ రాజ్, సేవల శ్రీనివాసరావు, చిలక రవి, చిలక మరియదాసు, చిలక నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గార్లపాటి దాసు తెలిపారు:వెన్కట్రావు 14 ఏళ్లుగా హెల్త్ డిపార్ట్మెంట్‌లో ఎక్స్టెన్షన్ అధికారిగా పనిచేస్తూ వివిధ జిల్లాలలో విశేష సేవలు అందించారు. ప్రస్తుతం మాదిపాడు లో పనిచేస్తున్న ఆయనను ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ ఏకగ్రీవంగా ఎన్నుకోవటం హర్షణీయమైన విషయం. వెంకట్రావుకు త్వరలోనే హెల్త్ డిపార్ట్మెంట్‌లో ప్రమోషన్ రావాలని, అసోసియేషన్ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని" అన్నారు



## రాజధానిలో పొట్టిశ్రీరాములు కాంస్య విగ్రహం ఏర్పాటు

కారంపూడి, డిసెంబరు 1 ప్రభాతవార్త: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డుండి రాకేష్, పల్నాడు జిల్లా సంఘం అధ్యక్షులు అత్తులూరి సుబ్బారావు, జిల్లా ఐవీఎఫ్ అధ్యక్షులు పెనుకొండ శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. రాకేష్ మాట్లాడుతూ అమరావతిలో అమరజీవి పొట్టిశ్రీరాములు కాంస్య విగ్రహం, స్మృతి వనం ఏర్పాటు, ఆర్యవైశ్య కార్పొరేషన్ కార్యాచరణపై వివరించారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఎస్వీఆర్ కృష్ణ, దేవస్థానం అధ్యక్షులు మద్దు హనుమంతరావు, సముద్రాల పవన్‌సాయి, జాగృతి క్లబ్ అధ్యక్షుడు కరాలపాటి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



02-12pg10 12 GNT_02-12pg10.qxd 01/Dec/25 10:24 PM Page 1



# వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ బౌలింగ్ కింగ్స్

## అత్యధిక వికెట్లు తీసిన టాప్ 5 బౌలర్లు

**న్యూఢిల్లీ:** ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ మొదలైనప్పటి నుంచి టెస్ట్ క్రికెట్‌లో బౌలర్ల పాత్ర మరింత ముఖ్యమైంది. సుదీర్ఘ స్పెల్‌లు, మ్యాచ్ గమనాన్ని మార్చే బంతులు, కష్టమైన పరిస్థితుల్లో వికెట్లు తీయగల సామర్థం, వీటితో కొందరు బౌలర్లు డబ్ల్యూటీసీ చరిత్రలోనే తమదైన ముద్ర వేశారు. ప్రస్తుతం డబ్ల్యూటీసీలో అత్యధిక వికెట్లు తీసిన టాప్5 జాబితాలో ముగ్గురు ఆస్ట్రేలియా, ఇద్దరు భారతీయ బౌలర్లు ఉన్నారు. డబ్ల్యూటీసీ చరిత్రలో అత్యధిక వికెట్లు (219) తీసిన బౌలర్‌గా ఆస్ట్రేలియా ఆఫ్‌స్పిన్నర్ నాథన్ లయన్ అగ్రస్థానంలో ఉన్నాడు. 2019 నుంచి అతను ఈ ఫీట్‌ను సాధించాడు. లయన్ బౌలింగ్‌లో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది అతని లైన్ లెంగ్త్, బ్యాట్స్‌మెన్‌లను తప్పు చేయడానికి ఉసిగొల్పే సామర్థ్యం. అతని బెస్ట్ స్పెల్ 8/64. అతను 13 సార్లు నాలుగు వికెట్లు, 10 సార్లు ఐదు వికెట్లు తీశాడు. అలాగే ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ 215 వికెట్లతో లయన్‌కు చాలా దగ్గరగా ఉన్నాడు. అతని పేస్, స్వింగ్, బౌన్స్ ద్వారా కమిన్స్ డబ్ల్యూటిసిలో అనేక మ్యాచ్‌లు గెలిపించాడు. అతని అద్భుతమైన సగటు 22.13, బెస్ట్ స్పెల్ 6/28తో అతను ప్రపంచంలోని అత్యంత ప్రమాదకరమైన బౌలర్‌లలో ఒకడిగా నిలిచాడు. లెఫ్ట్ హ్యాండ్ పేసర్ మిచెల్ స్టార్క్ తన ఇన్‌స్వింగ్ యార్కర్లతో, యాంగిల్‌తో బ్యాట్స్‌మెన్‌లను ఇబ్బంది పెడతాడు. స్టార్క్ ఇప్పటివరకు 201 వికెట్లు తీశాడు. అతని స్ట్రైక్ రేట్ (43.33) చూస్తే, అతను పాత బంతితో, కొత్త బంతితో కూడా క్రమం తప్పకుండా వికెట్లు తీయగల ప్రమాదకరమైన బౌలర్ అని అర్థమవుతుంది. ఇక టీమిండియా గ్రేట్ స్పిన్నర్ ఆర్. అశ్విన్ డబ్ల్యూటీసీలో 195 వికెట్లు తీశాడు. అతని బెస్ట్ బౌలింగ్ ఫిగర్ 7/71. అత్యంత తక్కువ బౌలింగ్ సగటు 21.49 కలిగి ఉన్న బౌలర్‌లలో అతను ఒకడు. స్పిన్, ఫ్లైట్, వేగంలో మార్పుల ద్వారా అశ్విన్ ఎల్లప్పుడూ బ్యాట్స్‌మెన్‌లకు పెద్ద సవాలు విసురుతాడు. మరో భారత్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ఇప్పటివరకు 184 వికెట్లు తీసి టాప్5లో నిలిచాడు. అతని సగటు 18.90, స్ట్రైక్ రేట్ 40.53తో అతను ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన ఫాస్ట్ బౌలర్లలో ఒకడు అని నిరూపించాడు. బుమ్రా ప్రత్యేకమైన బౌలింగ్ యాక్షన్, రివర్స్ స్వింగ్‌తో ప్రపంచంలోని ప్రతి బ్యాట్స్‌మెన్ ఇబ్బంది పడతాడు.



ఆట



### సుల్తాన్ అజ్లాన్ షా కప్..

# భారత్ ఓటమి

### 0-1 తేడాతో బెల్జియం గెలుపు

**న్యూఢిల్లీ:** సుల్తాన్ అజ్లాన్ షా కప్-2025, బెల్జియం చేతిలో 0-1 తేడాతో భారత్ ఓడిపోయింది. దీంతో భారత్ జట్టు రజత పతకంతో సరిపెట్టుకుంది. మలేషియాలోని ఇపోలో జరిగిన ఉత్కంఠభరితమైన ఫైనల్లో భారత్‌ను చిత్తు చేసిన బెల్జియం సుల్తాన్ అజ్లాన్ షా కప్‌ను గెలుచుకుంది. 34వ నిమిషంలో థిబ్యూ స్టాక్‌బ్రోక్స్ చేసిన ఏకైక గోల్ కారణంగా భారత్ రజత పతకంతో సరిపెట్టుకోవలసి వచ్చింది. అంతకు ముందు కెనడాపై 14-3 తేడాతో భారీ విజయం సాధించిన తర్వాత ఈ మ్యాచ్‌లోకి అడుగుపెట్టిన భారత్, తమకు లభించిన మూడు పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మార్చలేకపోయింది. ఈ టోర్నమెంట్‌లో జుగ్‌రాజ్ సింగ్, అమిత్ రోహిదాస్, సంజయ్ విజయం సాధించినప్పటికీ, వారు బెల్జియన్ రక్షణను ఓడించలేకపోయారు. ఈ టోర్నమెంట్‌లో భారత్ ఎదుర్కొన్న ఏకైక ఓటమి లీగ్ దశలో బెల్జియం చేతిలోనే జరిగింది. ప్రాథమిక దశలో బెల్జియం భారత్‌పై 3-2 తేడాతో విజయం సాధించింది. రెండు జట్ల మధ్య తీవ్రమైన మిడ్‌ఫీల్డ్ పోరాటాలు జరిగాయి. మొదటి అర్ధభాగం గోల్ లేకుండా ముగిసింది, కానీ రెండు జట్లు వ్యూహాత్మక ఆటను ప్రదర్శించాయి. బెల్జియం ప్రారంభంలో రెండు పిసిలు సంపాదించినప్పటికీ, భారతదేశం వారిని దూరంగా ఉంచడంలో బాగానే చేసింది. మ్యాచ్‌లో స్థిరపడటానికి భారతదేశం కొంత సమయం పట్టింది, ఆట అర్ధభాగంలో 0-0తో సమంగా ఉండటంతో, బెల్జియం తన జోరును మార్చుకుని భారత్‌పై ఒత్తిడి పెంచింది. భారత జట్టు మూడవ క్వార్టర్‌లో కూడా బెల్జియన్ డిఫెన్స్‌ను అధిగమించలేకపోయింది. 34వ నిమిషంలో స్టాక్‌బ్రోక్స్ గోల్ చేయడంతో భారతదేశం స్కోరును సమం చేయడానికి తీవ్రంగా ప్రయత్నించింది. కానీ బెల్జియం విజయాన్ని ముగించడంలో విజయవంతమైంది.

## ట్రయాంగిల్ సిరీస్‌లో.. సంయుక్త విజేతగా భారత్, అఫ్ఘానిస్థాన్

**న్యూఢిల్లీ:** అండర్ 19 ట్రైయాంగిల్ వన్డే టోర్నమెంట్‌లో భారత్, అఫ్గనిస్తాన్ జట్టు సంయుక్తంగా విజేతలుగా నిలిచాయి. ఈ రెండు జట్ల మధ్య జరగాల్సిన ఫైనల్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. దిత్వా తుపాను ప్రభావంతో బెంగుళూరులో భారీ వర్షం కురియడంతో మ్యాచ్‌ను 31 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 19 ఓవర్లలో 5 వికెట్లు నష్టానికి 79 పరుగులు చేసిన దశలో వెలుతురు లేమి, వర్షం కారణంగా మ్యాచ్‌ను నిలిపివేశారు. ఆ తర్వాత ఎంత సేపు ఎదురు చూసినా వర్షం తగ్గుముఖం పట్టకపోవడం, ఆట తిరిగి ప్రారంభించే పరిస్థితులు లేకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. తదుపరి రెండు జట్లు సంయుక్త ఛాంపియన్లుగా ప్రకటించారు. ఇక భారత్ బ్యాటర్లలో కనిష్క్ చౌహాన్ (28 నాటౌట్), అభిజ్ఞ కుందు (27) ఫర్వాలేదనిపించగా, కెప్టెన్ విహాన్ మల్హోత్రా (10), వన్ష్ అచార్య (2), వఫి (2), వినీత్ (0) విఫమయ్యారు. అఫ్గాన్ బౌలర్లలో అబ్దుల్ అజీజ్ 2 వికెట్లు పడగొట్టాడు.



### ఆసియా కప్ క్వాలిఫయర్స్..

## భారత్‌కు ఫైనల్ బెర్త్ కన్ఫమ్

### ఇరాన్‌పై గెలుపు

**న్యూఢిల్లీ:** ఎఎఫ్‌సి పురుషుల అండర్ 17 ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో ఇరాన్‌పై విజయంతో భారత్ ఆసియా కప్ ఫైనల్స్‌కు చేరుకుంది. అహ్మదాబాద్‌లో జరిగిన క్వాలిఫయర్స్‌లో ఇరాన్‌పై 2-1 తేడాతో విజయం సాధించి భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు తమ స్థానాన్ని బుక్ చేసుకుంది. ఏడు పాయింట్లతో ఇరాన్ ఈ మ్యాచ్‌లో ఫేవరెట్‌గా అడుగుపెట్టి అజేయంగా నిలిచింది. అయితే జట్టు ముందుకు సాగడానికి ఒక డ్రా మాత్రమే అవసరం ఉంది. నాలుగు పాయింట్లతో ఉన్న భారత్‌కు విజయం తప్ప మరో అవకాశం లేదు. మొదట 45+1 నిమిషంలో ఫార్వర్డ్ ఆటగాడు డల్లాల్మున్ గాంగ్టే పెనాల్టీని గోల్‌గా మార్చడంతో స్కోరు సమమైంది. ఆ తర్వాత 52వ నిమిషంలో గున్లీబా వాంగ్ఖైరక్పామ్ విజేతను గోల్‌గా మార్చింది. మొదట 10వ నిమిషంలో కెప్టెన్ మహాన్ బెహెష్టి చేసిన లాంగ్ రేంజ్ ప్రయత్నాన్ని తప్పించారు. ఆట ముగిసే సమయానికి, ఎడమ వైపు నుండి వచ్చిన ఒక కార్నర్ ఇరానియన్ బాక్స్ లోపల గందరగోళానికి దారితీసింది. డిఫెండర్ అమీర్మహాన్ ఆఫ్రోజియాని లూపింగ్ బంతిని క్లియర్ చేయడంలో విఫలమయ్యాడు. భారత్ 2-1 ఆధిక్యంలో ఉంది. దీంతో ఇరాన్ ముందుకు దూసుకెళ్లి 64వ నిమిషంలో బెహెష్టి చేసిన ప్రమాదకరమైన ఫ్రీకిక్ సర్కార్ నుండి మరో విన్యాసపూరిత సేవ్ చేయడంతో భారత్ గెలుపు అనివార్యమైంది.

### ప్రపంచ కప్‌లో..

## జపాన్ గెలుపు

### 4-8 తేడాతో భారత్ చిత్తు

**న్యూఢిల్లీ:** ఐటీటీఎఫ్ మిక్స్‌డ్ టీమ్ ప్రపంచ కప్‌లో జపాన్ చేతిలో భారత్ ఓడిపోయింది. ఐటీటీఎఫ్ మిక్స్‌డ్ టీమ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం ఉత్సాహభరితమైన ప్రదర్శనను అందించింది కానీ ఆదివారం జరిగిన రెండవ పూల్‌స్టేజ్ మ్యాచ్‌లో జపాన్ చేతిలో 4-8 తేడాతో చిత్తుగా పరాజయం చెందింది. మానికా బాత్రా-మానవ్ ఠక్కర్ టాప్ 10 ప్రపంచ ప్రత్యర్థులపై విజయాలు నమోదు చేశారు. మివా హరిమోటో-షున్సుకే టోగామి చేతిలో మిక్స్‌డ్ డబుల్స్ ఓపెనర్ యశస్విని ఘోర్పడే-ఆకాష్ పాల్ 0-3 తేడాతో ఓడిపోవడంతో జపాన్ ఆరంభంలో ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ వరుస గేమ్‌ల ఓటమితో భారత్ తీవ్ర ఒత్తిడిలోకి ఎదుర్కొంది. ఆ తర్వాత మానికా బాత్రా తన కెరీర్‌లో అత్యుత్తమ ఫలితాల్లో ఒకటిగా నిలిచింది. ప్రపంచ 8వ ర్యాంక్‌లో ఉన్న మిమా ఇటోను 2-1 (9-11, 11-8, 11-8)తో ఓడించింది. ఈ విజయం జపాన్ స్టార్‌పై ఆమె తొలి విజయాన్ని నమోదు చేసి మొత్తం టైను 1-1తో సమం చేసింది. ప్రపంచ 8వ ర్యాంకర్ సోరా మత్సుషిమాపై జరిగిన పురుషుల సింగిల్స్ రబ్బర్‌లో మానవ్ ఠక్కర్ అద్భుతమైన ప్రదర్శనతో భారత్‌కు రెండో విజయాన్ని అందించాడు. ఠక్కర్ 2-1 (11-9, 11-4, 6-11)తో విజయం సాధించి, టైలో భారత్‌ను తొలిసారిగా ఆధిక్యంలో నిలిపాడు. అయితే, మహిళల డబుల్స్ ద్వారా జపాన్ తిరిగి నియంత్రణ సాధించింది. హినా హయాటా మరియు మిమా ఇటోల జోడీ 3-0తో దియా చిటాలే మరియు యశస్విని ఘోర్పడేలను ఓడించి జపాన్ ఆధిక్యాన్ని పునరుద్ధరించింది. జపాన్ మిగిలిన రబ్బర్లను సమర్ధవంతంగా ఓడించి 8-4 ఫలితాన్ని సాధించింది.

## రూ.10 తగ్గిన వాణిజ్య సిలిండర్‌ధర!

**న్యూఢిల్లీ,డిసెంబరు 1:** వినియోగదారులకు ప్రభుత్వ చమురు మార్కెటింగ్ సంస్థలు గుడ్ న్యూస్ చెప్పాయి. దేశ వ్యాప్తంగా మెట్రో నగరాల్లో ఎల్పీజీ వాణిజ్య సిలిండర్ ధరను తగ్గించాయి. 19 కిలోల వంట గ్యాస్ సిలిండర్ ధర రూ .10 తగ్గిస్తున్నట్లు సోమవారం ప్రకటించాయి. తగ్గిన ధరలు ముంబై, కోల్‌కతా, హైదరాబాద్, చెన్నై సహా దేశవ్యాప్తంగా నేటి నుంచి అమల్లోకి వస్తా యి.ప్రతి నెల 1వ తేదీన ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ధరలను సవరిస్తుంటాయి. అందులో భాగంగా గానే తాజాగా సవరించిన ధరలు వెల్లడించాయితాజా తగ్గింపుతో దేశ రాజధాని ఢిల్లీలో 19 కిలోల



కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.1,580గా ఉంది. గతంలో ఇది రూ.1,590గా ఉండేది. కోల్‌కతాలో రూ.1,694 నుంచి రూ.1,684కు తగ్గింది.ఇక ముంబైలో రూ.1,542గా ఉన్న ధర రూ.1,531.50కి దిగొచ్చింది. హైదరాబాద్‌లో కమర్షియల్ ఎల్పీజీ ధర రూ.1,746 నుంచి రూ. 1,736కు తగ్గింది. మరోవైపు, గృహ వినియోగం కోసం ఉపయోగించే 14.2 కిలోల సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులేదు. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో వంట గ్యాస్ ధర రూ.850 నుంచి రూ.960 మధ్య ఉంది.

## మందగించిన పారిశ్రామిక ఉత్పత్తిసూచీ వృద్ధి

**న్యూఢిల్లీ, డిసెంబరు1:** భారత పారిశ్రామిక ఉత్పత్తిసూచీ అక్టోబరులో మందగించింది. 0.4శాతంమాత్రమే పెరిగింది. కేంద్ర అర్థగణాంకశాఖ విడుదలచేసిన వివరాలనుపరిశీలిస్తే పండుగ దినాలు, దసరా, దీపావళి, ఛాత్ పండుగల కారణంగా ఉత్పత్తి మందగించినట్లు తేలింది. సెప్టెంబరులో ఉన్న 4శాతం వృద్ధినుంచి వెనుకబడింది. 2024 అక్టోబరులో అయితే 3.5శాతం వృద్ధినమోదుచేస్తే ఆస్థాయికి కూడా గత అక్టోబరు నమోదుకాలేదు. మౌలిక వనరులు, నిర్మాణరంగ ఉత్పత్తులు 7.1శాతంగా పెరిగాయి. క్యాపిటల్ గూడ్స్ అంటే భారీ యంత్రసామగ్రి విభాగం



2.4శాతం, అంతర్ వస్తూత్పత్తి తయారీ రంగం 0.9శాతం పెరిగింది. ప్రాథమిక ఉత్పత్తులు 0.6శాతం తగ్గాయి. వినియోగరంగ ఉత్పత్తులు 0 .5శాతం, ఇతర నాన్ డ్యూరబుల్ ఉత్పత్తులు 4.4శాతం క్షీణించాయి. ఉత్పత్తిరంగంలో మెటల్స్, ఆటోమొబైల్స్ కొంత మద్దతిచ్చాయి. ఉత్పత్తిరంగం పరంగా మొత్తం 1.8శాం వృద్దిని నమోదుచేసింది. ప్రాథమిక మెటల్స్ 6.6శాతం, కోక్, రిఫైండ్ పెట్రోలియం ఉత్పత్తులు 6.2శాతం, మోటారు వాహణాలు,ట్రైలర్లు, సెమీ ట్రైలర్లు 5.8శాతం ఉత్పత్తి నమోదుచేసింది. ఆటోమొబైల్‌పరంగా ఆటో విడిభాగాలు, ప్యాసింజర్‌కార్లు వాణిజ్యవాహనాల్లో వృద్ధినమోదయింది.

వాణిజ్యం




## జిఎస్టీ వసూళ్లు స్వల్పవృద్ధి మాత్రమే!

**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** జిఎస్టీ వసూళ్లు నవంబరులోస్వల్పంగా0.7శాతంమాత్రమే పెరిగాయి. రూ.1,70, 276 కోట్లు వసూలయ్యాయి. గతనెలలో 1.52 లక్షలకోట్లు వసూళ్లు జరిగినట్లు కేంద్రం డేటా విడుదలచేసింది.అదే గత ఏడాది నవంబరులో 1,69,016కోట్లు వసూళ్లు జరిగాయి. ఇక నికరంగా చూస్తే జిఎస్టీ వసూళ్లు నవంబరులో ఈ ఏడాది 1,52,079 కోట్లు రాబట్టినట్లు కేంద్రం వెల్లడించింది. గతఏడాది ఇదేనెలలో రాబట్టిన నికరవసూళ్లతోపోలిస్తే 1.3శాతం పెరిగాయి. స్థూల దేశీయ రాబడులు రూ.1,24,300 కోట్లుగా ఉన్నాయి. దేశీ రాబడుల్లో 2.3శాతంగా క్షీణించింది. 2024 నవంబరులో రూ.1,27,281 కోట్లు వసూళ్లు జరిగాయి. దేశీయరాబడులు రూ.34, 843 కోట్లుసిజిఎస్‌టి, రూ.42,522 కోట్లు ఎస్జీఎస్టీ, రూ.46,934 కోట్లు ఐజిఎస్‌టి రాబడులున్నాయి. వీటికిభిన్నంగా దిగుమతులనుంచి వచ్చిన వసూళ్లు భారీ వ1ద్ధిని నమోదుచేసింది. స్థూల దిగుమతుల రాబడులు ఐజిఎస్టీ రూ.45,976 కోట్లుగా ఉనానయి. 10.2శాతం వృద్ధినమోదయింది. గత ఏడాది నవంబరులో 41,736 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. ఇక రీఫండ్స్ కూడా గతనెలలో 4.0శాతం తగ్గాయి. రూ.18,196 కోట్లుగా ఉన్నాయి. గత ఏడాది ఇదేనెలలో 18,954 కోట్లుగా ఉన్న మొత్తం ఈసారి కట్టడి అయింది. నికర రాబడుల సంఖ్యాపరంగా దేశీయ రాబడి రూ.1,15,558 కోట్లుగా ఉన్నాయి. నికర ఎగుమతులు, దిగుమతుల రాబడులు రూ.36,521కోట్లుగా ఉన్నట్లు కేంద్రం ప్రకటించింది. రాష్ట్రాల వారీగాచూస్తే ఎస్జీఎస్టీ ముందస్తు సెటిల్మెంట్లు ఒకటిశాతం తగ్గాయి. అనేక రాష్ట్రాలు ప్రతికూల వృద్ధిని నమోదుచేయడంతో క్షీణించినట్లు తేలింది. మిజోరమ్ అతితక్కువగా మైనస్ 41% ఆ తర్వాతసిక్కిమ్ మైనస్ 35శాతం, జమ్ముకాశ్మీర్; ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో మైనస్ 15% చొప్పున ప్రతికూల వృద్ధినినమోదుచేసాయి. ఇక ఈశాన్యంలోని అరుణాచల్‌ప్రదేశ్‌లో 33శాతం, నాగాలాండ్‌లో 24శాతం, ఇతర ప్రాదేశిక ప్రాంతాల్లో 20శాతం చొప్పున వృద్ధిని నమోదుచేసినట్లు కేంద్రం వివరించింది.

### భారతీయుల వల్ల అమెరికాకు

## ఎంతో మేలు: ఎలాన్ మస్క్

**వాషింగ్టన్, డిసెంబరు 1:** ప్రతిభావంతులైన భారతీయుల వల్ల అమెరికాకు ఎంతో మేలు జరిగిందని టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ ప్రశంసించారు. జెరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ నిర్వహించిన 'పీపుల్ బై డబ్ల్యూటీఎఫ్' పాడ్‌కాస్ట్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అదే సమయంలో, కొన్ని కంపెనీలు హెచ్1బీ వీసా విధానాన్ని దుర్వినియోగం చేశాయని, అందుకే అమెరికాలో కొన్ని వలస వ్యతిరేక విధానాలు వచ్చాయని అభిప్రాయపడ్డారు. హెచ్1బీ వీసా ప్రోగ్రామ్‌పై మస్క్ తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పారు. కొన్ని ఔట్‌సోర్సింగ్ కంపెనీలు హెచ్ 1బీ వీసా వ్యవస్థను తమకు అనుకూలంగా



మార్చుకున్నాయి (గేమ్డ్ ది సిస్టమ్). ఈ దుర్వినియోగాన్ని అరికట్టాలి. కానీ, అంతమాత్రాన హెచ్1బీ ప్రోగ్రామ్‌ను పూర్తిగా మూసివేయాలనే వాదన సరైంది కాదు. అలా చేస్తే దేశానికి తీవ్ర నష్టం జరుగుతుందని ఆయన వివరించారు. ప్రతిభావంతుల కొరత ఎప్పుడూ ఉంటుందని మస్క్ అన్నారు. కొందరు అనుకున్నట్లు వలసదారుల వల్ల స్థానికులు ఉద్యోగాలు కోల్పోతున్నారనేది ఎంతవరకు నిజమో నాకు తెలియదు. మా కంపెనీలలో క్లిష్టమైన పనులను పూర్తి చేయడానికి తగినంత మంది ప్రతిభావంతులు దొరకడమే కష్టంగా ఉంది. అందుకే, మరింత మంది ప్రతిభావంతులు వస్తే మంచిదేనని తెలిపారు. తమ కంపెనీలలో ప్రపంచంలోని అత్యుత్తమ టాలెంట్ ఉన్నవారికే ప్రాధాన్యం ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇదే సమయంలో, బైడెన్ ప్రభుత్వ వలస విధానాలను మస్క్ తప్పుబట్టారు. బైడెన్ హయాంలో సరిహద్దు నియంత్రణలు లేకపోవడంతో అక్రమ వలసలు భారీగా పెరిగాయి. సరిహద్దులు లేకపోతే అదొక దేశమే కాదని ఆయన విమర్శించారు. గతేడాది అమెరికా జారీ చేసిన హెచ్1బీ వీసాలలో 71 శాతం భారతీయులే పొందడం గమనార్హం.



## మార్కెట్లకు ఆర్‌బిఐ ఎంపిసి భయాలు

### రికార్డుస్థాయికి పెరిగి నష్టాల్లో ముగిసిన సూచీలు

**ముంబయి, డిసెంబరు 1:** భారత రిజర్వ్‌బ్యాంకు మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశం జరగనున్న నేపథ్యంలో వారం ప్రారంభంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. దీనికి తోడు హెవీవెయిట్ షేర్లలో లాభాల స్వీకరణ జరగడంతో సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్లు స్వల్ప నష్టాలతో ముగిశాయి. ఉదయం లాభాలతో ప్రారంభమైనప్పటికీ, ఆ జోరును చివరి వరకు కొనసాగించలేకపోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 64.77 పాయింట్ల నష్టంతో 85,641.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 27.20 పాయింట్లు కోల్పోయి 26,175.75 వద్ద ముగిసింది. రెండో త్రైమాసికం జీడీపీ వృద్ధి మెరుగ్గా నమోదు కావడం, రూపాయి విలువ బలహీనపడటంతో డిసెంబర్‌లో ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు తగ్గాయని విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో మార్కెట్లు ఒక రేంజ్‌కే పరిమితమయ్యాయని వారు పేర్కొన్నారు. దీనికి తోడు నవంబర్‌లో జీఎస్‌టీ వసూళ్లు ఆశించిన స్థాయిలో లేకపోవడం కూడా సెంటిమెంట్‌పై ప్రభావం చూపింది. అయితే, ఆటోమొబైల్ రంగం మాత్రం రాణించింది. నవంబర్‌లో బలమైన అమ్మకాలు, పెళ్లిళ్ల సీజన్ డిమాండ్ వంటివి ఈ రంగానికి కలిసొచ్చాయి. నిఫ్టీ ఆటో సూచీ 0.25 శాతం పెరిగింది. మరోవైపు, నిఫ్టీ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎఫ్ఎంసీజీ రంగాలు నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ ఐటీ సూచీ 0.39 శాతం లాభపడింది. ప్రధాన షేర్లలో బజాజ్ ఫైనాన్స్, సన్ ఫార్మా, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నష్టపోయాయి. టాటా మోటార్స్, మారుతీ సుజుకీ, కోటక్ బ్యాంక్, అదానీ పోర్ట్స్ లాభపడ్డాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఫ్లాట్‌గా ముగియగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.25 శాతం లాభంతో సెషన్‌ను ముగించింది.

### ఇకపై అన్ని ఫోన్లలో 'సంచార్‌సాథీ'

## యాప్ తప్పనిసరి

**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** దేశంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, మొబైల్ ఫోన్ల దొంగతనాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. ఇకపై దేశంలో విక్రయించే అన్ని కొత్త స్మార్ట్‌ఫోన్‌లలో సంచార్ సాథీ అనే ప్రభుత్వ సైబర్ సెక్యూరిటీ యాప్‌ను తప్పనిసరిగా ఇన్‌స్టాల్ చేయాలని మొబైల్ తయారీ కంపెనీలను ఆదేశించింది. ముఖ్యంగా, ఈ యాప్‌ను వినియోగదారులు తమ ఫోన్ల నుంచి తొలగించడం (డిలీట్ చేయడం) సాధ్యం కాదు. ఈ మేరకు కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. సైబర్ మోసాలు, ఫోన్ చోరీలు, ఐఎంఈఐ నంబర్ల ట్యాంపరింగ్ వంటి సమస్యలను ఎదుర్కోవడానికి కేంద్రం ఈ ఏడాది జనవరిలో సంచార్ సాథీ పోర్టల్‌ను, యాప్‌ను ప్రారంభించింది. దీని ద్వారా పోయిన లేదా దొంగిలించబడిన ఫోన్లను సులభంగా ట్రాక్ చేయవచ్చు. ఇప్పటివరకు ఈ యాప్ సహాయంతో సుమారు 7 లక్షల చోరీ ఫోన్‌లను గుర్తించి బ్లాక్ చేశారు. ఈ యాప్ సైబర్ దాడుల నుంచి వినియోగదారు




లను హెచ్చరించడంతో పాటు, అనధికారిక యాక్సెస్‌ను కూడా నిరోధిస్తుంది. కొత్త ఆదేశాల ప్రకారం, 2025 డిసెంబర్ 1 నుంచి తయారయ్యే అన్ని స్మార్ట్‌ఫోన్‌లలో ఈ యాప్‌ను డిఫాల్ట్‌గా అందించాల్సి ఉంటుంది. ఇప్పటికే మార్కెట్‌లోకి వచ్చిన ఫోన్‌లకు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ ద్వారా దీన్ని ఇన్‌స్టాల్ చేయాలని సూచించారు. ఈ మార్పులను అమలు చేయడానికి మొబైల్ కంపెనీలకు 90 రోజుల సమయం ఇచ్చారు. ప్రభుత్వ నిర్ణయంపై యాపిల్, శాంసంగ్, గూగుల్ వంటి టెక్ దిగ్గజాలు ఎలా స్పందిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా యాపిల్ వంటి సంస్థలు తమ ఆపరేటింగ్ సిస్టమ్‌లో థర్డ్‌పార్టీ యాప్‌లను డిఫాల్ట్‌గా చేర్చడానికి ఇష్టపడవు. గతంలో ఇలాంటి ప్రతిపాదనలను వ్యతిరేకించిన దాఖలాలు ఉన్నాయి. ఈ యాప్ ద్వారా సైబర్ నేరాలు 20 నుంచి 30 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14